అక్టోబర్
2015

114

సంపుటి : 10 సంచిక : 5

వెల రు. 10 /-

## ఈ సంచికలో........

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు
కార్మికవర్గంపై అంతులేని దాడులు
ఉద్యోగ రాజ్య బీమా పథకాన్ని రక్షించాలి
హిందూత్వవాదుల కుటిల రాజకీయాలు
భారత సమాజాన్ని అధోగతికి దిగజార్చిన వర్ణవ్యవస్థ
వలసవాదం నయా ఉదారవాదం
విద్యుత్ సంస్కరణలు
తీవ్రమౌతున్న ఆర్థిక అంతరాలు
హిందూత్వవాదులను ఎదిరించిన కల్బుర్గి

## హిందూత్వవాదులను ఎదిరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి

# ప్రొఫెసర్ కల్బుర్గి


యల్.యస్. భారవి

దిగ్భ్రాంతిని కల్గించిన ఎమ్.ఎమ్. కల్బుర్గి హత్యతో ఒక గొప్ప పండితుడిని, విస్తృతంగా రచనలు చేసిన రచయితను, బహుముఖ ప్రజ్ఞా శాలిమైన పరిశోధకుడిని దేశం కోల్పోయింది. కర్నాటక చరిత్ర, సంస్కృతి, దాని జానపద సంపత్తిపైన అనితరసాధ్యమైన పట్టుగల మేధావిని హిందూ దురహంకారులు పొట్టన పెట్టుకున్నారు.

1988లో ఆచార్య మల్లేషప్ప మీడివలప్ప కల్బుర్గికి ఏభై సంవత్సరాలు నిండిన తరుణంలో ఆయన వ్యాసాల సంకలనాల మొదటి సంపుటి "మార్గ" అనే పేరిట ప్రచురిత మయ్యింది. ప్రముఖ పండితుడు జీవితకాలం లో లోతుగా సాగించిన పరిశోధనకు అది మకుటాయమైనది. కన్నడ వాఙ్మయ ప్రపం చంలో అది ఒక మైలురాయి. కనుకనే అది మహదానందపు తరుణంగా నిల్చిపోయి ఉ ండవల్సిన ఘటన. కాని ఆఘటన ఒక పెను సంక్షోభంగా పరిణమించింది.

ఆ సమయంలో ప్రచురితమైన తన ఒకనొక వ్యాసంలో కల్బుర్గి, వచన సాహిత్యంపై తన ప్రాథమిక పరిశోధన అధారంగాను, జానపద గాధల ఆధారంగానూ చెన్న బసవన్న నిమ్నకు లమైన "దోహార" (చర్మకారులు) కులంలో జన్మించారని పేర్కొన్నారు. 12వ శతాబ్దానికి చెందిన వేదాంతి చెన్న బసవన్న (1105-1167) బసవకి సన్నిహిత అనుచరుడు, మేనల్లుడు. నేడు ఉత్తర కర్నాటక ప్రాంతంలో ఒక విశిష్టమైన సామాజిక మత ఉద్యమాన్ని స్థాపించిన బసవను ఆయన అనుచరులైన లింగాయతులు, పరమ పూజనీయునిగా భావి స్తారు. లింగాయత మత ప్రబోధాల రూపు రేఖల కల్పనలో చెన్న బసవనే ఎక్కువగా కృషిచేశాడు. అందుచేత లింగాయతులలోని ఒక వర్గం కల్బుర్గి వెలిబుచ్చిన భావాల పట్ల ఆగ్రహం వెలిబుచ్చారు.

అప్పుడే మొట్టమొదటి సారిగా కల్బుర్గికి చంపుతామనే హెచ్చరిక అందింది. అది



అంతటితో ఆగిపోలేదు. కల్బుర్గియా, వాడెవడు? వాడిని అంతం చేయడానికి రెండు లీటర్ల పెట్రోలుంటే చాలు, అనేవ్యాఖ్యలు అప్పుడు ధార్వాడ్ అంతటా వినిపించేవి. అత్యంత అవమానకరమైన విషయం ఏమిటంటే అప్పటికే గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న కల్బుర్గిని ధార్వాడ్‌లోని ఒక ప్రముఖ లింగాయత మఠానికి, ఒక నేరస్తుడి పిలిపించినట్లు పిలిపించి, చేతులు జోడించి మరీ తన వ్యాఖ్యా లు ఉపసంహరించుకునేలా బలవంతం చేసా రు. ఆమఠం నుండి తిరిగి వచ్చిన తరువాత కల్బుర్గి ఒక విలేఖరి ప్రశ్నకు సమాధానంగా "నేను ఈ రోజు మేథోపరంగా ఆత్మహత్య చేసుకున్నాను" అని చెప్పాడు.

ధార్వాడ్‌లోని హిరేమల్లూర్ ఈశ్వరన్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపల్ శశిథర్ తోడ్కర్. కల్బుర్గికి పాత విద్యార్థి అయిన ఈయిన కల్బుర్గి ఇంటివసారాలో కూచుని ఈ ఘటనలను గుర్తు చేసుకొన్నారు. డెబ్బై ఐదు సంవత్సరాలు పైబడిన ఆ మేధావిని గుర్తు తెలియని వ్యక్తులు దారుడు ఆగస్టు 30నతుపాకీతో హత్య చేసిన వారం రోజుల తర్వాత ఆయన సన్నిహితులలో కొందరు ఆయన ఇంటిలో సమావేశమైనప్పుడు తోడ్కర్ ఈ ఘటనను గుర్తు చేసారు. గోవింద్ పన్సారే కోడలైన మేఘా పన్సారే, ఈ పండితుడి కుటుంబంతో బాధను పంచుకోవడానికి, కల్బుర్గి, పన్సారే, నరేంద్ర దభోల్కర్ హత్యలలో సారూ ప్యతల రీత్యా, కార్యాచరణ రూపొందించుకో వడానికి అక్కడికి వచ్చారు.

మేఘాపన్సారే మాట్లాడుతూ ఈ మూడు హత్యల మధ్య ఖచ్చితంగా సంబంధముండి ఉంటుందని, ఎందుకంటే ఆ ముగ్గురూ కూడా ప్రగతిశీల ఆలోచనా పరులు. మూఢాచారా లను ఖండిస్తూ ఉండేవారు. దభోల్కర్ హత్య జరిగి రెండేళ్ళయింది. పన్సారే దారుణహత్య జరిగి ఆర్నెల్లయింది. అయినా ఇంతవరకు ఆ కేసులలో పురోగతి లేదు. ఈ నేర పరిశోధనను తీవ్ర విషయంగా పరిగణించాలనినేను కర్నాటక ప్రభుత్వాన్ని కోరుతున్నాను" అని అమె అన్నారు. కర్నాటక పోలీసులుఇంతవరకు హంతకునిగాని, అతని సహచరునిగాని పట్టుకోలేదు.

ఆయన ఇంటిలో సమావేశమైనవారిని చూస్తేనే కల్బుర్గి ఘనత ఎంతటిదో మనకి తెలుస్తుంది. ఆయన ఇంటి వసారాలో చిరు నవ్వులు చిందిస్తోన్న కల్బుర్గి వినైల్ పోస్టర్ వేలాడుతోంది. ఆయన కుటుంబ సభ్యులతో పాటు, పత్రికా విలేఖరులు, ఇప్పుడు టీచర్లుగా పనిచేస్తున్న ఆయన మాజీ శిష్యులు, సాహితీవేత్తలు, సామాజిక కార్యకర్తలు వారిలో ఉన్నారు. కుటుంబ ఆస్తి విషయంలో తగాదానే హత్యకు కారణమనే పుకార్లను కల్బుర్గి కొడుకు శ్రీవిజయ్ ఖండించాడు. ఆయన చెప్పిన విషయాలు కొందరికి నచ్చలేదు. అందుకే ఆయనను చంపేసారు అన్నది స్పష్టంగా కనపడుతున్నది. శాంతికి మారుపేరుగా భావించే ధార్వాడ పట్టణంలో ఈ హత్య జరగడం దేశం లోని, కర్నాటకలోని ఉదారవాద, ప్రగతిశీల ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జంట నగరాలైన హుబ్లి, ధార్వాడ్‌లు కర్నాటకలో బెంగుళూరు తర్వాత రెండవ స్థానంలో ఉన్న పట్టణాలు. ఉత్తర కర్నాటకలో పారిశ్రామిక కేంద్రంగా హుబ్లి ప్రసిద్ధ గాంచగా, ధార్వాడ దాని సంస్కృతి, అక్కడ ఉన్న విద్యా సంస్థల మూలంగా ప్రసిద్ధమయింది. దేశంలో పేరు మోసిన హిందుస్తాని సాంప్రదాయ గాయకులలో ముందు వరుసలో నిలిచే కొందరు ఆ నగర వాసులే. అంతేకాక ఎంతో పేరు మోసిన కర్నాటక విశ్వ విద్యాలయానికి ఆవాసమైన ధార్వాడ కల్బుర్గి సంపన్నమైన మహుముఖ మేధో వికాసానికి ఆలంబనను చేకుర్చింది.

కల్బుర్గి పొరుగు జిల్లాయైన వియపుర (గతంలో బీజాపుర్) లోని గచ్చవాడ గ్రామంలో 1938, నవంబరు 28న జన్మించారు. ఆయన కన్న డంలో అండర్ గ్యాడ్యుయేషన్, "కవిరాజమార్గ"

(మిగతా 35వ పేజీలో)

# ఈ సంచికలో...


1. **హిందూత్వవాదులను ఎదిరించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రొఫెసర్ కల్బుర్గి**
ఎల్.ఎస్. భారవి ...... 2

2. **ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు**
బి వి రాఘవులు ....... 4

3. **బహుళజాతి సంస్థల లాభాలకు సౌలభ్యం కార్మికవర్గంపై అంతులేని దాడులు**
పి. మధు ....... 7

4. **ఉద్యోగ రాజ్య బీమా పథకాన్ని రక్షించాలి-విస్తరించాలి**
రవి దుగ్గల్ ............. 11

5. **జనాభా పెరుగుదల హిందూత్వవాదుల కుటిల రాజకీయాలు**
టి కె రాజలక్ష్మి, వెంకిటేష్ రామక్రిష్ణన్ . 15

6. **భారత సమాజాన్ని అధోగతికి దిగజార్చిన వర్ణవ్యవస్థ**
ఎం. నిర్మల్‌కుమార్ ..... 19

7. **వలసవాదం నయా ఉదారవాదం**
ఎ. కోటిరెడ్డి ............. 23

8. **విద్యుత్ బోర్డులను, వినియోగదారులను దివాళా తీయిస్తున్న విద్యుత్ సంస్కరణలు**
ప్రబీర్ పురకాయస్థ....... 26

9. **తీవ్రమౌతున్న ఆర్థిక అంతరాలు**
కొండూరు వీరయ్య ........ 29



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# డిజిటల్ ఇండియా!

గరీబీ భారత దేశాన్ని ఒక్కసారిగా డిజిటల్ ఇండియాగా మార్చేస్తానని ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్న మాటలూ, ఇటీవల అమెరికా పర్యటనలో దీనికోసం ఆయన చేసిన విన్యాసాలూ సగటు మధ్యతరగతి జీవికి కొంతకాలం భ్రమలు కల్పిస్తాయేమోగానీ అలో లక్ష్మణా అంటున్న కోట్లాది ప్రజల ఆకలినీ, అవసరాలను మాత్రం తీర్చలేవు. కానీ, ఇంటింటికీ ఇంటర్‌నెట్, ఫేస్‌బుక్, ట్విట్టర్, బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లు, ఆన్ లైన్ వ్యవసాయం, ఆన్ లైన్ చదువులు, ఆన్ లైన్ వైద్యం..... అంటూ మన పాలకులు ప్రతిరోజూ హోరెత్తిస్తున్న ప్రకటనలు సామాన్యుల్లో చెప్పలేనంత గందరగోళం మాత్రం సృష్టిస్తున్నాయి.

అసలిప్పుడు దేశ ప్రజలకు ఏం కావాలి? పాలకులు వారికి ఏం ఇస్తామంటున్నారు? భారత రైతాంగం ఇటీవలి చరిత్రలో ఎన్నడూ లేనంతటి తీవ్ర విపత్తునెదుర్కొంటున్నారు. కరువు కాటకాలొచ్చి ఆకలిబాధతో రైతులు చనిపోయిన రోజులను చరిత్రలో చూశాం. కానీ అన్నీ పండించి, రాశులుగా ధాన్యాలు ఆరబోసి, ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల సంగతి ఇప్పుడే చూస్తున్నాం. ఎప్పుడో ఒక సారి పత్రికల్లో ఎక్కడో ఒక మూల రైతు ఆత్మహత్య అని వచ్చే వార్తలు కాస్తా ఇటీవలి కాలంలో నిత్య సంగతులుగా మారిపోయాయి. పత్తి రైతు, శెనగరైతు, పొగాకు రైతు, చెరుకు రైతు, ధాన్యం రైతు...మొత్తం రైతాంగమే ఆత్మహత్యల బాట పడుతుంటే మన ప్రధాని, ముఖ్యమంత్రులు డిజిటల్ ఇండియా గురించి ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్నారెందుకు? దేశంలో 33 శాతం ఇళ్లకు నేటికీ కరెంటు లేకపోతే ఇంటింటికీ ఇంటర్‌నెట్ ఇస్తామని ఊరిస్తున్నారెందుకు? 44 శాతం మంది భారతీయులు పౌష్టికాహారం లేక క్షీణిస్తుంటే, 80 శాతం మంది రోజుకు రూ. 20 లోపు ఆదాయంతో బతుకులీడుస్తుంటే వారికి ఫేస్‌బుక్‌లూ, ట్విట్టర్లు తిండి పెడతాయని నమ్మబలుకుతున్నారెందుకు? ఉద్యోగాలు కావాలి, ఉపాధి కావాలని అరుస్తున్న యువతను 3జిలు, 4జిలతో కమ్మేస్తున్నారెందుకు?

ఎందుకంటే ప్రజల సమస్యలు తీర్చగలమన్న నమ్మకం మన పాలక వర్గాలకు పోయింది గనుక. స్వాతంత్రం వచ్చిన తరువాత మన పాలకులు ప్రజల జీవన పరిస్థితులను పూర్తిగా మార్చలేకపోయినా, వారిని దోపిడీ పీడనలనుండి విముక్తి చేయలేకపోయినా, ప్రభుత్వ రంగంలో కొంత ఉపాధి అవకాశాలు కల్పించారు. ఒక చేత్తో ప్రజలనుండి దోచేస్తూనే మరో చేత్తో కాస్త విదిలించేవారు. కానీ ఇప్పుడు - ప్రపంచీకరణ విధానాలు ముదురుపాకానికి వచ్చిన ఈ తరుణంలో వారి దగ్గర ప్రజలకు ఇవ్వడానికి ఏమీ లేవు, తీసుకోవడం తప్ప. రైతుల పంటలు నాశనమైనా ఫరవాలేదు, కార్పొరేట్ బేహారుల లాభాల పంటకు నష్టం రాకూడదు. సామాన్యుడు చితికిపోయినా బాధలేదు, ధనికుల ఆదాయాలకు ఏమాత్రం ధోకా ఉండకూడదు. ఇచ్చే చేతులు పోయి దోచుకునే చేతులు పెరిగిపోవడంతో సగటు భారతీయుడు బాధను తట్టుకోలేక విలవిల్లాడిపోతున్నాడు. వారి బాధను పాలక వర్గాలు ఎలాగూ తీర్చలేవు, కనీసం గతంలో లాగా లేపనాలు కూడా పూయగలిగే స్థితిలో లేవు. అందువల్లనే బాధలను మరిపించే భ్రమలను సృష్టించడానికి వారు పూనుకుంటున్నారు. డిజిటల్ ఇండియాలు, ఇంటింటికీ, ఊరూరికీ ఇంటర్‌నెట్‌లూ ప్రజల అసలు సమస్యలు తీర్చలేవని వారికీ తెలుసు. అందుకే సమస్యలనుండి ప్రజల దృష్టి మళ్లించే విన్యాసాలు చేస్తున్నారు. కానీ పాలకులు ఎల్లకాలం ప్రజలను భ్రమల్లో ఉంచలేరని చరిత్ర చాలా సార్లు రుజువు చేసింది.


**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు

**బి వి రాఘవులు**



రచయిత సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు

రిజర్వేషన్లు బలహీనవర్గాలకు, అంటే వివక్షకు గురయ్యే తరగతులకు ప్రభుత్వాలు ఇచ్చే సదుపాయం. బలహీనవర్గాలను ఆదుకోవడానికి, వారి పట్ల ఉండే వివక్షను నిర్మూలించడానికి ప్రభుత్వాలు అనేక రకాల చర్యలు తీసుకుంటాయి. వాటిలో రిజర్వేషన్లు ఒక భాగం. ప్రభుత్వాలు తీసుకునే వాటిని సానుకూల చర్యలు అంటాం. సానుకూలంగా తీసుకునే చర్యలు రకరకాల పద్ధతుల్లో ఉండొచ్చు. ఈ చర్యల సమూహంలో ఒక భాగమే రిజర్వేషన్లు. ఏదో ఒక రకమైన సానుకూల చర్యలు ప్రతి దేశంలోనూ ఉన్నాయి. అన్ని రకాల సానుకూల చర్యలు ఒక దేశంలోనే ఉండొచ్చు. కొన్ని దేశాల్లో కొన్ని రకాల చర్యలే ఉండొచ్చు. ఆ దేశంలో ఎవరైతే బలహీన వర్గాలుగా ఉంటారో, వివక్షకు గురవుతూ ఉంటారో అటువంటి వారికి సాయం చేసే ప్రయత్నాలు అన్ని దేశాల్లోనూ జరుగుతున్నాయి. అలాగే భారతదేశంలో కులవివక్ష అనేది ప్రధానాంశంగా ఉంది. ఇప్పటికి కూడా దళితులను అంటరానివారిగా చూస్తూ, వారిపట్ల అనేక విధాలుగా, అన్ని రంగాలలోనూ వివక్ష చూపుతున్నారు. బిసిలను అంటరానివారిగా చూడకపోయినా, వివక్షకు గురిచేస్తున్నారు. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని, కుల వివక్షకు గురవుతున్న వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని మనం కోరుతున్నాం.

మన దేశంలో మహిళల పట్ల కూడా వివక్ష చూపుతున్నారు. వివక్ష కొనసాగుతుంది కాబట్టి వారికి కూడా కొన్ని సానుకూల చర్యలు అమలు జరుపుతున్నారు. సానుకూల చర్యలలో భాగంగా స్థానిక సంస్థల్లో, ఉద్యోగాలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారు. అలాగే వికలాంగులకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించారు. అమెరికా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో జాతి వివక్ష ప్రాతిపదికన ఉండే వ్యత్యాసాలను, అసమానతలను అధిగమించడానికి కొన్ని సానుకూల చర్యలను అమలు జరుపుతున్నారు. చైనాలో వెనుకబడిన తెగలు, మైనారిటి జాతులు, కొండ ప్రాంతాలకు చెందిన ప్రజలు తదితరులను సమాజంలో అభివృద్ధి చెందినవారిస్థాయికి తీసుకురావడానికి సానుకూల చర్యలను అమలు చేస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశాన్ని పరిశీలన చేసినా ఏదో ఒక మోతాదులో, కొన్ని తరగతుల ప్రజలకు సానుకూల చర్యలను అమలు చేస్తున్నారు

అమెరికా మనకన్నా ముందు పెట్టుబడిదారీ, ప్రజాస్వామ్య దేశంగా అభివృద్ధి చెందింది. మనకన్నా ముందు రాజ్యాంగాన్ని, ఎన్నికల విధానాన్ని ఏర్పాటు చేసుకున్న దేశం. నూటికి 98 మంది పట్టణాల్లో నివసిస్తున్నారు. కులవివక్ష లేనటువంటి దేశం. అయినా అలాంటి దేశంలో కూడా వివక్ష మూలంగా ఇంకా సానుకూల చర్యలు అమలు జరుగుతూనే ఉన్నాయి. ఇంగ్లాండులో కూడా కొన్ని తరగతులకు సానుకూల చర్యలు అమలు జరుగుతున్నాయి. ఇంత అభివృద్ధి అయిన దేశాల్లో కూడా ఇప్పటికి ఈ సానుకూల చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వివక్ష ఉన్నంత కాలం, బలహీనవర్గాలు ఇతర తరగతులతో సమానంగా అభివృద్ధి కాలేనంతకాలం ఇటువంటి సానుకూల చర్యలకు డిమాండ్ ఉంటుంది. పాలకులు అలాంటి చర్యలను అవసరాన్ని బట్టి ఉపయోగించుకుంటారు.

ఈరోజు గుజరాత్‌లో పటేళ్ళ ఉద్యమం జరుగుతున్నది. ఇస్తే అందరికి రిజర్వేషన్లు ఇవ్వండి లేదా అందరికీ రద్దు చేయండనే నినాదంతో ఈ ఉద్యమం జరుగుతున్నది. ఇటువంటి డిమాండ్లు, ఆందోళనలు అన్ని దేశాల్లో వస్తున్నాయి. అయినా అ డిమాండ్లను బట్టి సానుకూల చర్యలేమి ఆగిపోవడంలేదు.

ప్రపంచంలో వివిధ దేశాల్లో సానుకూలమైన చర్యలు ఉన్నాయి. అన్ని దేశాల గురించి పరిశీలించకపోయినా మూడు దేశాల గురించి తెలుసుకుందాం. ఆ మూడు దేశాలే ఎందుకంటే, ఈ మూడూ విభిన్నమైన పద్ధతుల్లో ఉన్నాయి. ఆ మూడు దేశాల్లో అమెరికా ఒకటి. అమెరికాలో మహిళలు, నల్లజాతి ప్రజలకు సంబంధించి ప్రధానమైన సానుకూల చర్యలు తీసుకుంటున్నారు. వివిధ తరగతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగు చేయడం కోసం ఈ సానుకూల చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ రెండు తరగతులకు మాత్రమే పరిమితం చేయడం లేదు. లాటిన్ అమెరికన్ దేశాల నుండి వచ్చే స్పానిష్ మాట్లాడేవాళ్లు, మనలాంటి దేశాల నుండి వెళ్లిన ఆసియా జాతుల వారికి కొన్ని అవకాశాలు కల్పిస్తున్నాయి. వాళ్ల దేశ చట్టం ప్రకారం విశ్వవిద్యాలయాల్లో చదివేవాళ్లలో వైవిధ్యం ఉండాలి. ఈ వైవిధ్యాన్ని చూపించడం కోసం ఇక్కడి నుంచి తెలివైన విద్యార్థులను తీసుకెళ్లి, వాళ్లకి స్కాలర్‌షిప్‌లను ఇచ్చి విద్యాలయాలలో చేరుకొని వైవిధ్యాన్ని చూపిస్తున్నాయి. _రెడ్ ఇండియన్స్‌కు రిజర్వు చేసిన ప్రాంతం వారికి మాత్రమే ప్రత్యేకించి ఉంటుంది అమెరికాలో రిజర్వేషన్లు ఆ విధంగా అమలు జరుగుతున్నాయి. వైవిధ్యాన్ని పెంపొందించడం కోసం చర్యలు తీసుకుంటారు తప్ప రిజర్వేషను ఉండదు. ఇది అమెరికాలో పద్ధతి. మొట్టమొదట ఈ వైవిధ్యమనేది అందరికి వర్తించలేదు. ప్రభుత్వ సహకారం పొందే వాళ్లు ఈ వైవిద్యాన్ని పాటించాలి. ప్రభుత్వం సహాయం పొందని యూనివర్సిటీలు ఉంటాయి. సంస్థలు వుంటాయి. ఈ సానుకూలమైన చర్యలు అనేవి వ్యక్తుల పట్ల చూపిస్తే రాజ్యాంగానికి వ్యతిరేకం. ఈ

చర్చలు, గొడవలు అమెరికాలో కొనసాగు తున్నాయి. వైవిధ్యం పాటించని కంపెనీల మీద కేసులు వేస్తాయి. వైవిధ్యం ఎందుకు లేదు అని విచారణ చేస్తారు. వైవిధ్యం లేకపోతే ఒత్తిడి చేస్తారు. ఇలాంటివి కొన్ని ఫలితాలు ఇస్తాయి. రంగు వివక్ష చాలా దుర్భరమైంది. ఈ విషయంలో ఇంకా అమెరికాలో మార్పు లేదని అంటున్నారు.

ఇక రెండో దేశం మలేషియా. 70శాతం ప్రజలు మలయా జాతికి చెందిన వారు. పాలకవర్గాలు మలయా జాతి వాళ్లే. మలయా జాతికి చెందిన వాళ్లే రాజులు. మలయా జాతికి చెందిన వాళ్లే పాలన కొనసాగించేవారు. డచ్‌వాళ్లు మలయా పాలకులు ఒప్పందం చేసుకున్నప్పుడు ఆర్థికంగా కీలకమైన ప్లాంటేషన్స్‌ను డచ్, ఇంగ్లీషు వాళ్లు ఆక్రమించుకున్నారు. చిన్నచిన్న పనుల్లోకి మలయా ప్రజలను నెట్టివేశారు. వెట్టిచాకిరి, గొడ్డుచాకిరి చేసే పరిస్థితుల్లోకి మలయా జాతి ప్రజలు వెళ్లిపోయారు. చైనా నుండి వచ్చిన కూలీలు పరిశ్రమలలో పనిచేసేవారు. పరిశ్రమలు ఎక్కడుంటే పట్టణాలు అక్కడ ఉంటాయి. పట్టణాల్లో చైనా వాళ్లు ఉన్నారు. గ్రామాల్లో మలయా జాతి ప్రజలు ఉన్నారు. ఆర్థిక అసమానతలు పెరిగాయి. మలేషియా కు స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇది సామాజిక సమస్యగా తయారైంది. జాతీయ ప్రభుత్వాలు మలేజాతి ప్రజలకనుకూలంగా మలేషియాలో ఉండే ప్రతి కుటుంబానికి భూమి ఇచ్చారు. బ్యాంకుల అప్పులు, ఉద్యోగాల్లో 70శాతం ఇచ్చారు. ఈ పాతిక ముప్పై సంవత్సరాలలో మలయా జాతి ప్రజల్ని అక్షరాస్యుల్ని చేయాలని, వారిలో పెట్టుబడిదారీ వర్గాన్ని తయారు చేయాలని ప్రయత్నించారు. మలయా ప్రజలను అభివృద్ధి చేయటానికి ఈ సానుకూల చర్యలను తీసుకున్నారు.

ఉత్తర ఐర్లాండ్: మార్క్స్ ఇండియా గురించి రాసే దానికన్నా ముందే ఐర్లాండ్ గురించి రాశారు. జాతుల సమస్య గురించి రాసేటప్పుడు దీని గురించి రాసారు. ఐర్లాండ్ ఇంగ్లాండు పక్కనే ఉంటుంది. ఐర్లాండ్, ఇంగ్లాండు, స్కాట్లాండ్ పక్కపక్కనే ఉంటాయి. వీటన్నింటిని కలిపి గ్రేట్ బ్రిటన్ అంటారు. ఐర్లాండు ప్రధానంగా వ్యవసాయ దేశం. ఉత్తర ఐర్లాండులో క్యాథలిక్కులు దక్షిణ ఐర్లాండులో ప్రొటెస్టెంట్లు మెజారిటీగా ఉండేవారు. మొత్తంగా ఐర్లాండులో చూసుకుంటే ప్రొటెస్టెంట్లు మెజారిటీ. ఉత్తర ఐర్లాండు వీడిపోయిన తర్వాత క్యాథలిక్‌లు మైనారిటీగా మారారు. వారిని చాలా హీనంగా చూసేవారు. క్యాథలిక్కులు సాయుధ పోరాటం చేశారు. తర్వాత సంఘర్షణలను తగ్గించటం కోసం 1989లో ఫెయిర్ ఎంప్లాయిమెంటు చట్టం పెట్టారు. ఉపాధికి జనాభా నిష్పత్తిని పాటించడం వీటిలో ఒకటి. కొన్నిటికి అవసరమైన వారిలభ్యతను ప్రాతిపదికగా తీసుకున్నారు. ఒకవేళ అమలు జరపకపోతే కోర్టుకు వెళ్లొచ్చు. మూడు నాలుగు సార్లు విచారణ జరిపి ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఆ రకంగా సంఘర్షణను నివారించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మూడు దేశాలను పరిశీలిస్తే మూడు రకాల వివక్షను అధిగమించడానికి సానుకూలమైన చర్యలను ఉపయోగిస్తున్నారు.

> **“ రాజ్యాంగంలో దళితులకు విద్యా ఉద్యోగాలలో 17 శాతం రిజర్వేషన్లు గ్యారంటి చేశారు. అర్హులు లేకపోతే ఆ స్థానా లను ఖాళీగా ఉంచుతారు. జనాభా నిష్పత్తి ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఉంటాయి. రిజర్వేషన్లలో దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన తరగతులకు 50 శాతం పరిమితిని విధించారు. జనాభా శాతానికి అనుగుణంగా రిజర్వేషన్లు వర్తింపజేయాలి. ”**

**భారతదేశం:** రాజ్యాంగంలో దళితులకు విద్యా ఉద్యోగాలలో 17 శాతం రిజర్వేషన్లు గ్యారంటి చేశారు. అర్హులు లేకపోతే ఆ స్థానాలను ఖాళీగా ఉంచుతారు. జనాభా నిష్పత్తి ప్రాతిపదిక మీద రిజర్వేషన్లు ఉంటాయి. రిజర్వేషన్లలో దళితులకు, గిరిజనులకు, వెనుకబడిన తరగతులకు 50 శాతం పరిమితిని విధించారు. జనాభా శాతానికి అనుగుణంగా రిజర్వేషన్లు వర్తింపజేయాలి. అంబేద్కర్ కంటే ముందుగానే రిజర్వేషన్లు వచ్చాయి. బ్రిటిషు వారు కూడా రిజర్వేషన్లు అమలు జరిపారు. రిజర్వేషన్లు మొదట దళితుల కోసం రాలేదు. హిందు, ముస్లింలను విభజించటం కోసం వచ్చాయి. ప్రారంభంలో రాజకీయ రిజర్వేషన్లు ఉన్నాయి. కమ్యూనల్ అవార్డు పేరుతో దీనిని అమలు చేశారు. విద్య, ఉపాధిలో రిజర్వేషన్లు మొదట బ్రిటిషు ప్రాంతంలోని దక్షిణ భారత దేశంలో ప్రారంభమయ్యాయి. జాతీయోద్యమం దాన్ని అంగీకరించింది. బ్రహ్మణ వ్యతిరేక ఉద్యమం దక్షిణాన బలంగా ఉంది. జాతీయోద్యమానికి అప్పట్లో రెండు సమస్యలు ఎదురయాయి 1. బ్రిటిషు వారికి వ్యతిరేకంగా భారతీయులందరిని ఐక్యం చేయాలి. 2. మతపరమైన ప్రాతిపదిక మీద ముస్లింలను వేరుచేసి, ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేయాలనే బ్రిటిషు వారి ప్రయత్నాన్ని ఎదుర్కోవాలి. దేశం విడిపోనక్కర్లేదని, అందరి ప్రయోజనాల పరిరక్షణ కోసమే జాతీయో ద్యమం ఉందని చెప్పారు. అటు ముస్లింలకు ఇటు దళితులకు రిజర్వేషన్లు కల్పించాలి. ఆరకంగా పాలక వర్గాలు రిజర్వేషన్లను కల్పించాయి. ప్రారంభంలో అంబేద్కర్‌ని అప్పటి కాంగ్రెసు ప్రభుత్వం ముంబయిలో ఓడించింది. ఆ తర్వాత బెంగాల్ నుండి ముస్లిం లీగ్ అభ్యర్థిగా గెల్చి రాజ్యాంగ సభ సభ్యుడయ్యారు. దేశ విభజన నిర్ణయంతో ఆ స్థానాన్ని కోల్పోయారు. కాంగ్రెస్ మనసు మార్చుకుని ఉప ఎన్నిక ద్వారా ఆయనను మళ్లీ గెలిపించి రాజ్యాంగసభకు ఛైర్మెన్‌గా చేశారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపర్చడంలో ఆయన కీలకపాత్ర నిర్వహించారు.

వివక్ష అనేది అనేక రూపాల్లో ఉంటుంది. సామాజిక ,ఆర్థిక, ఉపాధి, లింగ భేదంతో ఉండొచ్చు. పనుల్లో వివక్ష, వృత్తిరీత్యా వివక్ష, సంపద పరంగా వివక్ష. తదితరాలున్నాయి. అంటరానితనం వివిధ రూపాల్లో ఉంటుంది.

భారతదేశంలో కులవివక్ష ప్రధానమైనది. సమాజ నిర్మాణంలో నుంచి వచ్చిన కులవివక్ష, ఆర్థిక, సామాజిక రూపాల్లో కొనసాగు తున్నది. రుణాల్లో వివక్ష, మార్కెట్లో వివక్ష, వినిమయంలో వివక్ష చూస్తున్నాం. విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో కూడా వివక్ష చూస్తున్నాం. భౌతికంగా కూడా వివక్షను చూస్తున్నాం.

సానుకూల చర్యలు కూడా అనేక రూపాల్లో ఉండవచ్చు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, విద్యలో రిజర్వేషన్లు అటువంటివే. కోటా విధానం, అలాగే ఇంకా అనేక రూపాల్లో సంక్షేమ హాస్టళ్లలో నూటికి నూరుశాతం దళితులు, గిరిజనులు ఉంటారు. సానుకూల చర్యల్లో రిజర్వేషన్లు అనేది ఒకటి. ఉపాధిలో వాటా

**“ ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించ టానికి బిజెపి వ్యతిరేకంగా ఉంది. ప్రభుత్వ రంగంలో ఉన్న రిజర్వేషన్లను సైతం రద్దు చేయాలని ఆర్‌యస్‌యస్, బిజెపిలు చర్చను ప్రారంభించాయి. నిరుద్యోగం పెరిగే కొద్ది దళి తులు, గిరిజనుల్లో చేరితే మాకు కూడా ఉద్యోగాలు వస్తాయన్న ఆశలు పెరుగుతున్నాయి. ”**

కోసం ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు కావాలనే డిమాండు ముందుకొచ్చింది. సరళీకరణ విధానం తర్వాత అభివృద్ధి సమస్య ముందుకు వచ్చింది. అభివృద్ధికి సంబంధించి బడ్జెట్‌లో వాటా ఉండాలి. సబ్‌ప్లాన్ పరంగా అభివృద్ధి పథంలో ముందుకు పోవచ్చు. బడ్జెట్‌ను ధనవంతులు ఉపయోగించుకోవడం ఇప్పుడు ఎక్కువైంది.

సరళీకరణ విధానంలో సామాజిక న్యాయం దెబ్బతింది. విద్య, వైద్య సేవలను డబ్బు రూపంలోకి మార్చారు. రక్షిత మంచినీటి పథకం స్థానంలో నీళ్లని కొనే పద్ధతిని రుద్దుతున్నారు. గ్యాస్‌సబ్సిడీ, విద్యుత్ సబ్సిడీ తీసేస్తామం టున్నారు. ఉచితంగా పొందే సర్వీసులన్నింటిపై ఇలా దాడి చేస్తున్నారు.

బలహీనవర్గాలకు ఉపయోగపడే ఉపాధి హామీ, మధ్యాహ్న భోజన పథకానికి, రిజర్వేషను అనేవి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వాటిలో అమలు జరుగుతాయి. ప్రభుత్వ రంగంలో కూడా కాంట్రాక్టు పద్ధతి ద్వారా ఉద్యోగాలను ప్రయివేటీకరణ చేస్తూ, రిజర్వే షన్లను వమ్ము చేస్తున్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న వాటిలో కూడా మినహాయింపు ఉన్నాయి. సరళీకరణ విధానాల వల్ల ఉన్న ప్రభుత్వ రంగం ప్రయివేటీకరణ అవుతున్నది.

పర్మినెంటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ తదితర పేర్లతో కార్మికులను తీసుకుంటున్నపుడు రిజర్వేషన్లు అమలు కావటం లేదు. ఉన్న ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుంటే రిజర్వేషన్లు ఉంటాయి. చాలా సంఘాలు మొక్కుబడిగా చేస్తున్నాయి. రాజ్యాంగంలో పెట్టిన రిజర్వే షన్లను బహిరంగంగా రద్దుచేసే శక్తి పాలక వర్గాలకు లేదు. ఈ రిజర్వేషన్లు ఉండే మూడు అంశాల కోసం పోరాటాలు చేయాలి. ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోవడం, విద్యలో ప్రయివేటు రంగం ఉండకూడదనే డిమాండు చేయాలి. ప్రభుత్వ రంగాన్ని మనం రక్షించుకోవాలి.



డా॥ బి.ఆర్. అంబేద్కర్

కాబట్టి ఈ సరళీకరణ విధానాలు తీసుకున్న ప్పుడు సామాజిక న్యాయం గురించి ఆలోచిం చాలి. ఉపాధి లాంటి వాటి కన్నా రాజకీయ రంగంలో రిజర్వేషన్లు ఉండాలని పాలకవర్గాలు ప్రయత్నం చేస్తాయి. పాలకవర్గాల్లో వైవిధ్యం ఉండాలని కోరుకుంటారు. 100మంది పెట్టుబడి దారులుంటే కొంతమంది దళితులు ఉండటం, కొంత మంది ముస్లింలు ఉంటే పాలక వర్గాలకు లాభం. సానుకూలమైన చర్యలు అనేవి పెట్టుబడిదారులకు ఉపయోగపడేవి తప్ప విప్లవాలను ఉధృతం జ్ఞాపకం పెట్టుకోవాలి.

పెట్టుబడిదారులకు ఇప్పుడు ప్రభుత్వ రంగ అవసరం తీరిపోయింది కాబట్టి రద్దు చేయమంటున్నారు. ప్రభుత్వ రంగం ఉంటే కొన్ని ప్రయోజనాలు పొందవచ్చు. కాబట్టి మనం ఉంచమంటున్నాం. ఇతర అంశాలలో రిజర్వేషన్లు సక్రమంగా అమలు జరగకపోయినా రాజకీయ రిజర్వేషన్లు బలహీనవర్గాల్లో పకడ్బందీగా అమలు జరుగుతున్నాయి. రాజకీ య రిజర్వేషన్లు పాలకవర్గాలను సృష్టించడా నికి ఒక మార్గం. సామాజిక న్యాయం కోసం జరిగే పోరాటంలో ప్రైవేటురంగంలో రిజర్వే షన్ల కోసం జరిగే పోరాటం ముఖ్యమైన అంశంగా ఉంది.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు వద్దు అనే వాదనకు, రిజర్వేషన్లను రద్దు చేయాలి అనే వాదనకు పెద్ద వ్యత్యాసం లేదు. కొత్త వాదన ఏమిటంటే విదేశీ పెట్టుబడులు వస్తే మనదేశం అభివృద్ధి అవుతుంది. సమ్మెలు, ఆందోళనలు చేస్తే విదేశీ పెట్టుబడులు రావనే పేరుతో కార్మికుల సమ్మెలు, ఆందోళనలపై ఆంక్షలను విధిస్తున్నారు. కార్మిక చట్టాలు అమలు చేస్తే విదేశీ పెట్టుబడులు రావు. అలాగే సరళీకరణ విధానాలకు, రిజర్వేషన్లకు పొత్తు కుదరదని ప్రచారం చేస్తున్నారు. సరళీకరణ విధానంలో మార్కెట్టు అన్ని అంశాలను నిర్ణయం చేయాలి. చట్టాలు యజ మానుల కనుకూలంగా, పట్టువిడుపులతో వినియోగించుకొనే విధంగా ఉండాలి. రిజర్వే షన్లు యజమాని తన అవసరాలకను గుణంగా కార్మికులతో వ్యవహరించటానికి అటంకం కల్పిస్తాయి. అందువలన ప్రయివేటీకరణ విధా నాలు తీవ్రమౌతున్న క్రమంలో విదేశీ పెట్టుబ డుల రాక, అభివృద్ధి పేరుతో పాలకవర్గాలు రిజర్వేషన్లకు మొత్తంగా ఎసరు పెడుతున్నాయి.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించ టానికి బిజెపి వ్యతిరేకంగా ఉంది. ప్రభుత్వ రంగంలో ఉన్న రిజర్వేషన్లను సైతం రద్దు చేయాలని ఆర్‌యస్‌యస్, బిజెపిలు చర్చను ప్రారంభించాయి. నిరుద్యోగం పెరిగే కొద్ది దళి తులు, గిరిజనుల్లో చేరితే మాకు కూడా ఉ ద్యోగాలు వస్తాయన్న ఆశలు పెరుగుతున్నాయి.

ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు వస్తే బాగుపడతామని అనుకునేవాళ్లు చాలా మంది ఉంటారు. మధ్యతరగతి వాళ్ళు ప్రయివేటు రంగంలో రిజర్వేషన్ల పట్ల ఆసక్తిగా ఉన్నారు. ప్రైవేటురంగంలో రిజర్వేషన్లపై ఆసక్తి ఉన్న తరగతుల నన్నిటినీ సమీకరించాలి. రిజర్వే షన్లతో పాటు సబ్‌ప్లాన్ కోసం జరుగుతున్న ఆందోళనలోనూ వీరిని భాగస్వాములుగా చేయాలి. ఈ విధంగా ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆందోళన బలోపేతమైతేనే, ఈ కోర్కెలను సాధించుకోవటం సాధ్యమౌతుంది. సామాజిక న్యాయానికి సంబంధించిన ఈ ముఖ్యమైన అంశం మీద మనం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ❋

**ప్రపంచ బ్యాంకు నివేదిక**

## బహుళజాతి సంస్థల లాభాలకోసమే

# కార్మికవర్గంపై దాడులు

**పి. మధు**



రచయిత సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి

ప్రపంచబ్యాంకు 14-09-2015న విడుదల చేసిన 'వాణిజ్యం చేయటంలో సౌలభ్యం' నివేదికలో దేశంలో గుజరాత్ తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రెండవ స్థానం ఇచ్చా రు. గుజరాత్ 71.14 శాతం పాయింట్లతో మొదటి స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ 70.12 శాతం పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది.

కన్సల్టెన్సీ సంస్థ కెపియంజి, బడా పారిశ్రామికవేత్తలకు నాయకత్వం వహించే సంస్థలైన సిఐఐ, యఫ్ఐసిసిఐ (ఫిక్కి)లు," డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పోలసి అండ్ ప్రమోషన్" సంస్థలు మోడి ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా రూపొందించిన నివేదికలో ప్రపంచబ్యాంక్ ఈ విధమైన ర్యాంకులివ్వటం ఏ మాత్రం ఆశ్చర్యం కలిగించదు.

ఈ నివేదికను రూపొందించటంలో భారత ప్రభుత్వం ఇచ్చిన సహకారం గురించి ప్రపంచబ్యాంకు డైరెక్టర్ 'ఒన్నో రుహుల్' మెచ్చుకున్నాడు. మోడి ప్రభుత్వం అందించిన ఊగిసలాటలులేని, నిరంతరాయమైన సహకారాన్ని గురించి ఆయన ముందుమాటలో ప్రశంసించాడు. ప్రధాని నరేంద్రమోడికి అత్యంత ఇష్టమైన కార్యక్రమమైన "మేక్ ఇన్ ఇండియా" లోగోను ఈ నివేదికపై ముద్రించారు. బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు, తమకు మిత్రులుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల గురించి ప్రపంచస్థాయిలో సానుకూలంగా ప్రచారం చేయటం లక్ష్యంగా ఈ రేటింగ్‌లను ఇచ్చారని అర్థం చేసుకోవటం కష్టమేమీకాదు.

ఈ నివేదికను బట్టి ప్రపంచబ్యాంకు పాలనను ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టటానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ప్రపంచబ్యాంకు పాలన వికేంద్రీకరణ (ఫెడరల్) విధానంలో రాష్ట్రాలకు ఉన్న హక్కులను హరించటమే కాక, దేశ సార్వభౌమత్వానికి కూడా ప్రమాదం కలిగిస్తుంది.

**కార్మికవర్గంపై ముప్పేటదాడి**

నివేదికలో పేర్కొన్న అంశాలు కార్మికవర్గ హక్కులపై బహిరంగదాడికి ఉద్దేశింపబడ్డాయి. పరిశ్రమలపై ప్రభుత్వ నియంత్రణను, తనిఖీలను పరిమితం చేసుకోవాలని చెప్పిన నివేదిక కార్మిక చట్టాలలో పూర్తిస్థాయి సంస్కరణలు తీసుకురావాలని చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వాలను అడిగిన 285 ప్రశ్నలలో 50 కార్మిక చట్టాల అమలుకు సంబంధించినవి, 61 పర్యవేక్షణకు సంబంధించినవి ఉన్నాయి. 111 ప్రశ్నలు కార్మిక చట్టాల అమలు, సంస్థలలో పర్యవేక్షణకు సంబంధించినవి అని స్పష్టంగా అర్థమవు తున్నది. 16వ పేజీలో 10 విభాగాలలో చేయవలసిన సంస్కరణలను గురించి వివరించారు. అవి బోనస్ చట్టం అమలు తీరు, గ్రాట్యుటి చట్టం, కనీస వేతనాల చెల్లింపు చట్టం, షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, సమాన వేతనాల చట్టం, ఎనిమిది గంటల పని చట్టం లాంటివాటిని సరళీకరించాలన్నారు. లేబరు ఇన్స్‌పెక్టర్ల తనిఖీలకు సంబంధించి షరతులు విధించాలని చెప్పారు.

ఈచట్టాలను సరళీకరిస్తే కార్మికులకు ఇపుడున్న అన్ని హక్కులు నిరాకరించబడతాయి. సమ్మెహక్కు వమ్మైపోతుంది. కార్మికులు పూర్తిగా యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి పనిచేయాల్సి వస్తుంది.

ఈ చట్టాలన్నింటినీ సరళీకరించాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెట్టుబడిదారుల లాభాల దాహార్తికి అడ్డుకట్ట వేయటానికి గుడ్డిలోమెల్లగానైనా దోహదం చేసే, కార్మిక చట్టాల ఉల్లంఘనను తనిఖీ చేయటానికి ఇక ఇన్స్‌పెక్టర్లుండరు. తనిఖీ చేయటానికి తగినంత మానవశక్తి లేదని, ప్రభుత్వ సంస్థల శక్తిసామర్థ్యాలు ఆశించినంతగా లేవని, పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు స్వయంగా సర్టిఫికేట్ ఇచ్చుకోవటం, లేదా మూడో పార్టీ సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని అమలు చేయడానికి నివేదిక అన్ని రాష్ట్రాలకు అవకాశం ఇచ్చింది.

14 కార్మిక చట్టాల అమలుపై తనిఖీలను రద్దుచేసినందుకు, ఐదు సంవత్సరాలకు ఒకసారి ఒకరోజు మాత్రమే తనిఖీని నిర్వహిస్తున్నందుకు, పరిశ్రమల రెన్యూవల్స్, రిటర్న్‌లపై స్వయం సర్టిఫికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టినందుకు జార్ఖండ్ ప్రభుత్వాన్ని నివేదిక అభినందించింది.

**రైతాంగంపై చరిత్ర ఎరుగని దాడి - భూబ్యాంకు ఏర్పాటు ముసుగులో భూదురాక్రమణ**

వాణిజ్యం చేయటానికి, పరిశ్రమలను ఏర్పాటు చేయటానికి భూమి అందుబాటులో లేకపోవటం పెద్ద ఆటంకంగా ఉందని నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సెజ్‌ల వద్ద పెద్దమొత్తంలో భూమి ఉందని, అందులో పరిశ్రమలను ఏర్పాటు చేయకపోవటంతో ఆభూమి ఖాళీగానే ఉందనే విషయాన్ని కావాలనే నివేదికలో చెప్పలేదు. ఇప్పటికి రాష్ట్రంలో ఉన్న 36 సెజ్‌ల వద్ద (కాకినాడ సెజ్ వద్ద 10,000 ఎకరాల భూమి ఉన్నది) లక్షలాది ఎకరాల భూమి నిరుపయోగంగా ఉన్నది. ఆ భూమిని వెనక్కి తీసుకోవటానికిగానీ, పరిశ్రమలను ఏర్పాటు చేయటానికిగానీ ప్రభుత్వం చేసింది శూన్యం.

2013 భూసేకరణ చట్టానికి వ్యతిరేకంగా రైతుల నుండి భూములను లాక్కోవటానికి చంద్రబాబు ప్రభుత్వం శరవేగంతో పనిచేస్తున్నది. భూసేకరణకు సంబంధించి మోడి ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ పార్లమెంటు ఆమోదం పొందనప్పటికీ, ఆ ఆర్డినెన్స్‌లోని

**❝ 2013 భూసేకరణ చట్టానికి వ్యతి రేకంగా రైతుల నుండి భూములను లాక్కోవటానికి చంద్రబాబు ప్రభుత్వం శరవేగంతో పనిచేస్తున్నది. భూసేకరణకు సంబంధించి మోడి ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ పార్లమెంటు ఆమోదం పొందనప్పటికీ, ఆ ఆర్డినెన్స్‌లోని అంశాలను అమలు చేస్తూ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలరాయటానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకున్నది. ❞**


కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల ఆందోళన

అంశాలను అమలు చేస్తూ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని కాలరాయటానికి చంద్రబాబు ప్రభుత్వం పూనుకున్నది.

భూసేకరణ వలన వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు, ఇతర పేదలపై పడే ప్రభావాన్ని అధ్యయనం చేయటం, భూసేకరణకు రైతుల అంగీకారాన్ని పొందటం తదితర అంశాలను చంద్రబాబు ప్రభుత్వం పక్కన పెట్టింది. ప్రభుత్వం బుల్‌డోజర్‌లాగా వ్యవహరిస్తూ, భూ బ్యాంకు ముసుగులో భూదురాక్రమణ చేస్తూ, వ్యతిరేకిస్తున్న రైతుల గొంతులను నొక్కేస్తున్నది. దుర్బలంగా ఉన్న జీవావరణానికి తీవ్రమైన నష్టాన్ని కలిగించే పరిశ్రమలకు కూడా అనుమతులు మంజూరు చేస్తున్నారు.

ఇప్పటికే ప్రైవేటువారి లాభాల కోసం చిన్నరైతుల నుండి భూములను లాక్కుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ప్రపంచబ్యాంకు నివేదిక మరింత ప్రోత్సాహాన్నిస్తుంది.

భూమి రికార్డులను డిజిటలైజ్ చేయాలని, అవి ఆన్‌లైన్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులలో, యంఆర్‌వో, మునిసిపల్ ఆఫీసులలో అందుబాటులో ఉంచాలని నివేదికలో చెప్పారు. ఈ మూడు స్థాయిలలో అంకెల వివరాలను సమన్వయం చేయటం దేశంలో ఇంకా జరగలేదు. మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో మాత్రం ఈ సమన్వయాన్ని పూర్తి చేశారు. ఈ అంశాలను సమన్వయం చేయటంలో మనదేశం వెనుకబడి ఉందని నివేదికలో పేర్కొన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌తో కలిపి 11 రాష్ట్రాలు రెవిన్యూ, రిజిస్ట్రార్ ఆఫీసుల స్థాయిలో అంకెల వివరాలను సమన్వయం చేశాయి. భూబ్యాంకులో భూమి లభ్యతను, "జిఐయస్" ద్వారా దానిని సమర్ధవంతంగా నిర్వహించటం గురించి నివేదికలో పునరుద్ఘాటించారు.

ప్రపంచబ్యాంకు నివేదిక 'వాణిజ్య లాభాలకు సౌలభ్యం' కలిగించటంలో భారతదేశం గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం రెండు స్థానాలు దిగజారింది. 189 దేశాలలో 142వ స్థానానికి చేరింది. ఆశ్చర్యం గొలిపే విషయమేమిటంటేభారతదేశం 2017 నాటికి పై స్థాయిలోని 50 దేశాలలో స్థానం సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ప్రపంచబ్యాంకు 'వాణిజ్య లాభాలకు సౌలభ్యం' నివేదికలో భారతదేశం ఈ సంవత్సరం తనస్థాయిని మెరుగుపరచుకోనున్నట్లు వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల మొదట్లో చెప్పటం పరస్పరం సంబంధం లేని విషయాలు కావు. రేటింగ్స్ వెనుకనున్న లక్ష్యాలు స్థిరమైనవి. పెట్టుబడిదారీ వర్గానికి ఎర్రతివాచీ స్వాగతం చెప్పటానికి, వారికి పెద్దమొత్తంలో సబ్సిడీలివ్వటంతో పాటు భూమి, నీరు, విద్యుత్, గనులలాంటి ఇతర వనరులను అప్పగించటానికి గానూ రాష్ట్రాలకు దిశానిర్దేశం చేయటానికి వ్యూహాత్మకంగా చేసిన ప్రయత్నమే ఈ నివేదిక.

**రేటింగ్ రాజకీయాలు**

ప్రపంచబ్యాంకు భారతదేశంలోని రాష్ట్రాలకు రేటింగ్‌లు ఇవ్వటం పట్ల ఇప్పటికే దేశంలోని కొన్ని రాజకీయ పార్టీలు, ప్రముఖ వ్యక్తులు వ్యతిరేకతను వ్యక్తం చేశారు. దేశంలో తాను చెప్పినట్లు వినని రాష్ట్రాలపై వత్తిడిచేసి, తనదారికి తెచ్చుకోవటం కోసం రేటింగ్స్‌ను సాధనాలుగా ప్రపంచబ్యాంకు వినియోగించుకొంటున్నదని చాలామంది మేధావులు వ్యాఖ్యానించారు. ఈ రేటింగ్స్‌కు ఏ మాత్రం విలువ లేదని కొందరు విద్యావేత్తలు చెబుతున్నారు. ఉదాహరణకు 2000-2014 మధ్యకాలంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించటంలో మహారాష్ట్ర అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో తమిళనాడు, కర్నాటక, గుజరాత్ లున్నాయి. కాని ప్రపంచబ్యాంకు ర్యాంకులలో గుజరాత్‌కు మొదటి స్థానం ఇచ్చారు. అలాగే కేరళ, కర్నాటకలు 18, 19 స్థానాలలో ఉన్నాయి. అభివృద్ధిలో అట్టడుగు స్థానంలో ఉన్న రాష్ట్రాలలో ఒకటైన జార్ఖండ్‌కు మూడవ స్థానం ఇవ్వడం గమనించాల్సిన విషయం. తగిన మౌలిక సదుపాయాలులేని కారణంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాకకు అవకాశాలు కోల్పోయిన ఒడిస్సాకు ఏడవస్థానం ఇచ్చారు. విదేశీ పెట్టుబడులలో 7 శాతాన్ని ఆకర్షిస్తున్న తమిళనాడుకు ఆశ్చర్యకరంగా 12వ స్థానం ఇచ్చారు. వీటిని ప్రశ్నించేవారికి "వాణిజ్యం చెయ్యటం, ర్యాంకులివ్వటం" వేరువేరు విషయాలని వారు సమాధానాలు చెబుతున్నారు. వారు చెబుతున్న మాటలు, చేస్తున్న పనులను పరిశీలిస్తే ప్రపంచబ్యాంకు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొనే రేటింగ్‌లు ఇస్తున్నదని స్పష్టమౌతున్నది. ఊహించిన విధంగానే అవి రాజకీయ పరంగా వత్తిళ్ళను తెస్తున్నాయి. భూ దురాక్రమణలు, కార్మికు లకున్న చట్టపరమైన రక్షణల సడలింపు, పర్యావరణ అనుమతుల సడలింపు రాష్ట్రాల పారిశ్రామిక అభివృద్ధి విధానానికి ప్రధానాంశాలుగా ప్రపంచబ్యాంకు చూస్తుందనేది దీనివల్ల తెలుస్తున్నది. పెద్ద ఎత్తున అసంతృప్తి పెరుగుతున్న తరుణంలో, రైతాంగం తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా చంద్రబాబునాయుడు ప్రభుత్వం పెద్దమొత్తంలో భూసేకరణకు పూనుకున్న తరుణంలో ఈ నివేదిక వెలువడింది.

అభివృద్ధి 'సాధించాలనే లక్ష్యం ఉన్న నాయకుల' ( యాస్పైరింగ్ లీడర్స్) కేటగిరీలో

ఆంధ్రప్రదేశ్‌ను చేర్చారు. ఈ దిగువ పేర్కొన్న ఎనిమిది రంగాలలో సంస్కరణలఅమలు స్థాయి 98 శాతం ఉందని నివేదికలో అంచనా వేశారు.

**ర్యాంకులు ఇవ్వటానికి పరిగణనలోకి తీసుకున్న అంశాలు**

1.వ్యాపారాలను ఏర్పాటు చేయటం. 2.భూమి కేటాయించటం, నిర్మాణాలకు అనుమతులు 3.పర్యావరణం 4.కార్మిక చట్టాలు 5. మౌలిక సదుపాయాలను వినియోగించు కోవడం 6. రిజిష్టర్ చేయటం, పన్ను రాయితీల అమలుకు అనుగుణంగా వ్యవహరించటం 7.ఇన్‌స్పెక్షన్ల అమలును క్రమబద్ధీకరించటం 8. కాంట్రాక్టులను అమలు చేయటం.

ప్రపంచబ్యాంకు నివేదిక ననుసరించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసిన కీలకాంశాలు.

1. ఏకగవాక్ష విధానం: అప్లికేషన్, ఫైలింగ్, ట్రాకింగ్, అనుమతులివ్వటం కోసం ఆన్‌లైన్ ఏకగవాక్ష విధానాన్ని ఏర్పాటు చేసింది.
2. రిజిస్ట్రేషన్: బేసిక్ డాక్యుమెంట్లను మాత్రమే పరిశీలించి వివిధ రిజిస్ట్రేషన్లకు అక్కడి కక్కడే ఆమోదం తెలపటం.
3. కార్మికులు: స్వయం సర్టిఫికెట్‌ను అందజేస్తే ఫ్యాక్టరీ రిజిస్ట్రేషన్‌కు అమోదాన్ని తెలియజేయటం.
4. కార్మికులు: వివిధ చట్టాల కింద ఇబ్బం దులను పరిగణనలోకి తీసుకొని కంప్యూ టరైజ్డ్ తనిఖీలకు అనుమతించటం, శాంపిల్ ప్రాతిపదికగా ఇన్‌స్పెక్టర్లను కేటాయించటం.
5. కార్మికులు: పరిశ్రమలు, వ్యాపారాలకు సంబంధించిన అంశాలతో నిమిత్తం లేకుండా వివిధ చట్టాల కింద రిజిస్ట్రేషన్లకు, రెన్యూవల్స్‌కు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయటం.
6. భూమి: అత్యవసర ప్రాతిపదికపై పారిశ్రామిక భూముల గుర్తింపు, భూముల వద్దకు వెళ్ళటానికి తగిన మార్గాలు, మౌలిక సదుపాయాలను కల్పించటం.
7. పన్నులు: రిజిస్ట్రేషన్లు, వ్యాట్, ఇతర విధాలైన రాష్ట్ర పన్నుల కింద పన్ను చెల్లింపు సౌలభ్యం కలిగించటం ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయటం.

> **"ఫ్యాక్టరీ లైసెన్సులు దీర్ఘకాలానికి ఇవ్వాలని, ఫిర్యాదులున్న పారిశ్రామిక, వాణిజ్య సంస్థలలోనే తనిఖీలు చేయాలని చెప్పింది. కాలాన్ని వృధా చేయకుండా ముందుగా అనుమతి తీసుకొని తనిఖీలు నిర్వహించాలి. ఇన్‌స్పెక్టర్లపై భారం తగ్గించటం కోసం అన్ని పరిశ్రమలలో చేయాల్సిన తనిఖీలను వ్యక్తులకు బదులుగా సమిష్టిగా చేయించటానికి యజమానులకు పూర్తి స్వేచ్ఛ నిచ్చింది."**



ప్రపంచబ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల సమావేశం

"ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ రాష్ట్రాలు మాత్రమే వీటిలో నాలుగు ప్రశ్నలకు 'ఔను' అని సమాధానం ఇచ్చాయి" అని ప్రపంచబ్యాంకు నివేదికలో చెప్పారు.

నివేదికలో 44 ప్రశ్నలు యజమానులు చెల్లించాల్సిన పన్నులకు సంబంధించినవిగా ఉన్నాయి. పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి, వాణిజ్యం నిర్వహించటానికి అవసరమైన మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రశ్నలు 21 మాత్రమే ఉండటం ఆసక్తికరం.

ఫ్యాక్టరీ లైసెన్సులు దీర్ఘకాలానికి ఇవ్వాలని, ఫిర్యాదులున్న పారిశ్రామిక, వాణిజ్య సంస్థలలోనే తనిఖీలు చేయాలని చెప్పింది. కాలాన్ని వృధా చేయకుండా ముందుగా అనుమతి తీసుకొని తనిఖీలు నిర్వహించాలి. ఇన్‌స్పెక్టర్లపై భారం తగ్గించటం కోసం అన్ని పరిశ్రమలలో చేయాల్సిన తనిఖీలను వ్యక్తులకు బదులుగా సమిష్టిగా చేయించటానికి యజమానులకు పూర్తి స్వేచ్ఛనిచ్చింది. డిస్కాంలు, ఇతర ప్రభుత్వ డిపార్టుమెంట్లు మొదట తనిఖీలు చేసి తర్వాత వాణిజ్య, పారిశ్రామిక సంస్థలకు విద్యుత్ కనెక్షన్లిచ్చే ప్రస్తుత విధానాన్ని రద్దుచేసి, మూడోపార్టీ కాంట్రాక్టర్లకు ఆ బాధ్యతను అప్పగించాలని చెప్పింది. ప్రతి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేయటం వలన కాలం వృధా అవుతుం దని, అపుడపుడు మచ్చుకు తనిఖీలు చేస్తే సరిపోతుందని చెప్పింది.

సింగిల్‌విండో విధానాన్ని ప్రవేశ పెట్టినందుకు పంజాబ్ ప్రభుత్వాన్ని అభినం దించింది. అదే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశపెట్టమని ప్రభుత్వానికి సలహా ఇచ్చింది. కార్మిక చట్టాలలో సంస్కరణల అమలు విషయానికి వచ్చేసరికి జార్ఖండ్ మొదటి స్థానంలో ఉండగా ఎపి నాలుగవ స్థానంలో ఉంది. పన్నుల సంస్కరణల అమలు విషయంలో కర్నాటక మొదటి స్థానంలో ఉండగా ఎపి రెండవ స్థానంలో ఉంది. భూమి కేటాయింపు, నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయ టంలో మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా,

**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**– ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక, ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

> **"వాణిజ్యం చేయటాన్ని సరళీకరించాలనే ముసుగులో అన్ని విధాలైన తనిఖీల వ్యవస్థను రద్దు చేయాలని ఆయన కోరాడు. పెట్టుబడుల రాకను వేగవంతం చేయటానికి మరింత వేగంగా సంస్కరణలను అమలు చేయాలని, తనిఖీల వ్యవస్థ నుండి దూరంగా ఉండాలని, నివేదిక రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన పిలుపునిచ్చింది."**

ఎపి ఐదవ స్థానంలో ఉంది. ఎపి ప్రభుత్వం ఏడు విభాగాలలో సంస్కరణలను ప్రారంభించిందని, వాటిలో మూడు కార్మిక చట్టాలలో సంస్కరణలకు సంబంధించినవి కాగా మిగతా నాలుగు పన్నులు, భూమి, రిజిస్ట్రేషన్, ఏక గవాక్ష విధానానికి సంబంధించినవని చెప్పింది.

చట్టాలను, నిబంధనలను పక్కనపెట్టి, సంస్కరణలను అమలు చేస్తున్న రాష్ట్రాలను మెచ్చుకోవటానికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నారు. అన్ని కార్మిక చట్టాలను, నిబంధనలను పక్కనపెట్టి లేబర్ మార్కెట్‌లో పట్టువిడుపులతో వ్యవహరించాలని, ఎప్పుడను కుంటే అపుడు కార్మికులను తొలగించటానికి అవకాశం ఉండాలని చెప్పే యజమానులకు ఉపయోగపడే గ్రంథంగా ఈ నివేదిక ఉంది.

**అధికారుల తనిఖీలు ఉండవు-స్వయం తనిఖీలు మాత్రమే ఉంటాయి**


"ఈ రోజు భారతదేశంలో వాణిజ్యం చేసేవారు అత్యధికంగా తనిఖీల భారంతో ఇబ్బందులు పడుతున్నారు" అనిప్రపంచబ్యాంకు కంట్రీ డైరెక్టర్ ఒన్నో రుహుల్ నివేదికకు రాసిన ముందుమాటలో చెప్పాడు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యజమానుల జోలికి ఈయన పోలేదు. వాణిజ్యం చేయటాన్ని సరళీకరించాలనే ముసుగులో అన్ని విధాలైన తనిఖీల వ్యవస్థను రద్దు చేయాలని ఆయన కోరాడు. పెట్టుబడుల రాకను వేగవంతం చేయటానికి మరింత వేగంగా సంస్కరణలను అమలు చేయాలని, తనిఖీల వ్యవస్థ నుండి దూరంగా ఉండాలని, నివేదిక రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన పిలుపునిచ్చింది.

తనిఖీలు, నిబంధనలు లేని పరిశ్రమలు, వ్యాపారాలు తీవ్ర ప్రమాదాన్ని కొనితెస్తాయన్న వాస్తవాన్ని ఈయన గమనంలోకి తీసుకోలేదు. మెక్సికో, తూర్పు ఆసియా లాంటి దేశాల అనుభవాలు ఇందుకు ఉదాహరణలుగా ఉన్నాయి.

2014లో ప్రకటించిన కార్యాచరణ ప్రణాళిక అన్ని ప్రధాన రంగాలను కవర్ చేయలేదని చెప్పారు. ఆ కార్యాచరణ ప్రణాళికలో వదిలివేసిన అంశాలను పూర్తిచేయటం కోసం నూతన కార్యాచరణలను రూపొందించుకొని, అమలు చేయాలి అని అన్నారు. అవెంత చిన్న విగా ఉన్నా చట్టాలకు సంబంధించిన అంశాలు అజెండాలో ముఖ్యమైనవిగా ఉంటాయని అన్నారు. రానున్న కాలంలో ప్రపంచ బ్యాంకు రాష్ట్రాల కార్యకలాపాలలో జోక్యం చేసుకొని, ప్రత్యక్ష నిర్వహణకు పూనుకుంటుందని ముందుగానే స్పష్టమౌతున్నది. కార్మికుల జీవన ప్రమాణాలపై తీవ్రమైన దాడులు జరగబోతున్నాయి. ఫలితంగా రానున్న కాలంలో పోరాటాలు మరింత తీవ్రం కానున్నాయి.

మొత్తంగా చెప్పుకోవాలంటే రానున్న కాలంలో ఎపిలో సంభవించనున్న పరిణామాలకు నివేదికలోని అంశాలు సూచికగా ఉన్నాయి. సంస్కరణలు ఫలితాలివ్వనున్నాయని, పెట్టుబడులు పెట్టటానికి పారిశ్రామికవేత్తలు లైనులో నిలబడివున్నారని చంద్రబాబు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వం ఇప్పటికే తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నది. ఇటువంటి ప్రచారం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేయటంలో కార్పొరేట్ మీడియా చంద్రబాబుతో కలిసి వ్యవహరిస్తున్నది. ఇప్పటికే ఎపిలోని కార్మికవర్గం చంద్రబాబు పాలనలో చెడ్డరోజులను చూస్తు న్నది. దశాబ్దాల పోరాటాల ద్వారా కార్మికవర్గం సాధించుకున్న హక్కులను హరించివేయటానికి పథకం ప్రకారం ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు ఆదేశిస్తున్న విధానాలను మొత్తంగా తిప్పికొట్టకపోతే రాష్ట్రంలో కార్మిక వర్గ భవిష్యత్తు అంధకార బంధురం అవుతుంది. ❋

PSBH




**తప్పక చదవండి**

ఈ పుస్తకంలో సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఛార్లెస్ డార్విన్ జీవిత వివరాలు, ఆయన గావించిన విజ్ఞాన పరిశోధనలు, రూపొందించిన 'పరిణామ సిద్ధాంతం' వివరాలు.. అన్నీ మనం తెలుసుకోవచ్చు. ఆయన ప్రతిపాదించిన 'జీవ పరిణామాభివృద్ధి' (జీవ పరిణామ సిద్ధాంతం)తో పాటు శాస్త్రవిజ్ఞాన గ్రంథాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ పుస్తకం మనకు అందిస్తుంది. ఆయన నిర్ధారణలు ప్రపంచ విజ్ఞానరంగంలో సాటిలేని విప్లవం సాధించాయి. అయినా ఈనాటికీ అమెరికా పాలకులు దానిని అంగీకరించక తమ విద్యాలయాల్లో దానిని బహిష్కరించి, ఆ సిద్ధాంత సమర్థకులను కోర్టులకీడ్చి చేస్తున్న హంగామా గురించి కూడా ఈ 'ఛార్లెస్ డార్విన్' పుస్తకం వివరిస్తుంది. డార్విన్ సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా చూరగొన్న అపార విజయాలు అమెరికన్ పాలకులకు చెంపపెట్టులాగా పరిణమించాయి.

**ఛార్లెస్ డార్విన్ - ఆర్. పెరియస్వామి - వెల :రూ. 60/- పేజీలు : 96**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ -20, ఫోన్ : 27608107, 9490099202
కారల్‌మార్క్స్ రోడ్, సోనోవిజన్ ఎదుట, విజయవాడ : మొబైల్ : 9490099202

బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు, నల్గొండ, ఖమ్మం, ఒంగోలు, కరీంనగర్

# ఉద్యోగ రాజ్య బీమా పథకాన్ని రక్షించాలి-విస్తరించాలి

**రవి దుగ్గల్**



రచయిత ప్రముఖ ఆరోగ్యరంగ నిపుణులు

**2015-16** బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఉద్యోగుల రాజ్యబీమా పథకం (ఈఎస్ఐయస్) సక్రమంగా నిర్వహింపబడటం లేదని, అది సమస్యల మయమై ఉందని అంగీకరించారు. ప్రతి ఉద్యోగికి ఉద్యోగ రాజ్యబీమా పథకాన్ని కాని, బీమా నియంత్రణ, అభివృద్ధి అధికారి (ఐఆర్‌డిఎ)చే గుర్తింపు పొందిన ఆరోగ్య బీమా పథకాన్ని కాని ఎంచుకొనే స్వేచ్ఛనివ్వాలని చెప్పాడు. ఈ అంశానికి సంబంధించిన ప్రయోజనార్థులను సంప్రదించిన తర్వాత చట్టానికి సవరణ తీసుకురావాలనుకుంటున్నామని కూడా చెప్పాడు. ఉద్యోగ రాజ్యబీమా పథకంలోని లోపాలను సరిచేయకుండా, అద్భుతమైన ఆర్యోగ పరిరక్షణ వ్యవస్థను నాశనం చేయటానికి ప్రభుత్వం చేస్తున్న స్పష్టమైన ప్రయత్నమిది. ఆరోగ్య బీమా పథకాన్ని ప్రోత్సహించటం కోసం బడ్జెట్లో పన్ను రాయితీని రూ. 15,000 నుండి రూ. 25,000లకు (వృద్ధులకు రూ. 30,000 లకు) పెంచటం ఈ ప్రయత్నాల్లో భాగమేనని పిస్తున్నది. 'సామాన్య మానవుని ఆరోగ్య అవసరాలను ప్రభుత్వం తీర్చలేదని, ఆరోగ్య బీమాను కొనుక్కొని 'ఎవరికి వారే' ఆరోగ్య పరిరక్షణా బాధ్యతను స్వీకరించాలని ప్రభుత్వం ఇస్తున్న సందేశమిది. అందువల్లే బడ్జెట్లో ఆరోగ్య పరిరక్షణకు తీవ్రమైన కోతను విధించి, కేటాయింపులను రూ. 39,231 కోట్ల నుండి రూ. 33,260 కోట్లకు తగ్గించారు. అంటే భారీగా, 15 శాతం కోత విధించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే వాస్తవంలో ఈ కోత మరింత ఎక్కువగా ఉంటుంది.

1948లో పార్లమెంటు చట్టం ద్వారా స్థాపించబడిన 'ఉద్యోగుల రాజ్యబీమా సంస్థ' సంఘటిత కార్మికవర్గానికి సేవలందిస్తున్న అతి ప్రధానమైన సామాజిక ఆరోగ్య బీమా పథకం. ఈ సంస్థ రూ. 10,000 కోట్లకు పైబడ్డ వార్షిక బడ్జెట్, రూ. 25,000 కోట్లకు పైబడ్డ రిజర్వ్ నిధులు కలిగి ఉంది. 151 ఆసుపత్రులతో, 32,349 పడకలతో, 7,340 మంది డాక్టర్లు, 18,501 ఇతర సిబ్బంది కలిగి, రూ. 2,551ల సగటు వైద్య వ్యయం కలిగిన గొప్ప సంస్థ ఇది. 38,328 పడకలతో రూ. 5,914 కోట్ల స్థూల వైద్య వ్యయం, రూ. 19,713ల సగటు వైద్య వ్యయం కలిగిన పదాతిదళ (ఆర్మీ) ఆసుపత్రులు, 13,963 పడకలు కలిగి, రూ. 1,370 కోట్ల స్థూల వైద్య వ్యయం రూ. 9,660 సగటు వైద్య వ్యయం కలిగిన రైల్వే ఆసుపత్రులతో సమానమైన నిర్మాణ వ్యవస్థను కలిగి ఉంది.

అయినప్పటికీ ఉద్యోగ రాజ్యబీమా (ఈఎస్ఐ) పథకం ఆదర్శవంతంగా నిర్వహింపబడటం లేదు. 2013-14లో ప్రభుత్వ సగటు ఆరోగ్య వ్యయం కంటే 50 శాతం ఎక్కువ సగటు వ్యయం కలిగి (రూ. 1,557), 6.18 కోట్ల లబ్ధిదారులు కలిగిన భారీ పథకంగా అది కానవస్తుంది. కాని సంఘటిత రంగ ఉద్యోగులు మొత్తానికి వర్తించగల సార్వత్రిక ఆరోగ్య పథకంగానైనా ఇది వ్యవహరించటం లేదు. వాస్తవానికి సంఘటిత రంగ కార్మికులలో కేవలం 42 శాతానికి మాత్రమే ఇది వర్తిస్తున్నది. దాని రూపకల్పన అధికంగా పారిశ్రామిక కార్మికులకు పరిమితమైనందున, సంఘటిత కార్మిక వర్గానికి మొత్తంగా ఆరోగ్య బీమాను అందించటంలో అది సఫలం కాలేకపోయింది. ఉద్యోగ రాజ్య బీమా పథకంలో చేరటానికి నిర్దేశించిన రూ. 15,000ల వేతన పరిమితి ఒకరకంగా వివక్షాపూరితంగా ఉంది. తక్కువ జీతంగల ఉద్యోగుల జీతంలో చట్టపరమైన అనేక మినహాయింపులు ఉండటంతో, వారికి ఈ పథకం భారంగా మారింది. మధ్య, ఉన్నతశ్రేణి ఉద్యోగులు ఈ పథకంలో చేరటానికి అర్హులు కాదు. ఇది సమానత్వ సూత్రాలకు వ్యతిరేకంగా ఉండి, సమానత్వం పొందకలిగే ప్రాథమిక హక్కును కాలరాస్తుంది. ఆరోగ్య పరిరక్షణ రంగంలో ఉన్న మొత్తం మౌలిక వనరులు, మానవ వనరులతో పోల్చుకుంటే ఉద్యోగ రాజ్య బీమా పథకంలో భారీ పెట్టుబడులు ఉన్నప్పటికీ, అవి అతి పేలవంగా నిర్వహింపబడుతున్నాయి. అది అత్యధికస్థాయి ఆసుపత్రులు, చికిత్సా కేంద్రాల సమాహారం కలిగివున్నా, వాటి వినియోగం, పడకల భర్తీ రేటు తక్కువస్థాయిలో ఉంది. తక్కువ నాణ్యత గల సేవలందించటం ఇందుకు ఒక కారణం. డాక్టర్లు, నిపుణుల స్థానాల్లో అత్యధిక ఖాళీగా ఉండటం వల్ల, ఔట్‌సోర్సింగ్ ప్రక్రియతో సేవలకోసం ప్రైవేట్ డాక్టర్లు, ప్రైవేట్ ఆసుపత్రులపై అధికంగా ఆధారపడటం వల్ల, సేవలలో నాణ్యత భారీగా పడిపోయింది.

వార్షిక నివేదికలలో లభ్యమయ్యే పరిమిత సమాచారాన్ని బట్టి, పెద్ద నగరాలలో అవుట్ పేషెంట్ చికిత్సా కేంద్రాలలో ఇన్స్యూరెన్స్ మెడికల్ ప్రాక్టీషనర్స్‌గా పిలువబడే ప్రైవేటు ప్రాక్టీషనర్ల ద్వారా అత్యధికంగా సేవలు అందించబడుతున్నాయి. అతి పెద్ద ఆసుపత్రులు కలిగి, ఉద్యోగ రాజ్య బీమా పథకానికి ప్రధాన కేంద్రంగా పరిగణింపబడుతున్న ముంబై నగరం ఇందుకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. 2009-10 సం॥లో 52,203 మంది అవుట్ పేషెంట్లు ఈఎస్ఐ కేంద్రాలలో చికిత్స పొందగా, 1,29,447 మంది అవుట్ పేషెంట్లు ప్రైవేట్ ప్యానల్ డాక్టర్ల దగ్గర చికిత్స పొందారు. అలాగే నైపుణ్యం కలిగిన డాక్టర్ల వద్ద చికిత్స పొందాల్సిన రోగులు 48,557 మంది ఈఎస్ఐ

> **“ ఇక్కడ మనం గమనంలో ఉంచుకోవాల్సిన అంశం ఒకటుంది. మన జనాభాలో వివిధ వర్గాలు పొందుతున్న సామాజిక భద్రతలో తీవ్ర అంతరాలు ఉన్నాయి. అందులో కేంద్ర, రాష్ట్ర పౌర సేవల ఉద్యోగులు అంతర్జాతీయ కార్మికసంస్థ నిర్దేశించిన అన్ని రకాల ప్రయోజనాల్ని సంపూర్ణంగా పొందుతున్నారు. ”**

కేంద్రాలలో చికిత్స పొందగా, 63,195 మంది ప్రైవేట్ క్లినిక్కులలో చికిత్స పొందారు. ఈఎస్ఐ ఆసుపత్రులలో పడకలు 50 శాతం కంటే ఎక్కువగా ఖాళీ ఉన్నప్పటికీ, 'ఆసుపత్రులలో చికిత్స' కోసం 600 ప్రైవేట్ ప్యానల్ ఆసుపత్రులను వినియోగించి, 2009-10 సం॥లో రూ.180 కోట్లు ఖర్చుచేశారు. ఉదాహరణకు ముంబైలోని 700 పడకలు కలిగిన అతిపెద్ద ఆసుపత్రి మహాత్మాగాంధీ మిషన్ ఆసుపత్రిలో 31 శాతానికి మించి పడకలు భర్తీ కావడం లేదు. వివిధ కథనాలను బట్టి, ఈఎస్ఐ పథకం క్రింద లభ్యమయ్యే అనేక రకాల నగదు ప్రయోజనాలను చేజిక్కించుకునేందుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లు పొందడానికి ఈఎస్ఐ డాక్టర్లు ఉపయోగపడుతున్నారన్న అపవాదు ప్రచారంలో ఉంది. 2010-11 సం॥లో మొత్తంగా 4.6 లక్షల ఆసుపత్రి సేవలు పొందిన కేసులు, 2.3 కోట్ల అవుట్ పేషెంట్ కేసులు నమోదయ్యాయి. సామాన్య ప్రజానీకంలో జాతీయ శ్యాంపిల్ సర్వే కార్యాలయం నిర్వహించిన రోగగ్రస్త సర్వే ఫలితాలతో పోలిస్తే, పై గణాంకాలు తక్కువ ఉపయోగిత రేటును సూచిస్తున్నాయి. వార్షికంగా ప్రతి వెయ్యి మందిలో 390 మంది అవుట్ పేషెంట్‌లుగా నమోదు అవుతుండగా, జాతీయ శాంపిల్ సర్వేలో రెండు వారాల్లోనే ప్రతి వెయ్యిమందికి 45 మంది అవుట్ పేషెంట్‌లుగా ఉన్నట్లు తేలింది. అలాగే వార్షికంగా ప్రతి వెయ్యి మందిలో 6.8 మంది ఆసుపత్రిలో చేరేవారు ఉండగా, జాతీయ శాంపిల్ సర్వేలో 26 మందిగా తేలింది. తక్కువస్థాయిలో ఉన్న రోగగ్రస్త రేటు, ఉపయోగిత రేటుకు గల కారణం ఈఎస్ఐ ఆసుపత్రులలో ఉన్న అథమ నాణ్యతా ప్రమాణాలా? లేదా చక్కటి పోషణ మూలంగా ఈఎస్ఐ వర్తింపబడిన ప్రజానీకం ఆరోగ్యంగా ఉన్నారా?? లేదా ఈఎస్ఐ వర్తింపబడిన ప్రజానీకం తమ సొంత డబ్బుతో ప్రైవేటు వైద్యం పొందుతున్నారా? వీటికి సరైన సమాధానాలు పొందటం కోసం మరింతగా అధ్యయనం చేయాల్సివుంది.

వార్షిక నివేదికలోని సమాచారాన్ని విశ్లేషిస్తుంటే మరొక అంశం బయటపడింది. గతకొద్ది సంవత్సరాలనుండి ఈఎస్ఐకు నెలవారీ వేతన అర్హత పరిమితిని రూ.15,000లకు పెంచటం మూలంగా ఈఎస్ఐఎస్ విస్తృతి పెరిగింది. ఈఎస్ఐ కార్పొరేషన్ దృష్టి, తమ చందాలతో ఈఎస్ఐ నిధిని పోగుచేస్తున్న ఉద్యోగి శ్రేయస్సు నుండి, వైద్యవిద్య అభివృద్ధికి మళ్ళింది. ఈఎస్ఐ కార్పొరేషన్ బోర్డు తమ రూ.30,000 కోట్ల రిజర్వ్ నిధులను (కార్మికుల సొమ్ము) 18 వైద్య కళాశాలలకు, 9 దంతవైద్య కళాశాలలకు, 12 పోస్ట్ గ్రాడ్యుయేట్ సంస్థల స్థాపనకు వినియోగించాయి. శరవేగంగా పెరుగుతున్న వీటి మౌలిక సదుపాయాల వ్యయం ఈ రిజర్వ్ నిధి నుండే ఖర్చు పెట్టబడుతున్నది. ఒక సామాజిక బీమా సంస్థ వైద్య విద్యారంగంలో ప్రవేశించటం భావ్యమేనా? కార్మికవర్గానికి ప్రత్యక్షంగా ప్రయోజనకరం కాని మరో మార్గంలో అడుగు పెట్టి ఈఎస్ఐ ప్రతిష్టను మరింత భ్రష్టు పట్టించే చర్య ఇది. ఈ చర్యను వ్యతిరేకించకుండా ఉండటానికి, ఈఎస్ఐఎస్‌లో చేరిన వారికి మెడికల్ సీట్లలో కోటా ఇస్తామని వాగ్దానం చేయటం మరింత ఆశ్చర్యకరంగా ఉంది.

**ముందున్న మార్గం**

ఈఎస్ఐ పథకమే ఆరోగ్య పరిరక్షణలో అందుబాటులో ఉన్న ఒకే ఒక కార్యక్రమం కాదు. అది సామాజిక భద్రతా వ్యవస్థలో ఒక ముఖ్య భాగమే. ఆ దృష్టితోనే దాన్ని అంచనా వేయవలసి ఉంటుంది. ప్రస్తుతం భారతదేశంలో అందుబాటులో ఉన్న కొద్ది సామాజిక భద్రతా ప్రయోజనాలు వివిధ మంత్రిత్వ శాఖలు, కార్మిక, సాంఘిక సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళా మరియు శిశు సంక్షేమం, ఆరోగ్యం లాంటి డిపార్ట్‌మెంట్‌ల కింద వేరు వేరుగా ఉన్నాయి.

ఇక్కడ మనం గమనంలో ఉంచుకోవాల్సిన అంశం ఒకటుంది. మన జనాభాలో వివిధ వర్గాలు పొందుతున్న సామాజిక భద్రతలో తీవ్ర అంతరాలు ఉన్నాయి. అందులో కేంద్ర, రాష్ట్ర పౌర సేవల ఉద్యోగులు అంతర్జాతీయ కార్మికసంస్థ నిర్దేశించిన అన్ని రకాల ప్రయోజనాల్ని సంపూర్ణంగా పొందుతున్నారు. ఉదాహరణకు, వారి రిటైర్మెంట్ ప్రయోజనాల వ్యయం (పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్) 2010-11లో రూ.1,55,170 కోట్లు (స్థూల దేశీయోత్పత్తిలో 2.1 శాతం)గా ఉంది. మరో అంచులో వివిధ సామాజిక సంక్షేమ పథకాల క్రింద తాత్కాలిక ప్రయోజనాలు పొందుతున్న, పేదరిక రేఖకు దిగువన ఉన్న ప్రజానీకం ఉన్నారు. ఉదాహరణకు 2010-11లో ఆ రకంగా ప్రయోజనం పొందుతున్న వ్యయం రూ.1,46,248 కోట్లుగా ఉండి, స్థూల దేశీయోత్పత్తిలో 1.85 శాతంగా ఉంది. (పేదరిక రేఖకు దిగువన ఉన్న ప్రజానీకం ఎస్సి/ఎస్టి సామాజిక సహాయ పథకాలు / పెన్షన్లు, పౌష్టికాహారం, గృహ, అసంఘటితరంగ కార్మిక సంక్షేమం). వీటికి ఆరోగ్య పరిరక్షణ, నీటి సరఫరా, పారిశుధ్యం కలుపుకుంటే ఈ వ్యయం రూ.2,48,456 కోట్లకు పెరుగుతుంది. భారతదేశంలో పౌర సేవల ఉద్యోగులు పొందుతున్న సంపూర్ణ సామాజిక భద్రతా ప్రయోజనాలు, పేద, అణగారిన ప్రజానీకం పొందుతున్న తాత్కాలిక సామాజిక, సహాయ సహకారాల మధ్య నెలకొన్న వివిధ అంతరాలను పరిశీలించాల్సి ఉంది.

బడ్జెట్ కేటాయింపులు / ఖర్చులను బట్టి భారతదేశంలో సామాజిక భద్రతా ప్రయోజనాలలో తీవ్ర వివక్ష నెలకొని ఉంది. పౌర ఉద్యోగులు, రక్షణ రంగ ఉద్యోగులు, ప్రైవేటు రంగంలోని కొద్ది శాతం ఉద్యోగులకు మంచి వేతనాలు, ఉద్యోగ భద్రత ఉన్న కారణంగా అధిక ప్రమాణాలు కలిగిన సామాజిక భద్రతను జీవితకాలం పొందుతూనే ఉంటారు. మరోపక్క జీవిత కాలం జీవనం కోసం పోరాటం చెయ్యాల్సిన ప్రజానీకం బడ్జెట్‌లో సామాజిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా అరకొరగా అందే తాత్కాలిక ప్రయోజనాలపై ఆధారపడుతున్నారు. ఈ క్రింది రెండు ఉదాహరణలు ఈ అంశాన్ని పూర్తిగా వివరిస్తాయి.

ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్న ఒక వ్యక్తి మేజర్ ర్యాంకులో పదవీ విరమణ చేసి రూ.15 నుండి 20 లక్షల వరకు పి.ఎఫ్, గ్రాట్యూటీ

మొదలైన ఉద్యోగ విరమణ ప్రయోజనాల కింద పొందుతాడు. తన చివరి జీతంలో సగ భాగాన్ని ద్రవ్యోల్బణంతో అనుసంధానించిన పెన్షన్‌ను తన జీవితకాలం పాటు పొందుతాడు. దాని విలువ ఈ రోజున రూ.50 వేల వరకు ఉంటుంది. ఆయన మరణిస్తే ఆయన పెన్షన్‌లో సగభాగం అంటే రూ.25,000లను ఆయన భార్య కుటుంబ పెన్షన్‌గా ఆవిడ జీవితకాలం పొందుతుంది. వీటితోపాటు పరిమితులు లేని ఆరోగ్య పరిరక్షణ ప్రయోజనాలు కూడా పొందుతారు. వీటితోపాటు వారికి అవసర మయ్యే అన్నిరకాల సరుకులు, వినిమయ వస్తువులు సబ్సిడీ ధరలకు వారి క్యాంటీన్‌ల ద్వారా పొందుతారు. ఆర్మీ మెస్‌లకు, క్లబ్‌లకు వారికి నిరంతరం ప్రవేశం లభిస్తూ, వారి సమాజాలకు ఎప్పుడూ చేరువగా ఉండగలుగు తారు. భారతదేశంలో 15 శాతం గృహస్తులు దాదాపు ఇదేస్థాయి జీవన ప్రమాణాలు కలిగి ఉన్నారు. వీరికి భిన్నంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబం నుండి ఒక రోజువారీ వేతన కార్మికుడు ఉన్నాడు. అతని వేతనం మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుంది. వాళ్ళు అదృష్టవంతులైతే, కుటుంబం మొత్తం కలిసి నెలకు రూ.5,000లు సంపాదించగలరు. వాళ్ళకు ప్రభుత్వం అందించే విద్యా, వైద్య ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. కానీ వాళ్ళకు అవసరమైనది వారికి దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. తరచుగా వాటికోసం వాళ్ళు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. కుటుంబ ప్రాథమిక అవసరాలను పొందటం కోసం పిల్లలు పనికి వెళుతూ, స్కూలుకు వెళ్ళలేకపోతుంటారు. వాళ్ళేమీ దాచుకోలేరు. పిఎఫ్, గ్రాట్యుటీ లాంటి సౌకర్యాలు వాళ్ళకు లేవు. వాళ్ళు రిటైర్మెంట్ వయస్సును దాటి పనిచేయాల్సి ఉంటుంది. నిర్దేశించిన ప్రమాణాలకు సరిపోతే వాళ్ళకు నెలకు రూ.200 నుండి 500 వరకు ద్రవ్యోల్బణంతో అనుసంధానం చేయని వృద్ధాప్య పెన్షనో, వితంతు పెన్షనో ఇవ్వబడుతుంది. భార్యాభర్త లిరువురూ వృద్ధాప్య పెన్షన్‌కు అర్హులైతే ఒకళ్ళకే అది చెల్లింపబడుతుంది. వాళ్ళు అదృష్టవంతు లైతే రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజనకు గాని, అలాంటి మరో ఆరోగ్య బీమా పథకానికి గాని నమోదు చేయబడతారు. ఈ రకమైన దుర్భరమైన జీవితాన్ని గడిపే వారు మూడింట రెండు వంతుల కుటుంబాల్లో ఉంటారు. మిగిలిన 20 శాతం మధ్య తరగతి ప్రజలు సామాజిక భద్రత కోసం వాళ్ళ సంపాదన నుండి వారే ఏర్పాటు

**“వీరికి భిన్నంగా దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబం నుండి ఒక రోజువారీ వేతన కార్మికుడు ఉన్నాడు. అతని వేతనం మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుంది. వాళ్ళు అదృష్టవంతులైతే, కుటుంబం మొత్తం కలిసి నెలకు రూ.5,000లు సంపాదించగలరు. వాళ్ళకు ప్రభుత్వం అందించే విద్యా, వైద్య ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది.”**



**1952 ఫిబ్రవరి 24న ఇ.ఎస్.ఐ. కార్పొరేషన్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ**

చేసుకోవాల్సి ఉంటుంది. వాళ్ళకు సంఘటిత రంగ ప్రయోజనాలుకానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక భద్రతా పథకాలకు కాని అర్హత ఉండదు.

భారతదేశంలోని సామాజిక భద్రతయొక్క పై రాజకీయార్థిక చిత్రాన్ని పరిశీలిస్తే, సంపూర్ణ సామాజిక భద్రత కల్పన పెద్ద సవాలుగానే ఉంది. మనం సామాజిక భద్రతకు స్థూల దేశీయోత్పత్తిలో కేవలం 6 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నాము. దీనిలో సగభాగం భారత ప్రజానీకంలో 15 శాతంగా ఉన్న ఉన్నత ఆదాయ వర్గం అనుభవిస్తున్నది. గత దశాబ్దకాలం నుండి మిగిలిన 85 శాతం ప్రజానీకానికి వనరుల్ని కేటాయించే ధోరణి కానవస్తుంది. ఈ కేటాయింపులు, సామాజిక భద్రతను అందించకలిగి, దీర్ఘకాలం మనగలిగే యంత్రాంగ అభివృద్ధికి కాకుండా, ఓట్లను దండుకునేందుకు గాను కొన్ని లక్షిత వర్గాలపై మాత్రమే కేంద్రీకరింపబడి ఉన్నాయి. యూపిఎ పాలనాకాలంలో ఈ దిశలో పతాక స్థాయి కార్యక్రమాలను ప్రాథ మికంగా ప్రారంభించి, గణనీయమైన కేటాయింపులు ప్రకటించినప్పటికీ, వేరు వేరుగా విభజించబడిన అమలు తీరుతో సహస్రాబ్ది అభివృద్ధి సాధన సూచికలు, చాలా పేలవంగా ఉన్నాయి. లక్షితమైన, వేరు వేరుగా విభజించబడిన అమలుతీరు పనికిరాదని, సార్వత్రికంగా అందరికీ ఆరోగ్య పరిరక్షణ లభ్యం కాగల పద్ధతే సక్రమమైన మార్గమని అనుభవం చెపుతున్నది.

ఈఎస్ఐ పథకంలో సంస్కరణలను పైన పేర్కొన్న నేపథ్యంలో చూడాల్సి ఉంది. భారతదేశంలో ఇతర సామాజిక భద్రతా పథకాలలాగా, ఈఎస్ఐ పథకం కూడా రూపకల్పనా లోపాలతో విఫలమైంది. అది కార్మికవర్గం మొత్తానికి ప్రయోజనకరంగా విస్తరించాల్సి ఉండగా, ఒక స్థాయి వేతనం పొందే 10 మందికి మించిన సంస్థలలోని కార్మికులకు (ప్రస్తుతం రూ.15,000లు లోపు వేతనం), కనీస బీమా ఉద్యోగుల సాంద్రత కల్గిన ప్రాంతాలకు పరిమితమైంది. దీని పర్యవసానంగా కార్మిక వర్గంలో 3 శాతం మాత్రమే (సంఘటిత రంగం అనబడే వారిలో సగభాగం) ఈఎస్ఐ పథకం ప్రయోజనాల్ని పొందగలుగుతున్నారు. పథకం రూపకల్పనలోని లోపాల్ని సరిదిద్ది, కార్మికవర్గం మొత్తానికి (45 కోట్లు) ప్రయోజనకరంగా ఉండేవిధంగా రూపొందించకపోతే, దాని యోగ్యతా సమర్థతలు ప్రశ్నార్థకమౌతాయి.

**సార్వత్రిక వర్తింపు దిశగా...**

రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన లాంటి పరిమిత ప్రయోజనాలు గల లక్షిత పథకాలతో

> **"దీని పర్యవసానంగా కార్మికవర్గంలో 3 శాతం మాత్రమే (సంఘటిత రంగం అనబడే వారిలో సగభాగం) ఈఎస్ఐ పథకం ప్రయోజనాల్ని పొందగలుగుతున్నారు. పథకం రూపకల్పనలోని లోపాల్ని సరిదిద్ది, కార్మికవర్గం మొత్తానికి (45 కోట్లు) ప్రయోజనకరంగా ఉండేవిధంగా రూపొందించకపోతే, దాని యోగ్యతా సమర్థతలు ప్రశ్నార్థకమౌతాయి."**

ఆరోగ్య పరిరక్షణ ప్రయోజనాల్ని అసంఘటిత రంగ కార్మికులకు విస్తరించటం కోసం ప్రభుత్వం భారీ వనరులను, చర్యలను సంసిద్ధం చేస్తున్నది. వాటి రాష్ట్ర విభాగాలన్నీ ప్రైవేటు ఆరోగ్య బీమా మార్గంలో తమ లక్ష్యాల్ని సుగమం చేయాలను కుంటున్నాయి. కేవలం ప్రైవేట్ ఆసుపత్రులకు, ప్రైవేటు బీమా కంపెనీలకు దోచిపెట్టడం తప్పించి, అనుకున్న ప్రయోజనాల్ని సాధించటంలో పై చర్యలు సఫలం కాలేవు. ఈఎస్ఐ వ్యవస్థను పకడ్బందీగా, సమగ్రంగా రూపొందిచకలిగితే, అది కార్మిక వర్గానికి మొత్తంగా విస్తరించగల సామాజిక భద్రతా పథకంగా తయారౌతుంది. ఆ పథకాన్ని ప్రభుత్వ సాధారణ ఆరోగ్య పరిరక్షణ సేవలతో అనుసంధానం చేయకలిగితే, ఒక ఉమ్మడి ఆరోగ్య పరిరక్షణ వనరు సృష్టింపబడి, దానికవసరమైన నిధుల్ని ఉద్యోగులు, యాజమాన్యాలు, పన్ను ఆదాయాల నుండి సమీకరింపవీలౌతుంది. దీన్ని నిర్వహించటానికి కొన్ని సూచనలు, సలహాలు ఈ క్రింద ఇవ్వబడ్డాయి.

**వర్తింపు**

వేతన పరిమాణం, సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కనీస సంఖ్య ప్రాతిపదికన పరిమితం చేస్తున్న బీమా అర్హతను తక్షణమే సవరించాలి. దానిస్థానంలో ఈఎస్ఐను ప్రస్తుతం అమలు చేస్తున్న సంస్థలన్నింటిలోని అందరు ఉద్యోగులకు విస్తరింపజేయాలి. దీనివలన ఈఎస్ఐ పొందే ఉద్యోగులు రెట్టింపు కావటమే కాకుండా, వారి నుండి వారి యజమానుల నుండి వచ్చే నెలవారీ ఈఎస్ఐ చందాలు 5 నుండి 6 రెట్లు పెరుగుతాయి. ఇంతకు ముందు మినహాయింపబడిన అధిక వేతన ఉద్యోగులకు ఈ పథకంలో స్థానం కల్పించటం వలన ఈ పరిణామం చోటు చేసుకుంటుంది. తదుపరి చర్యగా ఈఎస్ఐను ఒకళ్ళు లేదా ఇద్దరు ఉద్యోగులతో నిర్వహిస్తున్న షాపులు, చేతివృత్తి సంస్థల యజమానులకు విస్తరించాలి. అటువంటి చిన్న సంస్థలను నమోదు చేయటం అంత తేలికైన పని కాదు. తర్వాత స్వయం ఉపాధిని నిర్వహించే నిపుణులు, వ్యవసాయదారులు, చేతివృత్తిదారులు, విక్రయదారులు (వెండార్లు) మొదలైన వారిని ఈ పథకంలో చేర్చుకోవాలి సమానత్వాన్ని సాధించటం కోసం రూ. 10,000ల కంటే తక్కువ ఆదాయం గల వేతన ఉద్యోగులను, రూ. 50,000లు కంటే తక్కువ టర్నోవర్ లేదా రూ. 10,000ల కంటే తక్కువ నెలసరి ఆదాయం గల యజమానులు, స్వయం ఉపాధిదారులను నెలవారీ చందాల వసూలు నుండి మినహాయించాలి.

**నిర్మాణం**

సాధారణ ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ కేంద్రాల వ్యవస్థను, ఈఎస్ఐ ఆసుపత్రులను (ఇతర సామాజిక, బీమా పథక ఆసుపత్రులు/ క్లీనిక్‌లు, రైల్వే, రక్షణ శాఖ, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవల ఆసుపత్రులను కలుపుకొని) వాటి ప్యానల్ మెడికల్ ప్రాక్టీషనర్లను (మరింత నియంత్రణ అవసరమైన వారు) విలీనం చేసి ఒక ఉమ్మడి సమూహంగా తయారు చేయాలి. ఇదేవిధంగా ఈఎస్ఐ ఆసుపత్రులను, ప్రజారోగ్య వ్యవస్థకు సంబంధించిన ఆసుపత్రులతో విలీనం చేయాలి. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం (ప్రపంచ ఆరోగ్య సంస్థ, అంతర్జాతీయ కార్మిక సంస్థ మొదలైన) వాటిలో అన్నిరకాల వసతులు, పరికరాలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. దీర్ఘకాలంలో ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ మొత్తం ప్రభుత్వ యాజమాన్యంలో నిర్వహించేటట్లు కృషి ఉండాలి. ద్వితీయ, తృతీయస్థాయి ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ పెట్టుబడుల కొరతను ఎదుర్కొంటున్నది. ఈ కొరతను అధిగమించటం కోసం ప్రైవేట్ రంగం నుండి క్రమబద్ధీకరించిన కొనుగోళ్ళను జరపాలి. ఈఎస్ఐ ఆసుపత్రులు, సాధారణ ఆరోగ్య సేవలలో డాక్టర్లు, నర్సుల కొరత తీవ్రంగా ఉంది. ఈ కొరతను తీర్చటం కోసం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు లేదా పదాతిదళాల తరహా క్యాడర్ వ్యవస్థను ఏర్పరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. నిర్మాణంలో, అజమాయిషీలో, పాలనలో పదాతిదళాల, రైల్వే ఆరోగ్య సేవల వ్యవస్థ నుండి నేర్చుకోవలసినది ఎంతో ఉంది.

**ఆర్థిక వనరులు**

సాధారణ పన్నుల విధానం ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ మొత్తానికి ప్రధాన ఆర్థిక వనరుగా కొనసాగాలి. కాని ఈఎస్ఐ పథకం మేరకు ప్రత్యేకంగా పైన 'వర్తింపు' పేరాలో పేర్కొన్న జాగ్రత్తలతో నెలవారీ చందాల పద్ధతిని కొనసాగించాలి. ముఖ్య కార్యనిర్వహణాధికారి లాంటి అత్యధిక వేతనం పొందే ఉద్యోగుల నుండి కిందిస్థాయి వరకు ఈ పథకాన్ని సార్వత్రికంగా వర్తించడం మూలంగా వసూలు చేయాల్సిన చందాల పరిమాణం తగ్గే అవకాశం ఉంది. అయినప్పటికీ ఈ పథకం వర్తింపు పరిధి పెరగటం వల్ల దీనికి సంబంధించిన ఆర్థిక అంశాల్ని గణించవలసి ఉంటుంది. స్వయం ఉపాధిపై ఆధారపడే వాళ్ళతో సహా కార్మిక వర్గంలో 50 శాతానికి ఈ పథకం వర్తింపచేయగలిగితే, దీనికి అవసరమైన ఆర్థిక వనరులలో సగభాగం సామాజిక బీమా చందాల నుండి పొందవచ్చును.

**పాలన**

ఈఎస్ఐ పథకం ప్రస్తుతానికి కార్మిక, ఉద్యోగ మంత్రిత్వశాఖలో ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన కార్పొరేషన్‌గా నిర్వహింపబడుతున్నది. సార్వత్రిక వర్తింపు గల ఆరోగ్య పరిరక్షణ వ్యవస్థ చట్రంలో అది ఇమడాల్సిన స్థితిలో, సార్వత్రిక ఆరోగ్య పరిరక్షణా వ్యవస్థ పాలనా యంత్రాంగంలో విలీనం కావలసి ఉంటుంది. పైన పేర్కొన్న విధంగా ఆరోగ్య పరిరక్షణ సేవల్ని ఒకే ఒక సేవ కింద చూడకుండా, సామాజిక భద్రతా ప్రయోజనాల సంక్షిప్త రూపంగా పరిగణించాల్సి ఉంటుంది. ఈఎస్ఐ పథకం, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలు ఫెడరల్ ప్రభుత్వ అజమాయిషీ క్రింద ఉండటం మూలంగా ఇది క్లిష్టతరంగా తయారైంది. అందువల్ల రాష్ట్రస్థాయి వరకైనా రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహింపబడుతున్న ఈఎస్ఐ సదుపాయాలను సాధారణ ఆరోగ్య పరిరక్షణ సేవలతో విలీనం చేసి కనిష్టంగా వినియోగింపబడుతున్న ఈఎస్ఐ పథకం సామర్థ్యాన్ని, కిక్కిరిసిపోతున్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. వీటితోపాటు ప్రభుత్వరంగంలోని రక్షణ, రైల్వే, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య సేవలన్నింటిని కూడా ఒక ఉమ్మడి పాలనా యంత్రాంగం క్రింద విలీనం చేయాలి.

స్వేచ్ఛానువాదం
**కొండముది లక్ష్మీప్రసాద్**

# జనాభా పెరుగుదల హిందూత్వవాదుల కుటిల రాజకీయాలు


రచయితలు ప్రముఖ పాత్రికేయులు

**టికె రాజలక్ష్మి, వెంకిటేష్ రామక్రిష్ణన్**

**2011** జనాభా లెక్కలలోని అంకెలను ఆధారం చేసుకొని బిజెపి, ఆర్‌యస్‌యస్, దాని అనుబంధ సంఘాలు ప్రజలను తప్పుదారి పట్టించటానికి పూనుకున్నాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముస్లింలకు వ్యతిరేకంగా ప్రమాదకరమైన ప్రచారాన్ని ప్రారంభించాయి.

ఆగస్టు 25న భారత రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమీషనర్ ఆఫ్ ఇండియా 2011 సెన్సస్ రిపోర్టులోని మతాలవారీగా జనాభా లెక్కలను విడుదల చేశారు. 2011 జనాభా లెక్కలను ఇంతకు ముందే అధికారికంగా విడుదల చేశారు. ఆ నివేదికలోని అంశాలపై వివిధ స్థాయిలలో చర్చించటం కూడా జరిగింది. ప్రస్తుతం ఈ వివరాలను విడుదల చేసిన సమయం కుట్ర పూరితంగానూ, ఆశ్చర్యకరంగానూ ఉంది. ప్రభుత్వ ప్రచార యంత్రాంగం, మీడియాలోని ప్రధాన భాగం నివేదికలోని అంశాలను వక్రీకరిస్తూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.

ఉదాహరణకు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) విడుదల చేసిన నివేదికలో వివరాలను అందించటంతో పాటు పట్టణాలు, జిల్లా, దిగువస్థాయి వరకు స్త్రీ, పురుషుల వివరాలు, నివాసాలకు సంబంధించిన విశ్లేషణను కూడా అందజేశారు. 2011 జనాభా లెక్కలను అనుసరించి దేశ జనాభా 121 కోట్ల 09 లక్షలు. వారిలో హిందువులు 96 కోట్ల 63 లక్షల మంది (79.8 శాతం) ఉన్నారు. ముస్లింలు 17 కోట్ల 22 లక్షల మంది (14.2 శాతం) ఉన్నారు. క్రైస్తవులు 2 కోట్ల 78 లక్షల మంది (2.3 శాతం) ఉన్నారు. సిక్కులు 2 కోట్ల 08 లక్షల మంది (1.7 శాతం) ఉన్నారు. బౌద్ధులు 84 లక్షల మంది (0.7 శాతం) ఉన్నారు. జైనులు 45 లక్షల మంది (0.4 శాతం) ఉన్నారు. ఇతర మతాలు, విశ్వాసాలకు కట్టుబడిన వారు 79 లక్షల మంది (0.7 శాతం) ఉన్నారు. ఏ మతానికి చెందినవారం కాదని చెప్పినవారు 29 లక్షల మంది (0.2 శాతం) ఉన్నారు. ఈ లెక్కల ననుసరించి 2001-11 దశాబ్దంలో మొత్తం జనాభాలో హిందువులు 0.7 శాతం, సిక్కులు 0.2 శాతం, బౌద్ధులు 0.1 శాతం తగ్గారు. ముస్లింలు 0.8 శాతం పెరిగారని, క్రైస్తవులు, జైనుల జనాభాలో పెద్ద మార్పులు లేవని చెప్పారు. గత దశాబ్దం (1991-2001)లో జనాభా పెరుగుదల 17.7 శాతం ఉందని, హిందూ జనాభా పెరుగుదల 16.8 శాతం, ముస్లింలు 24.6 శాతం, క్రైస్తవులు 15.5 శాతం, సిక్కులు 8.4 శాతం, బౌద్ధులు 6.1 శాతం, జైనులు 5.4 శాతం చొప్పున పెరిగారని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో తెలియజేసింది.

ఈ వివరాలను బహిర్గతం చేసిన వెంటనే మీడియాలోని కొన్ని తరగతులు ఈ అంకెలను సంచలనం కలిగించే విధంగా ప్రచారం చేయటం, అందుకనుగుణంగానే హిందూ మతోన్మాదుల నుండి తీవ్రమైన ప్రతిస్పందన రావటం జరిగింది. విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా, బిజెపి పార్లమెంటు సభ్యుడు సాక్షి మహరాజ్ లాంటివారు తీవ్రంగా స్పందించారు. ఇద్దరు పిల్లలకన్నా ఎక్కువమందిని కనరాదని తక్షణమే ముస్లింలపై ఆంక్షలను విధించాలని తొగాడియా డిమాండు చేశాడు. ఆయన సైద్ధాంతిక భాగస్వామి, కొద్ది నెలల క్రితమే ప్రతి హిందూ మహిళ నలుగురు పిల్లలను కనాలని డిమాండు చేసిన సాక్షి మహరాజ్ ఇద్దరు పిల్లల నిబంధనతోపాటు, ప్రజలందరికీ సమానంగా వర్తించే కామన్ సివిల్ కోడ్‌ను ముస్లింలకు కూడా వర్తింపచేయటానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండు చేశాడు. ఆ వెంటనే వరుసలో తనకు తానుగా విహెచ్‌పి అనుబంధసంస్థగా ప్రకటించుకున్న బీహార్ దుర్గావాహిని, మతపరమైన జనాభా పెరుగుదలపై 2011 జనాభా లెక్కలు స్పష్టం చేస్తున్న ప్రమాదాన్ని తెలియచెప్పటానికి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని ప్రకటించింది. ఈ విధమైన ప్రచారాన్ని ప్రారంభించటం, రాష్ట్రంలో ఆ ప్రచారాన్ని ప్రారంభించిన సమయాన్ని చూస్తే మతాలవారీగా జనాభా వివరాలను విడుదల చేయటానికి కారణాలు స్పష్టమౌతున్నాయి.

బీహారు అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూలు ప్రకారం అక్టోబరు, నవంబరు నెలల్లో జరగాల్సి ఉంది. (అక్టోబరు 12నుండి నవంబరు 5వరకు ఐదు దశల్లో ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది.) 2014 లోక్‌సభ ఎన్నికలలో వలెనే బిజెపి, దాని మిత్రపక్షాలు (యన్‌డిఎ) అభివృద్ధి నినాదం, ప్రజలలో మతాలవారీగా చీలికలు తీసుకురావటం అనే రెండు అంశాల ఆధారంగా వారి ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నాయి. బీహార్‌లో ఇప్పటికే ప్రాథమికంగా మతఘర్షణలను ప్రారంభించారు. గత ఆరు మాసాలలో అటువంటి ఘర్షణలు 400 జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ఘర్షణలు జరిగిన వాటిలో ఎక్కువ భాగం ముస్లిం ప్రజానీకం గణనీయంగా ఉన్న ప్రాంతాలు కాదు. అన్ని జిల్లాలలోనూ చిన్న విషయాలు, స్థానిక అంశాలపై మతాలవారీగా ప్రజల మధ్య విభజనను తీవ్రం చేస్తున్నారు. ముస్లిం జనాభా పెరుగుతున్నదనే ప్రచారంతో భయాందోళనలను సృష్టిస్తున్నారు. ప్రజలలో మతాలవారీగా విభజనను మరింత తీవ్రం చేయటం బిజెపికి, దాని మిత్రులకు ఎన్నికలలో ప్రయోజనం కలిగించటానికిఉపయోగపడవచ్చు.

మతాలవారీగా జనాభా లెక్కలలోని వివరాలను సంఘ్ పరివార్ సంస్థలు వారి ఎన్నికల ప్రచారంలో వినియోగించుకోవటంపై రాష్ట్రీయ జనతాదళ్ నేత లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో ఈ లెక్కలను విడుదల చేయటం, వీటితోపాటు

**"గత ఆరు మాసాలలో అటువంటి ఘర్షణలు 400 జరిగినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ఘర్షణలు జరిగిన వాటిలో ఎక్కువ భాగం ముస్లీం ప్రజానీకం గణనీయంగా ఉన్న ప్రాంతాలు కాదు. అన్ని జిల్లాలలోనూ చిన్న విషయాలు, స్థానిక అంశాలపై మతాలవారీగా ప్రజల మధ్య విభజనను తీవ్రం చేస్తున్నారు."**

కులగణనకు సంబంధించిన లెక్కలను విడుదల చేయటానికి తిరస్కరించటం కుట్రపూరితంగా ఉందని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు కులగణనకు సంబంధించిన వివరాలను విడుదల చేయాలని డిమాండు చేస్తున్నాయి. కాని నరేంద్రమోడి నాయకత్వం లోని ప్రభుత్వం అందుకు తిరస్కరిస్తున్నది. ఇది వ్యూహాత్మకంగా చేస్తున్నారనేదానిలో ఏ మాత్రం సందేహం లేదు. కులగణనలో ఇతర వెనుక బడిన కులాలు(ఒబిసిలు), షెడ్యూల్డు కులాల (యస్‌సి) జనాభా పెరిగిందని ఖచ్చితమైన సమాచారం ఉంది. ప్రభుత్వం ఈ లెక్కలను ప్రకటిస్తే, పెరిగిన జనాభా కనుగుణంగా రిజర్వే షన్ల విధానంలో తగిన మార్పులు చేయాలి. పెరిగిన శాతానికి అనుగుణంగా ప్రతి కులానికి రిజర్వేషన్లు పెంచాల్సి ఉంటుంది. బిజెపి, సంఘ్ పరివార్ ప్రధాన సామాజిక, రాజకీయ ఆయుధం మతపరమైన ప్రచారంతో ప్రజల మధ్య చీలికలు తీసుకురావటం. కాబట్టి మోడి ప్రభుత్వం కులగణన లెక్కలను విడుదల చేయలేదని ఆయన చెప్పాడు.

సామాజికంగా ప్రమాదకర పరిణామాలకు దారితీసే మతపరమైన ప్రచారం తీవ్రంగా జరుగుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ భయాలను తొలగించటానికి పూనుకోవటం లేదు. జనాభా లెక్కలలో వివిధ సమూహాలకు సంబంధించి ఉన్న కొన్ని సాను కూలాంశాలను వివరించటానికి కూడా పూనుకో లేదు.

**జనాభా పెరుగుదలలో ముఖ్యమైన ధోరణులు**

ముస్లీముల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన విషయాలను పరిశీలించటానికి 2005-06లో నియమించిన రాజేంద్రసచార్ కమిటి సభ్య కార్యదర్శి అయిన ఆర్థికవేత్త డాక్టర్ అబుసలేహ్ షరీఫ్ సెన్సస్ లెక్కలలోని ఐదు ముఖ్యమైన అంశాలను గురించి భారత్-అమెరికా పోలసి ఇన్స్టిట్యూట్ వెబ్‌సైట్‌లో రాశాడు. మొదటిది. భారతదేశంలో జనాభా పెరుగుదల రేటు గతంలో అంచనా వేసిన దానికన్నా త్వరితంగా తగ్గుతున్నది. రెండు. దశాబ్దకాలంలో హిందూ జనాభా తగ్గుదల రేటు (3.5 శాతం) కన్నా ముస్లీం జనాభా తగ్గుదల రేటు (4.9 శాతం) ఎక్కువగా ఉన్నది. మూడు. జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరప్రదేశ్, బీహార్‌లాంటి రాష్ట్రాలలో జనాభా తగ్గుదల రేటు ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువగా ఉన్నది. నాలుగు. గత దశాబ్దంలో దేశం మొత్తం మీద స్త్రీ-పురుష నిష్పత్తి మెరుగు పడింది. ఐదు. స్త్రీ-పురుష నిష్పత్తి హిందు వులలో కొద్దిమేరకు పెరగగా, ముస్లీంలలో ఈ పెరుగుదల ఎక్కువగా ఉంది.

ఈ విధంగా బాధ్యతాయుతమైన, సక్రమ మైన విశ్లేషణ ప్రభుత్వం నుండి కాని, అధికారంలో ఉన్నవారి నుండికానీ రాలేదు. మరోవైపున కేంద్ర ప్రభుత్వంలో, చట్టసభలలో భాగస్వాములుగా ఉన్న సాక్షి మహరాజ్, మహంత్ అవైద్యనాథ్ లాంటి వారు ముస్లీం ప్రజల సంఖ్య అపారంగా పెరుగుతున్నదనే అబద్ధాలను స్వేచ్ఛగా ప్రచారం చేయటానికి అవకాశం కల్పించారు. 2001లో కూడా ముస్లీం జనాభా పెరుగుదలను చర్చనీయాంశం చేయటానికి ప్రయత్నం చేశారని షరీఫ్ చెప్పాడు. అప్పుడు కూడా జనాభా పెరుగుదలకు సంబం ధించిన అంశాలను సక్రమంగా పరిశీలించ లేదు. హిందూత్వ నాయకులు ప్రవీణ్ తొగా డియా లాంటివారు 2001 జనాభా లెక్కలను ఉదహరిస్తూ ముస్లీం జనాభా విపరీతంగా పెరుగుతున్నదని ప్రచారం చేశారు. జనాభా లెక్కల సేకరణ వివరాలను పరిశీలిం చిన తర్వాత 1991 జనాభా లెక్కల సేకరణలో ముస్లీం జనాభా మెజారిటీగా ఉన్న జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని మినహాయించి లెక్కలను సేకరించారు. పది సంవత్సరాల తర్వాత జనాభా లెక్కల సేకరణలో ఆ రాష్ట్రాన్ని కూడా కలపటంతో ముస్లీం జనాభా పెద్దమొత్తంలో పెరిగినట్లు కనిపించింది.

**క్షీణిస్తున్న జనాభా పెరుగుదల రేటు**

మతాల వారీగా జనాభాకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ముస్లీం ప్రజానీకం, లేక ఏ ఇతర మతానికి చెందిన ప్రజానీకంలోనైనా పెరుగుదల, తరుగుదలకు వైవిధ్యభరితమైన అంశాలు కారణమౌతున్నాయి. రాష్ట్రాలు, జిల్లా స్థాయిల్లో పరిశీలించినపుడు అనేక అంశాలు ఇందుకు దోహదం చేస్తున్నట్లు స్పష్టమౌతున్నది. సామాజిక, ఆర్థిక పరిస్థితులు, వలసలు, నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉ ండటం, మొత్తంగా ఆరోగ్య సర్వీసుల అందు బాటు, పునరుత్పత్తి చేయగలిగిన ఆరోగ్యం లాంటి అనేక అంశాలు అందుకు కారణంగా ఉన్నాయి. పండితులు, జనాభా విశ్లేషణలో నిపుణులు రాష్ట్రాల మధ్య, జిల్లాలలోనూ వివిధ మతాలవారి మధ్య పునరుత్పత్తి విధానాలలో తీవ్రమైన వ్యత్యాసాలున్నాయని, ఇందుకు బలమైన కారణాలున్నాయని చెబుతున్నారు. వివిధ మతాల వారి జనాభా పెరుగుదలకు, లేదా తరుగుదలకు అనేక కారణాలున్నాయని, ఎక్కువమంది పిల్లలను కనాలని చేసే ప్రచారం వలన ఒక మతం వారి జనాభా పెరుగు తుందనటానికి ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తున్నారు. మొత్తంగా మహిళలు పునరుత్పత్తి చేయగలిగిన వయసులో (టోటల్ ఫెర్టిలిటి రేట్) వారిలో పునరుత్పత్తి శక్తి తగ్గిపోతున్నది. 2013లో మహిళలలో పునరు త్పత్తి జాతీయ సగటు 2.3 శాతంగా ఉంది. ఇది గ్రామీణ ప్రాంతాలలో 2.5 శాతం, పట్టణ ప్రాంతాలలో 1.8 శాతంగా ఉంది. బెంగా ల్‌లో 1.6 శాతం ఉండగా, బీహార్‌లో 3.4 శాతంగా ఉంది. మొత్తం పునరుత్పత్తి శక్తి గ్రామీణ హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, తమిళ నాడులలో 1.7 శాతం ఉండగా, బీహార్‌లో 3.5 శాతంగా ఉంది. హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లోని పట్టణ ప్రాంతాలలో 1.2 శాతం ఉండగా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలోని పట్టణ ప్రాంతాలలో జాతీయ సగటుకన్నా కొంచం ఎక్కువగా 2.5 శాతం ఉంది. కాబట్టి పరిస్థితి భయానకంగా ఏమీలేదు.

సెంటర్ ఫర్ పాపులేషన్ అండ్ డెవలప్ మెంట్ సంస్థ భారతదేశంలో జిల్లా స్థాయిలో పునరుత్పత్తిని పరిశీలించి, 2013 జూన్‌లో ఒక పత్రం రూపొందించింది. 2011 జనాభా లెక్కలను ఆధారం చేసుకొని నివేదిక రూపొందిం చిన ఇరుదయ రాజన్, క్రిస్టోఫ్ జడ్ గిల్‌మోటో కొన్ని అనుభవాలను పేర్కొంటూ, ప్రాంతీయంగా


ఉన్న కొన్ని నియమ నిబంధనలు ఆయా ప్రాంతాలలో జననాల రేటును ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. స్త్రీ, పురుషుల సంఖ్యలో వ్యత్యాసాలు, యువకుల సంఖ్యకు తగినట్లుగా పిల్లలను కనే వయసున్న స్త్రీలు లేకపోవటం వలన జననాల రేటు తక్కువగా ఉంటున్నది. భారతదేశంలోని అన్ని జిల్లాలలోనూ సహజమైన జననాల శాతమే జనాభా హెచ్చుతగ్గులలో ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నది.

12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో మహిళలలో పునరుత్పత్తి శక్తి సగటున మహిళకు 2.1 శాతానికి తగ్గిపోవటం అనేది ఒక మంచి విషయం. దేశంలోని 621 జిల్లాలకు గానూ 174 –28 శాతం జిల్లాలలో పునరుత్పత్తిశక్తి 2.1 శాతం కన్నా తక్కువగా ఉంది. పునరుత్పత్తిశక్తిని తిరిగి పునరుద్ధరించలేని స్థాయిలో తగ్గిన జిల్లాలలో అత్యధిక భాగం ఐదు దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లు ప్రధానంగా ఉన్నాయని రచయితలు పేర్కొన్నారు. జననాల రేటు ఎక్కువగా ఉండటానికి మతపరమైన అంశాలు కారణం కాదు. అదే ప్రాతిపదిక అయితే ముస్లీంలు అత్యధికంగా ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో మొత్తం జననాల రేటు మన కన్నా తక్కువగా ఉండటాన్ని ఏ విధంగా వివరించగలరు?

2001-2011 మధ్య పెరిగిన హిందువులు 13 కోట్ల 80 లక్షలు. ఇది 2001లో ఉన్న ముస్లీం జనాభాతో సమానం అని ప్రముఖ ఆర్థికవేత్త అబూసలేహ్ షరీఫ్ తన బ్లాగులో చెప్పారు. గత రెండు దశాబ్దాలలో హిందూ జనాభా తగ్గుదల రేటు కన్నా ముస్లీం జనాభా తగ్గుదల రేటు ఎక్కువగా ఉన్నది. కాని దీనిని సానుకూలమైన అంశంగా చూడటం లేదు. దేశం మొత్తం మీద ముస్లీంలలో మహిళల శాతం ఎక్కువగా ఉండటాన్ని అభ్యుదయానికి సూచికగా పరిగణించటం లేదు.

ముస్లీం నాయకులెప్పుడూ ఎక్కువ మంది పిల్లలను కనమని చెప్పలేదని, కాని ఇందుకు విరుద్ధంగా ప్రచారం జరుగుతున్నదని జమాత్-ఇ-ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి మహమ్మద్ సలీమ్ ఇంజనీర్ చెప్పాడు. "అవును. మేము ఆడపిల్లలను చంపవద్దని చెపుతున్నాము. ముస్లీంలలో లైంగిక నిష్పత్తి ఎక్కువగా ఉంది కాబట్టే మొత్తం లైంగిక నిష్పత్తి ఎక్కువగా ఉంది. ఆడ శిశువులను హత్య చేయటానికి ముస్లీం మతం దూరంగా ఉందని సచార్ కమిటి కూడా చెప్పింది. మతపరమైన జనాభా లెక్కలను విడుదల చేయటానికి మేము వ్యతిరేకం

> **"గత రెండు దశాబ్దాలలో హిందూ జనాభా తగ్గుదల రేటు కన్నా ముస్లీం జనాభా తగ్గుదల రేటు ఎక్కువగా ఉన్నది. కాని దీనిని సానుకూలమైన అంశంగా చూడటం లేదు. దేశం మొత్తం మీద ముస్లీంలలో మహిళల శాతం ఎక్కువగా ఉండటాన్ని అభ్యుదయానికి సూచికగా పరిగణించటం లేదు."**



మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్

కాదు. వాటిని దుర్వినియోగం చేయటానికి, ఒక మతాన్ని శత్రువుగా ముద్ర వేయటానికి మేము వ్యతిరేకం" అని ఆయన చెప్పాడు.

**సాధించాల్సిన లక్ష్యాలు**

ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ ఉన్మాదపూరితమైన ప్రచారాన్ని అరికట్టటానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. 2000 సంవత్సరంలో జనాభాను గురించి రూపొందించిన నివేదిక, అందులో చెప్పిన లక్ష్యాలు సరైనవని జనాభా, అభివృద్ధి విషయాలలో మొదటగా ఏర్పడిన సంస్థలలో ఒకటైన పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పియఫ్ఐ) సంస్థలో కోర్ గ్రాంట్ అండ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తున్న అలోక్ బాజ్‌పాయ్ చెప్పాడు. కుటుంబ నియంత్రణ లక్ష్యాలను నిర్దేశించి, క్యాంపులను పెట్టారని ఆయన చెప్పాడు. 2014 నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో ఆపరేషన్ల సమయంలో యువతుల మరణం తర్వాత పియఫ్ఐ ఇతర సంస్థలతో కలిసి ఒక నివేదికను తయారు చేసింది. ఆ నివేదిక ననుసరించి గత ఐదు దశాబ్దాలలో అమలు చేసిన కుటుంబ నియంత్రణ కార్యక్రమం పునరుత్పత్తి, మానవహక్కుల అంశాలను వదలివేసి, కేవలం జనాభాను తగ్గించటమే లక్ష్యంగా పనిచేసింది. 1994లో కైరోలో జనాభా-అభివృద్ధిపై జరిగిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ పాపులేషన్ ఆండ్ డెవలప్‌మెంట్(ఐసిపిడి) సమావేశంలో నిర్ణయించిన ఈ అంశాలను భారతదేశం అంగీకరించినా అమలు జరపలేదు. "జనాభా పెరుగుదలను నిరోధించటానికి అభివృద్ధి సరైన మందు" అని ఆ సమావేశం పిలుపునిచ్చింది.

భారతదేశం కైరో సమావేశంలో పాల్గొని, డిక్లరేషన్ మీద సంతకం పెట్టినప్పటికీ అభివృద్ధికి, జనాభా పెరుగుదలను తగ్గించటానికి తన స్వంత మార్గాలను ఎంపిక చేసుకొంది. సాధారణ ప్రజలకు సమాచారం, సేవలను అందించటం ఆధారంగా కుటుంబ నియంత్రణ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ప్రభుత్వం, ఇతర సంస్థల నిర్దేశాలపై ఆధారపడి ఉండరాదని ఐసిపిడి తీర్మానం పిలుపు ఇచ్చింది. ప్రభుత్వాల అభివృద్ధి వ్యూహంలో జనాభాకు సంబంధించిన అంశాలు భాగమైనప్పటికీ, కుటుంబ నియంత్రణను అమలు చేసేవారికి కోటాలు, లక్ష్యాలను నిర్దేశించే రూపంలో ఇది జరగరాదని చెప్పింది.

దశాబ్దకాలపు లెక్కలను పరిశీలిస్తే అన్ని

> **"రక్తహీనతకు సంబంధించి మతాల వారీ వివరాలు సేకరించనప్పటికీ, అన్ని మతాలలోని పేదలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. బాలలు, మహిళాభివృద్ధి మంత్రిత్వశాఖ, మైనారిటీ మంత్రిత్వ శాఖల బడ్జెట్లతో పాటు మొత్తంగా బడ్జెట్ కేటాయింపులు తగ్గించారు."**



ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓ కుటుంబ నియంత్రణ శిబిరం వద్ద మహిళలు

మతాలలోనూ జనాభా పెరుగుదల రేటు తగ్గిందని బాజ్‌పాయ్ చెప్పాడు. ఇది ప్రజానీకంలో సహజంగా వచ్చిన మార్పుగా తాను భావిస్తున్నానని ఆయన చెప్పాడు. జనాభా తగ్గుదల లేదా పెరుగుదల మతపరమైన అంశాలపై ఆధారపడిలేదని చెప్పాడు. విద్య, ఆర్థికరంగంలో తమకు అందుబాటులో ఉన్న అవకాశాలకు అనుగుణంగా కేరళ, ఉత్తరప్రదేశ్ లలోని ముస్లింలు భిన్నంగా స్పందిస్తారని ఆయన చెప్పాడు. 2011 సెన్సస్ నివేదికలో తీవ్రంగా ఆందోళన పరిచే అంశం స్త్రీ, పురుష నిష్పత్తి. ఉదాహరణకు ఒకే మతంలో కూడా ప్రాంతాల ననుసరించి పెరుగుదలలో హెచ్చుతగ్గులున్నాయి. తాము నివసిస్తున్న ప్రాంతాలలోని సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సాంప్రదాయాల ననుసరించి, వివిధ మతాల ప్రజలు స్పందిస్తున్నారు. మొత్తంగా చూసినపుడు క్రైస్తవులలో స్త్రీ,పురుష నిష్పత్తి 1000 మంది పురుషులకు 1023 మంది స్త్రీలతో అత్యంత ఎక్కువగా ఉంది. కాని హర్యానా, పంజాబ్‌లలో తక్కువగా ఉంది. హర్యానాలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యలో వెనుకబడి ఉండటం, వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవటం వలన ఆ రాష్ట్రంలోని పెరుగుదలను బీహార్‌లోని కిషన్‌గంజ్, హర్యానాలోని మేవాట్ ప్రాంతాలలోని ముస్లీం జనాభా పెరుగుదలతో పోల్చవచ్చు.

"జనాభా విస్ఫోటనం జరిగే అవకాశం లేదని, సంఖ్యరీత్యా ముస్లింలు హిందువుల సమీపంలోకి కూడా వచ్చే అవకాశాలు లేవని జనాభా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం పునరుత్పత్తి రేటుకు సంబంధించి బంగ్లాదేశ్, ఇండోనేషియాలు మంచి కృషి చేస్తున్నాయి. ఆ దేశాలు ప్రజలకు వివిధ రకాల సేవలను అందిస్తున్నాయి. జనాభా వృద్ధిని నిరోధించే సాధనాల వినియోగాన్ని మతం నిర్దేశించదు. ఉత్తరప్రదేశ్‌లోని ముస్లీం మహిళలు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయకుండానే గర్భాన్ని నిరోధించే ఇంజక్షన్లను వినియోగిస్తున్న ఉదాహరణలున్నాయి. ఇదే విధంగా రాజస్థాన్‌లోని రాజసమంద్ జిల్లాలో హిందు, ముస్లీం మహిళలు కుటుంబ నియంత్రణ సేవలను వినియోగించుకోవటం గురించి కూడా మనకు తెలుసు. వివాహానంతరం కుటుంబ పరిమాణానికి సంబంధించిన అంశాలను నిర్ణయించటంలో తమకు భాగం ఉండదనే భయంతో పెళ్ళికి ముందే మహిళలు కుటుంబ నియంత్రణ ఇంజక్షన్లు చేయించుకొంటున్న ఉదాహరణలు ఉన్నాయని" ఆయన చెప్పాడు.

జనాభా పెరుగుదలను అరికట్టటానికి మహిళలు కుటుంబనియంత్రణ అపరేషన్లు చేయించుకోవటం భారతదేశంలో ప్రధానమైనది. సెన్సస్ కార్యాలయం ఈ మధ్యనే విడుదల చేసిన మరొక ముఖ్యమైన విషయం మతాలవారీ జనాభా లెక్కల వివరాలు కలిగించినంత ఆసక్తిని కలిగించలేదు. తొమ్మిది రాష్ట్రాలలోని 284 జిల్లాలలో 16 లక్షల మంది ప్రజలపై వైద్య, ఆరోగ్య, శారీరక ఎదుగుదలపై నిర్వహించిన సర్వేకు సంబంధించిన వివరాలను విడుదల చేశారు. అన్ని వయసుల వారిలోనూ బరువు తక్కువగా ఉండటం, గిడసబారిపోవటంతో పాటు, తీవ్రస్థాయిలో ఉన్న రక్తహీనతను ఈ సర్వే వెల్లడించింది. రక్తహీనతకు సంబంధించి మతాల వారీ వివరాలు సేకరించనప్పటికీ, అన్ని మతాలలోని పేదలలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. బాలలు, మహిళాభివృద్ధి మంత్రిత్వశాఖ, మైనారిటీ మంత్రిత్వ శాఖల బడ్జెట్లతో పాటు మొత్తంగా బడ్జెట్ కేటాయింపులు తగ్గించారు. ఆరోగ్యశాఖ బడ్జెట్ స్థంభించిపోయి, శాతంలో చూస్తే బ్రిక్స్ దేశాలలోని బ్రెజిల్, రష్యా, చైనాలలో కన్నా తక్కువగా ఉంది. ఫలితంగా ఆరోగ్యం, పునరుత్పత్తి అంశాలలో ఫలితాలు నెమ్మదిగా వస్తున్నాయి.

హిందూత్వ సంస్థలు తమ ప్రచారంలో వినియోగిస్తున్న, మీడియాలోని కొన్ని సెక్షన్లు ప్రచారం చేస్తున్న పైపై విశ్లేషణలను పక్కనపెట్టి, 2011 సెన్సస్‌లోని మతాలవారీగా జనాభా లెక్కల వివరాలను లోతుగా విశ్లేషిస్తే చాలా ముఖ్యమైన అంశాలను అర్థం చేసుకోవచ్చు. కాని 2014 లోక్‌సభ ఎన్నికలలో చూసినట్లుగా ఎన్నికలలో విజయం సాధించటం కోసం కట్టుకథలను సృష్టించటం, వాటిని ప్రచారం చేయటం ద్వారా ఎన్నికల విజయాలను సాధించటం హిందూత్వవాదుల లక్ష్యంగా ఉంది. 2011 సెన్సస్‌లోని మతాలవారీగా ప్రకటించిన జనాభా వివరాలను అందుకోసం వినియోగించుకొనే క్రమం కొనసాగుతున్నది. ❋

# భారత సమాజాన్ని అధోగతికి దిగజార్చిన వర్ణవ్యవస్థ

## (సివి రచన 'వర్ణ వ్యవస్థ' పుస్తక పరిచయం)

ఎం. నిర్మల్‌కుమార్

చిత్తజల్లు వరహాలరావు అనే పేరు తెలుగు పాఠకులకు, సాహిత్య ప్రియులకు అంతగా పరిచయం లేని పేరు. కానీ దీనినే 'సివి' అని చెపితే అది పాఠకులకు బాగా తెలిసిన పేరు. 'సివి' అనే రెండక్షరాలు తెలుగు సాహితీ లోకానికి బాగా పరిచయమైనవి. సివి' కలం పేరుతో చిత్తజల్లు వరహాలరావుగారు గద్య రూపంలో, కవితా కావ్యాల రూపంలో అనేక రచనలు మనకందించారు. 1970ల నుండి అనేకమంది యువతీ యువకులు వీరి పుస్తకాలు చదివి ఉత్తేజితులయ్యారు. వీరు రాజకీయ, ఆర్థిక, సామాజిక, తాత్విక, సాంస్కృతిక అంశాలను శాస్త్రీయంగా విశ్లేషించి రాశారు. వీరి పదునైన విశేషణలు పాఠకులను అనేక రకాల సంకుచితత్వాల నుండి బయటికి లాగి, అభ్యుదయ మార్గంలో నడిపించేందుకు దోహదం చేసేవి. మూఢ నమ్మకాలు, మతోన్మాదం, కులతత్వం, దోపిడీ, అసమానతలకు అసలు కారణాలను వివరించి, వీటి పరిష్కారానికి మార్గం చూపేందుకు సివిగారు కృషిచేశారు. వామపక్ష, హేతువాద ఉద్యమాలకు వీరి రచనలు అక్షరాయుధాలను అందించేవి. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. ప్రవృత్తిరీత్యా కమ్యూనిస్టు. భారత సమాజానికి, అభ్యుదయ ఉద్యమాలకు ప్రధాన సమస్యగా ఉన్న కుల సమస్య గూర్చి సి.వి.గారు విశేషంగా పరిశోధించి రాశారు.

భారతదేశంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా కన్పించని వికృత సమస్య కులం. ఈ కుల వ్యవస్థ ఎలా పుట్టింది? ఎందుకు పుట్టింది? దీనివల్ల భారత సమాజానికి మేలు జరిగిందా? కీడు జరిగిందా? వంటి ప్రశ్నల గురించి సివిగారు పరిశోధించి వ్రాసిన పుస్తకమే ''వర్ణవ్యవస్థ''. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు వంటి హిందూ మత గ్రంథాలను అధ్యయనం చేసి వీరీ పుస్తకం రాశారు. తాత్విక-జ్ఞాన రంగాల్లో మూఢ విశ్వాసం, గుడ్డి అనుకరణ, గుడ్డి అనుసరణల స్థానంలో హేతుబద్ధత, తార్కికతలుండాలని వీరు బోధిస్తారు. వీరి రచనలలో ప్రధానమైనది వర్ణవ్యవస్థ.

మనదేశంలో ఇప్పుడున్న కులవ్యవస్థ ప్రారంభంలో వర్ణవ్యవస్థగా ఉండేది. ఈ వ్యవస్థ సమాజాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలుగా విభజించింది. ఆనాటి పాలకవర్గ మేధావులు వర్గదోపిడీని వ్యవస్థీకృతం చేసేందుకు వర్ణ వ్యవస్థను సృష్టించారు. భగవంతునిచే ఈ విభజన చేయబడిందని ప్రచారం చేసి, ప్రజలను నమ్మించారు. బ్రహ్మదేవుని ముఖంలో నుంచి బ్రాహ్మణులు, బాహువుల్లో నుంచి క్షత్రియులు, తొడల్లోంచి వైశ్యులు, పాదాల్లోంచి శూద్రులు పుట్టుకొచ్చారని ప్రచారం చేశారు. ఈ విషయాన్ని రుగ్వేదం పదవ మండలంలోని పురుషసూక్తం 12వ రుక్కులో పొందుపరిచారు. బ్రాహ్మణులుగా తమను తాము ప్రకటించుకున్న స్వార్థ మేధావుల కుట్ర ఇది. బ్రాహ్మణులు తెలివితేటలు గలవారుగా పుట్టించబడ్డారు. అందుచేత వీరు సమాజంలోని ఇతరులందరికీ మంచీ-చెడులు బోధించాలి. బ్రహ్మముఖం లోనుంచి రావడమే వీరి తెలివితేటలకు కారణం. క్షత్రియులు బ్రహ్మ బాహువుల్లో నుంచి వచ్చారు. అందుచేత వీరికి భుజబలం ఎక్కువగా ఉంటుంది. యుద్ధాలు, రాజ్య సంరక్షణా బాధ్యతలు వీరు చూస్తారు. అందుచేత వీరు రాజ్యాన్ని పాలించాలి. వైశ్యులు తొడల్లోంచి వచ్చిన కారణంగా వ్యవసాయం, పశుపోషణలు వంటి శారీరక శ్రమలు చేయాలి. అందరికంటే హీనులుగా జన్మించినవారు శూద్రులు. అందుచేత వీరు ఇతర వర్ణాల వారికి సేవలు చేయాలి. ఈ విభజన దైవసృష్టి. కాబట్టి దీనిని అందరూ పాటించాలి. ఇది సామాజిక ధర్మం. అన్ని సమాజాలకూ ఈ వర్ణవ్యవస్థ ఆదర్శనీయం. వర్ణధర్మం అతిక్రమించబడితే సమాజం భ్రష్టుపట్టిపోతుందని వర్ణవ్యవస్థ నిర్మాతలు ప్రచారం చేశారు. సమాజ పరిణామ క్రమంలో భాగంగా జనాభా పెరగటం, అనేక కొత్తవృత్తులు తలెత్తటంతో ఈ వర్ణవ్యవస్థలో స్వల్ప మార్పులు ప్రవేశపెట్టారు. వైశ్యులకు వ్యాపారాలను, శూద్రులకు ఉత్పత్తి శ్రమలను అప్పగించి, వారి స్థానాన్ని స్వల్పంగా పెంచారు. పంచములు అనే వర్ణం కొత్తగా ప్రవేశపెట్టబడింది. అంతకుముందు శూద్రులకిచ్చిన హీనస్థానాన్ని పంచములకిచ్చారు.

నిజానికి ఈ వర్ణవ్యవస్థ, దీనిలో నుంచి పుట్టుకొచ్చిన కులవ్యవస్థ వర్గదోపిడీకి సాధనాలుగా ఉన్నాయి. యాజమాన్యవర్గాల అధికారాన్ని సుస్థిరం చేయడానికే ఈ వ్యవస్థలు ఉనికిలోకి వచ్చాయి. మానవ చరిత్ర ప్రారంభంలో, అంటే ఆదిమ - ఆటవిక వ్యవస్థలో వర్గ విభజన లేదు. ఆ కాలంలో తమ జీవితావసరాల కోసం అందరూ శ్రమించేవారు. (ఆహార సేకరణ, వేట). శ్రమ ఫలితాన్ని అందరూ సమిష్టిగా అనుభవించేవారు. తర్వాత వర్గాలు ఏర్పడ్డాయి. బలవంతులు, తెలివైనవారు, యజమానులు, పాలకులుగా మారి, బలహీనుల్ని బానిసలుగా మార్చేశారు. భూమి, ఆయుధాలు, పశువులు, పరికరాలు తదితర ఉత్పత్తి సాధనాలను చేజిక్కించుకుని తమ సొంతఆస్థిగా చేసుకున్నారు. ఈ ఉత్పత్తి సాధనాలపై హక్కును కోల్పోయినవారు బానిసలుగా, పాలితులుగా, దోచుకోబడే వారుగా మారిపోయారు. చివరికి వీరు మనుషులు అనే గుర్తింపును కూడా కోల్పోయారు. పశువులతో పాటుగా ఈ బానిసలు కూడా యజమానుల

> **"ఈ దోపిడీ వ్యవస్థ పరిరక్షణ కోసం ఒకవైపు భౌతికహింసను, మరోవైపు ఆధ్యాత్మిక భావాలను ఉపయోగించుకున్నారు. భౌతిక హింస అంటే రాజ దండంతో పీడితుల్ని అణిచి ఉంచడం, ఆధ్యాత్మిక భావ జాలం అంటే ఈ వర్ణవ్యవస్థ, అసమానతలు దైవికమని ప్రజలందరి చేత నమ్మింపచేయటం."**

సొంత ఆస్తిగా మారిపోయారు. పాలకవర్గాలు ఈ దోపిడీ వ్యవస్థను పటిష్టపర్చేందుకై అనేక రక్షణ వ్యవస్థలను నిర్మించారు. రాజకీయం, మతం, సంస్కృతి, విద్య చట్టం, న్యాయవ్యవస్థ మొదలైనవన్నీ దోపిడీ వ్యవస్థకు అనుగుణంగా మలచబడ్డాయి. ఇదంతా ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిణామమే! భారతదేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. అయితే భారతదేశంలో వర్గవ్యవస్థ వర్ణవ్యవస్థ రూపంలో ఉనికిలోకొచ్చింది. ఆ తర్వాత కులవ్యవస్థగా మారింది.

వర్ణవ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల వారు పాలకవర్గాలుగా శూద్రులు, పంచముల్ని దోపిడీ, అణిచివేతలకు గురిచేశారు. ఈ వర్ణాలు ఆ తర్వాత కులాలుగా అనేక చీలికలు పేలికలుగా విభజించబడ్డాయి. కులవ్యవస్థలో కూడా పాలక కులాలు, పాలిత కులాలు అనే స్పష్టమైన విభజన ఉంది. బ్రాహ్మణ మేధావులు ఈ కులాల మధ్య సామాజిక సంబంధాలను నిషేధిస్తూ అనేక అడ్డుగోడలు కట్టారు. ఈకుల కట్టుబాట్లు భారత సమాజాన్ని నాశనం చేశాయి. సాంఘిక-సాంస్కృతిక రంగాల్లో భారతజాతి అధోగతి పాలయ్యింది. నేడు కులోన్మాదం కేన్సర్ వ్యాధిలా సమాజంలోని అన్ని రంగాల్లోకీ పాకిపోతోంది.

భారతదేశానికి ఆర్యులు రాకముందు ఇక్కడ వర్ణవ్యవస్థ లేదు. ఆర్యులు హరప్పా - మొహెంజొదారో నివాసుల్ని ఓడించి, వారిని దాసులుగా (బానిసలుగా) మార్చుకొని, వారిని వర్ణవ్యవస్థలో శూద్రవర్ణంగా మార్చివేశారు. తెలుపు-నలుపు అనే రంగు భేదం, ఆర్య-అనార్య అనే జాతి భేదమూ మిళితమై వర్ణభేదంగా పరిణమించింది. మొట్టమొదట ఆర్యుల్లో వర్ణభేదం లేదు. వృత్తి విభజన ఉంది. ఇదే చివరికి వృత్తి కులాలుగా ఏర్పడేందుకు దారితీసింది. యుద్ధాల్లో ద్రావిడులు ఓడినప్పటికీ, వీరు ఆర్యులకంటే ఉన్నతమైన నాగరికతను కలిగివున్నారు. ఆర్యులతో సంబంధాలు ఏర్పడే నాటికే ద్రావిడుల్లో శ్రమ విభజన ఉంది. ప్రారంభంలో పశుపోషకులుగా ఉన్న ఆర్యులు, ద్రావిడులతో సంబంధాల ఫలితంగా, వారి నుండి వ్యవసాయం నేర్చుకున్నారు. వ్యవసాయంలోని లాభాల్ని గ్రహించిన ఆర్యులు భారీఎత్తున అడవుల్ని కొట్టి, సాగుచేయటం ప్రారంభించారు. దాసులుగా మార్చబడ్డ ద్రావిడుల శ్రమ వీరికి గొప్పగా ఉపకరించింది.

దాదాపు క్రీ.పూ. 1500-1000 ఏళ్ళ మధ్య రచింపబడిన వేదాలు అంతరించిపోకుండా చూసేందుకు కొందరు వాటిని కంఠతా పట్టడం ప్రారంభించారు. వీరే పురోహితులుగా, బ్రాహ్మణులుగా గుర్తించబడ్డారు. వర్షాలు పడే కార్తెలను గూర్చిన అధ్యయనమూ, జ్యోతిష్యమూ, యజ్ఞయాగాది కర్మలూ వంటి పనులు సమాజంలో వీరిని ఉన్నత వర్గీయులుగా మార్చివేశాయి. యుద్ధాల్లో ఓడిన ద్రావిడులు, ఇతర ఆదిమవాసులు బానిసలుగా మార్చబడి, వ్యవసాయంలో వినియోగించబడ్డారు. శూద్రులు కూలిడబ్బుల్తోనే తృప్తిపడాలని, దేవుని ప్రతినిధులైన బ్రాహ్మణులు మాత్రం కష్టించి పనిచేయాల్సిన అవసరం లేదని, ఈ వైదిక పురోహితులే ధర్మశాస్త్రాలు రాసి ప్రచారం చేశారు. ఈ వర్గదోపిడీ పరిరక్షణార్థం రాజ్యం అవతరించింది. బ్రాహ్మణులు చెప్పినట్లు వింటూ శూద్రుల్ని అణిచిపెట్టి ఉంచగల బందిపోట్లు క్షత్రియ వర్గంగా రూపొందారు. వర్ణవ్యవస్థ పరిరక్షణార్థం రాజ్యం ఉనికిలోకొచ్చింది. ఈ రాజ్యవ్యవస్థను అత్యంత పవిత్రమైనదిగా పురోహిత వర్గాలు ప్రచారం చేశాయి. "నా విష్ణు పృథ్విపతి" అనే భావాన్ని ప్రచారం చేశారు. ఈ దోపిడీ వ్యవస్థ పరిరక్షణ కోసం ఒకవైపు భౌతికహింసను, మరోవైపు ఆధ్యాత్మిక భావాలను ఉపయోగించుకున్నారు. భౌతిక హింస అంటే రాజదండంతో పీడితుల్ని అణిచి ఉంచడం, ఆధ్యాత్మిక భావజాలం అంటే ఈ వర్ణవ్యవస్థ, అసమానతలు దైవికమని ప్రజలందరి చేత నమ్మింపచేయటం.

ఇంద్రుడు, రాముడు, కృష్ణుడు వంటి ఆర్యుల దేవుళ్ళందరూ ఈ వర్ణ, కుల వ్యవస్థనూ, దోపిడీని వ్యవస్థీకృతం చేసేందుకు ఉపయోగపడ్డారు. శంభూకుడనే శూద్రుడు వర్ణ ధర్మాన్ని ధిక్కరించి, వేదాలు చదివినందుకు ఆనాటి పురోహిత వర్గాలు రామునిచేత శంభూకవధ చేయిస్తారు. రామాయణం కల్పిత కథే అయినా ఆ కథలో సమాజపు పోకడలు చిత్రించబడ్డాయి. మహాభారత కథలోని ఏకలవ్యుని వృత్తాంతమూ ఇట్లాంటిదే!

పరమ దుర్మార్గమైన ఈ బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకులు చార్వాకులు. వీరు భారత చరిత్రలో తొలి భౌతికవాదులు. మూఢ నమ్మకాలను, యజ్ఞ యాగాదులను, వర్ణ ధర్మాన్ని చార్వాకులు ప్రశ్నించారు. దురదృష్టవశాత్తూ వీరు రచించిన గ్రంథాలేవీ మిగలలేదు. వీరిని గురించి ప్రస్తావించిన ఇతర ధార్మిక గ్రంథాలే వీరి ఉనికికి ఆధారం. ప్రముఖ చార్వాక తాత్వికుడు అజితకేశ కంబలి. ఈ సమస్త విశ్వం పదార్థమయం. ఆత్మ పరమాత్మలు అనే భావాలు వట్టి అబద్ధాలు. తాటి రసాన్ని పులియబెడితే అందులోంచి మత్తు పుట్టుకొచ్చినట్లు నేల, నిప్పు, నీరు, గాలి అనే నాలుగు భూతాల యాదృచ్ఛిక సంయోగ ఫలితంగా ప్రాణం ఉద్భవించిందని ఇతను బోధించాడు. గౌతమ బుద్ధుడు, మహావీరుడు ఇతని బోధనలతో ప్రభావితులైనారు. తమ దోపిడీని ప్రశ్నిస్తూ, ప్రజల్ని చైతన్యపరుస్తున్నారని బ్రాహ్మణ పురోహితులు వీరిని, వీరి రచనలను నాశనం చేశారు. మనువు చార్వాకుల శిరస్సులను ఖండించమని శాసించాడు. ఆదిశంకరుడు చార్వాకుల్ని దారుణంగా చంపించి, 'హేతు విధ్వంసకుడు' అనే బిరుదును సైతం పొందాడు.

చార్వాకులంత తీవ్రంగా కాకపోయినా బౌద్ధులు కూడా వర్ణవ్యవస్థను, బ్రాహ్మణ కర్మకాండల్లోని మూఢత్వాన్ని ప్రశ్నించారు. సమాజంపై బౌద్ధం ప్రభావం చూపింది. వర్ణ వ్యవస్థకు విరుద్ధంగా బుద్ధుడు అందరూ సమానమని బోధించాడు. వ్యక్తికి జన్మ ప్రధానం కాదు. గుణమే ప్రధానం. తామే గొప్పవారమని విర్రవీగటం బ్రాహ్మణులకు తగదని బుద్ధుడు బోధించాడు. జైన-బౌద్ధాలు యజ్ఞ యాగాదుల పేరిట జీవహింస చేయడాన్ని ఖండించి, అహింసను బోధించాయి. భారత సమాజంలో హేతువాదాన్ని, తార్కిక ఆలోచనా శక్తిని పెంపొందించాయి. ఈ రెండు దర్శనాలూ

హేతుబద్ధ ఆలోచనా ధోరణితో పాటు, నైతిక విలువలకు కూడా ప్రాధాన్యతనిచ్చాయి. ఒకానొక దశలో బౌద్ధం ధాటికి వైదిక మతం కనుమరుగయ్యే సూచనలు కన్పించాయి. కానీ బౌద్ధంలోని తాత్విక బలహీనతలు, బ్రాహ్మణ పురోహితుల కుట్రల వల్ల ఈ మతం బాగా బలహీనపడిపోయింది. బుద్ధుడు ప్రతి విషయంలోనూ మధ్యేమార్గాన్ని అవలంభించాడు. వర్ణవ్యవస్థను, బానిస విధానాన్ని ఖండించాడు. కానీ దానిని తుదముట్టించడానికి ప్రయత్నించలేదు. ఆత్మ భావనను నిరాకరించాడు. కానీ పునర్జన్మను అంగీకరించాడు. బౌద్ధంలోని ఇలాంటి తాత్విక బలహీనతలు నాగార్జునుని శూన్యవాదానికి దారితీశాయి. కాలక్రమేణా బౌద్ధం వైదిక మతశాఖగా మారిపోయింది. బుద్ధుడు తిరస్కరించిన విగ్రహారాధన, కర్మకాండలు, కుల అసమానతలు బౌద్ధంలో చోటు చేసుకున్నాయి.

భారతదేశంలో మొట్టమొదటి సామ్రాజ్యాన్ని స్థాపించిన వారు నందరాజులు. వీరిలో ప్రముఖుడు మహాపద్మనందుడు. ఇతను మంగలి కులస్తుడు. అంటే నందరాజులు శూద్రులు. వీరు వైదిక మతాన్ని కాదని, జైన మతాన్ని పాటించారు. అయితే వైదిక మత కౌటిల్యం ముందు ఈ శూద్రరాజులు ఓడిపోయారు. జైన, బౌద్ధాలను, వర్ణ సంకరాన్ని నాశనం చేసి, వైదిక మతాన్ని పునరుద్ధరించేందుకు ఓ బ్రాహ్మణ మేధావి కంకణం కట్టుకున్నాడు. అతనే కౌటిల్యుడు లేదా చాణుక్యుడు. ఇతని విజయం వల్ల భారత సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ మళ్ళీ బలపడింది. ఇతని అర్థశాస్త్ర గ్రంథం సమాజాన్ని రాజులు ఎలా కట్టుదిట్టం చేయాలో తెలుపుతుంది. వర్ణ సంకరం వల్ల లోకం నశిస్తుంది. కాబట్టి ప్రభువు ప్రజల్ని స్వధర్మం నుండి దూరం కానివ్వరాదని ఇతను బోధించాడు. మొదటి మౌర్య రాజు చంద్రగుప్తుడు వైదిక మతాన్ని అవలంభించినా, మరో ప్రముఖ మౌర్యరాజు అశోకుడు బౌద్ధాన్ని ఆచరించాడు. ఇతనికాలంలో బౌద్ధం ఇంతింతై వటుడింతై అన్న చందంగా వ్యాప్తిచెందింది. ఫలితంగా వైదికమతం బలహీనపడింది. మళ్ళీ బ్రాహ్మణ కుట్రలు ముందుకొచ్చాయి. 187 బి.సి.లో మౌర్యరాజు బృహద్రధుని అతని బ్రాహ్మణ సేనాని పుష్యమిత్రుడు హత్యచేసి శుంగ రాజ వంశాన్ని స్థాపించాడు. ఇతను బౌద్ధుల్ని నరరూప రాక్షసులుగా చీల్చి చెండాడాడు. ఆ తర్వాతి కణ్వవంశ బ్రాహ్మణ రాజులు కూడా వైదిక మతాన్ని, వర్ణ ధర్మాన్ని

“ హిందూమత సారాంశ గ్రంథంగా చెప్పబడే ఈ భగవద్గీత నిజానికి కలగూర గంప. భగవంతుడైన శ్రీకృష్ణుడే గీతను బోధించాడని కట్టుకథను సృష్టించారు. గీతా రచయితలు శ్వేతాశ్వతర ఉపనిషత్తు, బుద్ధుని, నాగార్జునుని భావాలను మేళవించి గీతను రూపొందించారు. ఈ గ్రంథం ఉన్నత వర్గాల ప్రయోజనాల పరిరక్షణ కోసం రాయబడింది. ”



యుపిలోని బస్తీజిల్లా పిప్రావాలో 1897లో వెలికితీసిన బౌద్ధస్తూప అవశేషాలు

పునరుజ్జీవింప చేశారు. బ్రాహ్మణుల ప్రభ మళ్ళీ కోటి సూర్యుల తేజస్సుతో దేదీప్యమానంగా వెలగనారంభించింది. ప్రజా జీవితంలో చాతుర్వర్ణ వ్యవస్థ తిరిగి బలం పుంజుకుంది. కాళిదాసు వంటి కవులు వైదిక ధర్మాన్ని అపూర్వమైనదిగా వర్ణించారు. ఈ కాలంలోనే వైదిక మతం నూతన బ్రాహ్మణమతంగా ముందుకొచ్చింది. అంతకు ముందు చిన్న దేవుళ్ళుగా ఉన్న శివ-విష్ణువులు గొప్ప దేవుళ్ళుగా ముందుకొచ్చారు. అవతారాలు సృష్టించబడ్డాయి. పురాణాలు-ఇతిహాసాలు వ్రాయబడ్డాయి. గొప్ప తాత్విక-ధార్మిక గ్రంథంగా భగవద్గీతను ప్రచారం చేశారు.

హిందూమత సారాంశ గ్రంథంగా చెప్పబడే ఈ భగవద్గీత నిజానికి కలగూర గంప. భగవంతుడైన శ్రీకృష్ణుడే గీతను బోధించాడని కట్టుకథను సృష్టించారు. గీతా రచయితలు శ్వేతాశ్వతర ఉపనిషత్తు, బుద్ధుని, నాగార్జునుని భావాలను మేళవించి గీతను రూపొందించారు. ఈ గ్రంథం ఉన్నత వర్గాల ప్రయోజనాల పరిరక్షణ కోసం రాయబడింది. గీత స్త్రీలను, వైశ్యులను, శూద్రులను పాపాత్ములుగా వర్ణించింది. వర్ణవ్యవస్థ భగవంతుని సృష్టేనని ఈ గ్రంథం నమ్మబలికింది. "చాతుర్వర్ణం మాయా సృష్టి" అని భగవంతుడు చెప్పినట్లు గీతలో ప్రకటించారు. అంటే ఈ నాలుగు వర్ణాలను తానే సృష్టించినట్లు భగవంతుడు ప్రకటిస్తున్నాడని అర్థం. ఇంతకు మించిన దుర్మార్గం మరొకటి లేదు. ''గీత ప్రాధాన్యతనిచ్చింది పుట్టుకకు కాదు. గుణ కర్మలకు'' అంటూ కొందరు గీతను వెనకేసుకొస్తుంటారు. భారతదేశ చరిత్రలో గుణ కర్మలను బట్టి వర్ణము, కులము నిర్ణయించబడిన కాలముందేమో వీరు చూపించాలి. ధర్మ సంస్థాపన కోసం భగవంతుడు ప్రతి యుగంలోనూ జన్మిస్తాడని గీత ప్రకటించింది. స్వధర్మం పేరిట వర్ణధర్మాన్ని తప్ప, గీత మరింకే ధర్మాన్నీ స్పష్టంగా బోధించలేదు. శ్రీరాముడు

**" ఇతరులందరికీ వర్ణ-కుల ధర్మాన్ని గట్టిగా బోధించిన బ్రాహ్మణులు అవకాశమొచ్చినప్పుడల్లా చాలా సులువుగా ఈ ధర్మాన్ని అతిక్రమించారు. వందల సంవత్సరాలపాటు కత్తిపట్టి రాజుల్లా పాలించారు. కానీ శూద్ర, పంచముల్ని మాత్రం కుల ధర్మం పేరిట అణిచివేశారు. "**

శూద్రుడైన శంబూకుడ్ని వధించింది ఈ వర్ణ ధర్మ సంస్థాపన కోసమేనని రామాయణం వర్ణించింది.

సమస్త జీవుల్లోనూ ఉండే ఆత్మ ఒక్కటేనని అద్వైతంను బోధించిన ఆదిశంకరుడు ఆచరణలో దారుణమైన బ్రాహ్మణ పక్షపాతిగా వ్యవహరించాడు. చార్వాక, జైన, బౌద్ధం వంటి ఇతర తత్వశాస్త్రాలను నాశనం చేసిన ఘనుడు ఈ ఆదిశంకరుడు. తన మేధస్సు, వాదనా పటిమలతోనే శంకరుడు బ్రాహ్మణ మత ఆధిక్యతను నిరూపించాడని కొందరంటారు. ఇది అసత్యం. ఇతడు జైన, బౌద్ధ, చార్వాకుల్ని ఘోరంగా హింసించి చంపించాడు. చెవుల్లో సీసం పోయించి చంపటం ఇతని యొక్క ప్రత్యేక శిక్షా పద్ధతి.

ఇక మనువు యొక్క గొప్పతనాన్ని గురించి ఎంత చెప్పినా తక్కువే! కులవ్యవస్థను, దోపిడీని పటిష్టపర్చి, ఘనీభవింపజేయడంలో అతిపెద్ద పాత్ర మనుధర్మ శాస్త్రానిది. సమర్థుడైననూ శూద్రుడు ధనం సంపాయించకూడదన్నాడు. బ్రాహ్మణుడు తప్పుచేస్తే అతనికి ధనమిచ్చి పంపాలి. అదే శూద్రుడు తప్పుచేస్తే చంపాలి. ఇతను శూద్రులకు, పంచములకు ఉద్దేశించిన శిక్షలు బహిరంగంగా చర్చించడానికి వీలుకానంత దారుణంగా ఉంటాయి. శ్రామికవర్గాన్ని ఇంత హీనంగా చూసిన ధర్మం ప్రపంచంలో మరెక్కడా లేదు. ఇంత దుర్మార్గమైనది, అసహ్యకరమైనది కాబట్టే డా॥ బి.ఆర్. అంబేద్కర్ మనుధర్మ శాస్త్రాన్ని బహిరంగంగా తగులబెట్టాడు.

ఆర్యులు బలంగా వేళ్ళూనుకున్న ఉత్తర భారతదేశంలో వర్ణవ్యవస్థ పటిష్టంగా అమలుపర్చబడినా, చాలాకాలం వరకూ దక్షిణ భారతదేశంలో వర్ణ ధర్మం అమలుకాలేదు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన చేర, చోళ, పాండ్య, చేరి, తెనుగు రాజులు ద్రావిడులవ్వటమే దీనికి కారణం. వీరు తమను తాము క్షత్రియులుగా ప్రకటించుకోలేదు. వీరిని శూద్రరాజులని మనువు ప్రకటించాడు. ఐతరేయ బ్రాహ్మణం ఆంధ్రులు, తెనుగులు అనార్యులని పేర్కొంది. ఉత్తర భారతం నుండి దక్షిణాదికి బ్రాహ్మణులు వచ్చిన తర్వాతనే తెలుగు నేలలో కుల వ్యవస్థకు బీజాలు పడ్డాయి. శాతవాహనులు బ్రాహ్మణులు. వీరికాలంలోనే వర్ణధర్మానికి, వైదిక కర్మకాండలకు ప్రాముఖ్యత నివ్వడం ప్రారంభమైంది. బ్రాహ్మణులకు ధన, కనక, వస్తు, వాహనాది భూరీ విరాళాలు లభించసాగాయి. షడ్రషోపేతమైన భోజనాలతో బ్రాహ్మణ సంతర్పణలు జోరుగా సాగాయి.

సంస్కృత భాషకు ఆదరణ పెరిగింది. ఇక్ష్వాకులు, బృహత్పరాయనులు, ఆనంద గోత్రీకులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు, కదంబులు, పల్లవులు మొదలైన రాజులందరూ బ్రాహ్మణులే! విభిన్న బ్రాహ్మణ రాజులకు పేరు చివర వర్మ అని ఉంటుంది. ఈ వర్మే అనంతకాలంలో శర్మగా మారింది.

సాధారణంగా బ్రాహ్మణులంటే పౌరోహిత్యం చేసేవారని, ఆధ్యాత్మిక వృత్తిద్వారా పొట్ట పోసుకొనేవారని, కామ, క్రోధ, లోభ, మోహ మద, మాత్సర్యాలకు దూరంగా ఉంటూ, తపస్సు చేసుకుంటూ, కాయ కసరులు తింటూ, అహింసాయుత జీవితం గడిపేవారని ఎక్కువ మంది భావిస్తారు. కానీ భారతదేశ చరిత్రను పరిశీలిస్తే, బ్రాహ్మణుల జీవితం ఇందుకు భిన్నంగా కన్పిస్తుంది. ఇతరులందరికీ వర్ణ–కుల ధర్మాన్ని గట్టిగా బోధించిన బ్రాహ్మణులు అవకాశమొచ్చినప్పుడల్లా చాలా సులువుగా ఈ ధర్మాన్ని అతిక్రమించారు. వందల సంవత్సరాలపాటు కత్తిపట్టి రాజుల్లా పాలించారు. కానీ శూద్ర, పంచముల్ని మాత్రం కుల ధర్మం పేరిట అణిచివేశారు.


భారతదేశ చరిత్రను, దానిలో వర్ణాశ్రమధర్మ పుట్టు పూర్వోత్తరాలను లోతుగా పరిశీలించిన సివిగారు భారతదేశాన్ని పాలించింది బ్రాహ్మణులు, శూద్రులు మాత్రమేనని సూత్రీకరించారు. ఇది సాహసోపేతమైన సూత్రీకరణ. సిద్ధాంత రూపంలో ఉన్న వర్ణధర్మం ఆచరణలో తారుమారైందని వీరు వాదిస్తారు. అందుకవసరమైన సాక్ష్యాలు కూడా వీరు మన ముందు పెట్టారు. ఈ కోణంలో చరిత్రకారులు పరిశోధించాల్సి ఉంది. కేవలం సాహిత్యంలోనే క్షత్రియులు కన్పిస్తారు తప్ప చరిత్రలో క్షత్రియులు లేరు. క్షత్రియులుగా భావింపబడిన వారందరూ ఐతే బ్రాహ్మణులు లేదా శూద్రులు లేదా విదేశీ రాజులు. భారతదేశ చరిత్రలో మొదటి చక్రవర్తులు నందులు శూద్రులు. వీరి తర్వాత పరిపాలించిన మౌర్యులు కూడా శూద్రులే! శూద్రరాజుల్ని కుట్రల ద్వారా పడగొట్టి, రాజ్యాలేలింది బ్రాహ్మణులు. మౌర్యుల పతనానంతరం బయటి నుండి దండెత్తివచ్చిన గ్రీకులు, సిథియన్లు, హూణులు, పార్థియనులు, కుషాణులు ఈ ప్రాంతాన్ని నాలుగు శతాబ్దాల పాటు పాలించారు. అనంతరం వీరు పాలకులుగా, యుద్ధ వీరులుగా, సేవకులుగా, రకరకాల కులాల్లో లీనమైపోయారు. వీరికి మన బ్రాహ్మణ గురువులు పురాణ ప్రసిద్ధ సూర్య–చంద్ర వంశాల్ని అంటగట్టారు. దాంతో ఈ కుహనా రాజపుత్రులు తమను తాము క్షత్రియులుగా ప్రకటించుకోసాగారు. అంతేగాక ఆదిమ వాసులైన గోండ్లు, గుజారులు తదితర ప్రాచీన తెగలు హిందూమతంలో కలిసిపోయినప్పుడు వీరు తమను తాము ప్రాచీన క్షత్రియులమని చెప్పుకోసాగారు. మన వైదిక పురోహితులు ఈ వాస్తవాలకు మసిపూసి, అభూతకల్పనలతో చరిత్రను సృష్టించారు. సంభావన అందితే చాలు. వీరు తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేయగలరు. హీనలోహాలను ఉన్నత లోహాలుగా మార్చటానికి అవకాశం ఉన్నట్లే, కులం మార్చటానికి కూడా ఈ పురోహితుల దగ్గర ఓ ప్రక్రియ ఉంది. ఈ కర్మకాండ పేరు హిరణ్య గర్భవిధి. ఓ బంగారు పాత్రలో మనిషిని కూర్చోబెట్టి బ్రాహ్మణులు మంత్రాలు చదివేవారు. దాంతో ఆ మనిషి ఉన్నత కులస్తుడయ్యేవాడు. ఈ బంగారు పాత్రను బ్రాహ్మణులు స్వాహా చేసేవారని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

ఎన్నో లోపాలతో, కుట్రలతో, మోసాలతో వర్ధిల్లిన వర్ణవ్యవస్థ ఈ దేశానికి ఎన్నటికీ పూడ్చలేనంత నష్టం కలుగజేసింది. కులం పేరుతో ఇప్పటికీ చేస్తూనే ఉంది. ఈ

(మిగతా 35వ పేజీలో)

# వలసవాదం నయా ఉదారవాదం

ఎ. కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు బాధ్యులు

**1991** తర్వాత దేశంలో అమలు జరుపుతున్న నయా ఉదారవాద విధానాలు దేశాన్ని అభివృద్ధి చేస్తాయని, పారిశ్రామికాభివృద్ధి జరుగుతుందని, ప్రజల జీవితాల్లో కనీవినీ ఎరుగని అభివృద్ధికరమైన మార్పులు వస్తాయని ప్రచారం చేశారు. ఈ విధానాల అమలు ప్రారంభమై 25 సంవత్సరాలు గడచిపోయినా ఇప్పటికీ అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. వాస్తవంలో ఇందుకు విరుద్ధంగా జరుగుతున్నది. ఇలా జరగటానికి కారణం నయా ఉదారవాద విధానాల రూపకల్పనలోనే ఉంది. నయా ఉదారవాద విధానాలను ఆర్థికంగా వెనుకబడిన, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం రూపొందించలేదు. పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించి, వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తుల గుట్టలు పెరుగుతుండగా, వాటిని అమ్ముకోవటానికి మార్కెట్ల కోసం అన్వేషిస్తున్న, ద్రవ్య పెట్టుబడులు పోగుపడిన సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాల కోసం రూపొందించబడ్డాయి. 80వ దశకంలో పారిశ్రామిక దేశాలు ఎదుర్కొంటున్న సంక్షోభం తీవ్రమైంది. ఆ సంక్షోభం నుండి బయట పడాలంటే సంక్షోభ భారాలన్నింటిని వెనుకబడిన దేశాలపై నెట్టివేయాలి. అందుకోసం రూపొందించినవే నయా ఉదారవాద విధానాలు. అయితే తమ భారాలన్నింటిని వెనుకబడిన దేశాలపై వేస్తామని బహిరంగంగా ప్రకటిస్తే ఆ విధానాలను అమలు జరపటానికి వెనుకబడిన దేశాలలోని ప్రజలు అంగీకరించరు. కాబట్టి నయా ఉదారవాద విధానాలను అమలు జరిపితే వెనుకబడిన దేశాలు అభివృద్ధి సాధిస్తాయని, ప్రజల జీవన పరిస్థితులు మెరుగుపడతాయని, నిరుద్యోగం తగ్గుతుందని మోసపు ప్రచారం చేస్తూ, ప్రజలను మభ్యపెట్టారు. వెనుకబడిన దేశాల పాలకులకు నయా ఉదారవాద విధానాల నిజస్వరూపం తెలిసినా అవి తమకు కూడా ప్రయోజనం కలిగిస్తాయి. కాబట్టి సామ్రాజ్యవాదుల ప్రచారాన్ని భుజాన వేసుకొని తమ దేశాల ప్రజలను మోసం చేయటానికి పూనుకున్నారు. అందువలననే నయా ఉదారవాద విధానాలను అమలు జరపటానికి పూనుకున్న పాలకులు ప్రజలకు నిజాలు చెప్పకుండా నిరంతరం మభ్యపెడుతుంటారు. నయా ఉదారవాద విధానాల అమలును ప్రారంభించిన పివి నరసింహారావు నుండి నేటి నరేంద్రమోడి, చంద్రబాబుల వరకు మాటలకు చేతలకు పొంతనలేని పరిస్థితిని చూస్తున్నాం. ఈ విధానాలను ఎంత తీవ్రంగా అమలు చేయటానికి పూనుకుంటే అంత ఎక్కువగా ప్రజలను మోసం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న యన్‌డిఎ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వాలు గత ప్రభుత్వాల కన్నా నయా ఉదారవాద విధానాలను మరింత వేగంగా అమలు జరపటానికి పూనుకున్నాయి. కాబట్టి ప్రజలకు వాస్తవాలను చెప్పకుండా మరింతగా మభ్యపెట్టటానికి ప్రయత్నిస్తున్నాయి. వేగంగా అభివృద్ధిని సాధించాలంటే, జిడిపిని రెండంకెల స్థాయికి పెంచాలంటే సంస్కరణలను వేగంగా అమలు జరపాలనే పేరుతో మోడి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను, బ్యాంకులను, గనులను, భూములను, మొత్తంగా జాతీయ సంపదను కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అప్పగించటానికి పూనుకున్నది.

రాష్ట్రంలో చంద్రబాబునాయుడు కూడా ఇదే విధంగా రాష్ట్రాన్ని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించటానికి పూనుకున్నాడు. పూటపూటకూ మోసపు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నాడు. రాజధాని నిర్మాణానికి భూసమీకరణ పేరుతో 35,000 ఎకరాలను సమీకరించటానికి రైతులకు ఏ విధంగా మోసపు మాటలు చెప్పారో ఇపుడు బట్టబయలవుతున్నాయి. మొదట గ్రామాలను కదిలించబోమని, భూములిచ్చిన రైతులకు వారి గ్రామాల్లోనే నివాస స్థలాలు, వాణిజ్య స్థలాలు కేటాయిస్తామని చెప్పారు. కాని సింగపూర్ ప్రభుత్వం తయారు చేసిన రాజధాని ప్రణాళికలో గ్రామాలను మినహాయించలేదు. భూములిచ్చిన రైతులకు ఇచ్చే భూములను కూడా ప్రణాళికలో చూయించలేదు. సీడ్ క్యాపిటల్ నిర్మిస్తున్న ప్రాంతంలోని మూడు గ్రామాలను తొలగిస్తామని ముఖ్యమంత్రిగారే స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో ఆ గ్రామాల ప్రజలలో ఆందోళన పెరగటంతో మంత్రులు రంగంలోకి దిగి గ్రామాలను కదిలించబోమని చెపుతూ మరోసారి ప్రజలను మోసం చేయటానికి పూనుకున్నారు. ఈ విధంగా అబద్ధాలు చెబుతూ భూములను కంపెనీలకు అమ్మేస్తామని, కొన్ని కంపెనీలు వారికిష్టమైన విధంగా భూములను

" ఇక్కడి ప్రజానీకానికి తిండిగింజలు అందుబాటులో లేకపోయినా, కరువులతో లక్షల సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నా బ్రిటన్‌కు ఆహారధాన్యాలను ఎగుమతి చేశారు. ఈ విధానాల ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత ఉత్పత్తిదారులు బ్రిటన్ నుండి వస్తున్న చౌక దిగుమతులతో పోటి పడలేక నాశనమై పోయారు. చేనేత కార్మికులకు తిండిలేక లక్షల సంఖ్యలో చనిపోయారు. "

వినియోగించుకుంటాయని ఇప్పుడు ముఖ్యమంత్రి చెబుతున్నారు. ప్రజలను నిరంతరం మభ్యపెట్టటం, మోసం చేయటం చేస్తేనే నయా ఉదారవాద విధానాలను అమలు చేయటం సాధ్యవౌతుంది. నయా ఉదారవాద విధానాలను అమలుచేస్తే ఫలితాలు ఎలా ఉంటాయనే వాస్తవాన్ని ముందుగానే చెబితే ఈ విధానాలు అమలు జరిపే పాలకులను ప్రజలు తరిమికొడతారు. అందువలన నయా ఉదారవాద విధానాలను అమలు జరిపే పాలకులకు ప్రజలను మోసగించటం మినహా మరో మార్గం ఉండదు. ఈ విధంగా నయా ఉదారవాద విధానాల అమలుకు, పాలకులు మోసపూరితంగా వ్యవహరించటానికి అవినాభావ సంబంధం ఉంది.

### పారిశ్రామిక విప్లవకాలంలో బ్రిటీష్ పెట్టుబడిదారుల ప్రచారం

ప్రపంచంలో మొదటగా పారిశ్రామిక విప్లవాన్ని సాధించిన దేశం బ్రిటన్. పారిశ్రామికాభివృద్ధితో సరుకుల ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరగటంతో దేశంలో తయారు చేసిన సరుకులన్నింటిని స్వదేశీ మార్కెట్లో అమ్ముకోవటం బ్రిటిష్ పెట్టుబడిదారులకు సాధ్యం కాలేదు. పారిశ్రామికోత్పత్తి శీఘ్రంగా పెరగటం వలన ముడి సరుకుల కొరత కూడా ఏర్పడింది. అందువలన విదేశీ మార్కెట్ల కోసం, ముడి సరుకులను సరఫరా చేసే వనరుల కోసం బ్రిటిష్ పెట్టుబడిదారులు అన్వేషణ ప్రారంభించారు. భారతదేశ మార్కెట్‌ను, వనరులను స్వాధీనం చేసుకోవటం కోసం భారతదేశంలో స్వేచ్ఛావాణిజ్య భావనలను వ్యాపింపజేయటానికి పూనుకున్నారు. బ్రిటిష్ పెట్టుబడిదారుల ప్రతినిధులు, ప్రఖ్యాత ఆర్థికవేత్తలైన ఆడంస్మిత్, డేవిడ్ రికార్డోలు స్వేచ్ఛా వాణిజ్య విధానాలను సిద్ధాంతీకరించి, ప్రపంచవ్యాపితంగా ప్రచారం చేసి, బ్రిటిష్ పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడటానికి తోడ్పడ్డారు. రాజ్యం ఆర్థిక విషయాలలో జోక్యం చేసుకోరాదని, ఏ రంగంలోనూ ప్రభుత్వం గుత్తాధిపత్యాన్ని నెలకొల్పరాదని, అధిక సుంకాలు విధించి దిగుమతులను నిరోధించరాదని స్వేచ్ఛావాణిజ్య ప్రచారకులు చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో వర్తకం స్వేచ్ఛగా జరుగుతుందని, చౌక దిగుమతుల వలన వినియోగ వస్తువులు చౌకగా లభిస్తాయని, ముడి సరుకుల ధరలు కూడా తగ్గుతాయని, ఫలితంగా దేశీయ ఉత్పత్తుల ధరలు కూడా తగ్గుతాయని చెప్పారు. అందువలన ప్రజలకు తక్కువ ధరలకు వినియోగ వస్తువులు లభించటంతో పాటు దేశంలో ఉత్పత్తి అయిన సరుకులు దేశవిదేశాలలో ఎక్కువగా అమ్ముడుపోతాయని, ఆ విధంగా అన్ని దేశాలు లబ్ది పొందుతాయని వాదన చేశారు. కాని వాస్తవంగా బ్రిటన్ మాత్రమే లబ్ది పొందుతుంది. ఆ దేశం అప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అగ్రదేశంగా, ప్రపంచంలో మొదటి స్థానంలో ఉన్నది. భారతదేశంతో పాటు ఇతర దేశాలు కూడా ఇంగ్లాండ్ యొక్క సరుకుల దిగుమతులపై అంక్షలు ఎత్తివేసి, దిగుమతులకు తలుపులు బార్లా తెరవటం, బదులుగా తమ ముడి సరుకులను ఇంగ్లాండ్‌కు చౌకగా ఎగుమతి చేయవలసి ఉంటుంది. అందువలన ఈ స్వేచ్ఛా వాణిజ్యం ఇంగ్లాండ్‌కు అధిక ప్రయోజనం కలిగిస్తుంది.

ఈ స్వేచ్ఛావాణిజ్య విధానాలు భారతదేశంపై వినాశకరమైన ప్రభావాన్ని కలిగించాయి. 1859-60లో భారతదేశ ఎగుమతులు 29.28 కోట్ల రూపాయలు, దిగుమతులు24.27 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. 1909-10 నాటికి ఎగుమతులు 277కోట్ల రూపాయలకు, దిగుమతులు 212 కోట్ల రూపాయలకు పెరిగాయి. దిగుమతుల కన్నా ఎగుమతులు 20 శాతం కన్నా ఎక్కువగా ఉన్నాయి. 1849-50లో మొత్తం ఎగుమతుల్లో ఆహార ధాన్యాల ఎగుమతులు 4.16 శాతం ఉండగా 1889-90లో 16.26 శాతానికి పెరిగాయి. ఇదేకాలంలో ముడి జనపనార ఎగుమతులు 0.49 శాతం నుండి 8.35 శాతానికి పెరిగాయి. ముడి పత్తి ఎగుమతులు 12.04 శాతం నుండి 1869-70 నాటికి 36.36 శాతానికి పెరిగాయి. ఎగుమతుల ద్వారా మిగులు సాధించి కప్పం చెల్లించటమే కాకుండా, బ్రిటన్ నుండి దిగుమతి చేసు కుంటున్న వస్తువులకు చెల్లింపులు చేయటానికి కూడా అధిక ఎగుమతులు చేయాల్సివచ్చింది. భారతదేశం యొక్క అవసరాలు, స్థానిక రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి, బ్రిటిష్ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా పంటలు పండించారు. ఆహారధాన్యాలు పండించే విస్తారమైన భూముల్లో పత్తి, నీలిమందు లాంటి పంటలు పండించాల్సి వచ్చింది. బ్రిటిష్ పెట్టుబడిదారులు పంటలను మార్కెట్ ధరల ప్రకారం కొనుగోలు చేయటం కాకుండా, నిర్బంధంగా, అతి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు. ఎగుమతుల కోసం అవసరమైన పంటల విస్థీర్ణాన్ని పెంచటం వ్యవసాయ వాణిజ్యీకరణ ప్రక్రియలో ఒక ముఖ్యభాగమైంది. ఇక్కడ చేతివృత్తిదారులు, చేనేత వృత్తిదారులు తయారు చేసిన సరుకులు, చౌక బట్టలపై భరించలేని పన్నులు విధించారు. బ్రిటన్ నుండి దిగుమతి అవుతున్న సరుకులపై నామమాత్రపు పన్నులను వేశారు. ఇక్కడి ప్రజానీకానికి తిండిగింజలు అందుబాటులో లేకపోయినా, కరువులతో లక్షల సంఖ్యలో ప్రజలు మరణిస్తున్నా బ్రిటన్‌కు ఆహారధాన్యాలను ఎగుమతి చేశారు. ఈ విధానాల ఫలితంగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చేనేత ఉత్పత్తిదారులు బ్రిటన్ నుండి వస్తున్న చౌక దిగుమతులతో పోటి పడలేక నాశనమైపోయారు. చేనేత కార్మికులకు తిండిలేక లక్షల సంఖ్యలో చనిపోయారు. అభివృద్ధి చెందుతున్న చిన్న పరిశ్రమలు దివాళా తీశాయి. వ్యవసాయం గిట్టుబాటు కాలేదు. అనేక ప్రాంతాల్లో రైతులు రుణగ్రస్తులై భూములు కోల్పోయారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సంభవించిన కరువుల్లో లక్షలాది మంది చనిపోయారు. స్వేచ్ఛావాణిజ్య విధానాల ఫలితంగా 19వ శతాబ్దంలో భారత ప్రజలు ఈ విధమైన దుష్పరిణామాలను ఎదుర్కొన్నారు. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో బ్రిటన్ భారతదేశ ఆర్థికవ్యవస్థను ధ్వంసం చేసింది.

### నయా ఉదారవాద విధానాలు

వలస పాలన కాలంలో స్వేచ్ఛా వాణిజ్యం

గురించి బ్రిటన్ ఏ విధంగా ప్రచారం చేసిందో ప్రస్తుతం సామ్రాజవాదులు నయా ఉదారవాద విధానాలను గురించి అదే విధమైన ప్రచారం చేస్తున్నారు. నయా ఉదారవాద విధానాల గురించి చేస్తున్న ప్రచారానికి, ఆ విధానాలను అమలు చేయటం వలన వస్తున్న ఫలితాలకు పొంతన లేదు. దేశంలో గత 25 సంవత్సరాల నుండి అమలు జరుగుతున్న నయా ఉదారవాద విధానాల వలన ప్రైవేటీకరణ విధానాలు వేగం పుంజుకోవటం, రైతులు భూములు కోల్పోవటం, ఆదాయ అంతరాలు పెరగటం, అభివృద్ధి పేరుతో గిరిజనులను వారి నివాస ప్రాంతాల నుండి తరిమివేయటం, మూతపడుతున్న పరిశ్రమల సంఖ్య పెరగటం జరుగుతున్నది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటం పేరుతో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాసేలా చట్టసవరణలు చేస్తున్నారు. ఈ విధానాలు అభివృద్ధికి దోహదం చేయకపోగా విఘాతం కలిగిస్తాయి. పారిశ్రామికీకరణ, సెజ్‌ల పేరుతో ప్రభుత్వాలు భూములను బలవంతంగా లాక్కొంటున్నాయి. గతంలో భూములు తీసుకున్న సంస్థలలో నాలుగో వంతు కూడా పరిశ్రమలను ప్రారంభించలేదు. వస్తాయనుకున్న పరిశ్రమలు రాలేదు. ప్రభుత్వం సేకరించి పారిశ్రామికవేత్తలకు అప్పగించిన భూముల్లో వ్యవసాయోత్పత్తిని నష్టపోయాం. భూములు తీసుకున్న పారిశ్రామికవేత్తలు మాత్రం పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామని చెబుతూ ఆ భూములను బ్యాంకులలో పెట్టి రుణాలు తీసుకొని, పరిశ్రమలు ఏర్పాటు చేయకుండానే కోట్లాది రూపాయల లాభాలను స్వంతం చేసుకుంటున్నారు. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి కోసం 15 లక్షల ఎకరాల భూములను సేకరిస్తానని చెబుతున్నది. ప్రభుత్వం సేకరించిన తర్వాత ఆ భూముల్లో పంటలు పండించటం సాధ్యం కాదు. పరిశ్రమలు రావు. మన పరిస్థితి రెంటికి చెడ్డ రేవడి అవుతుంది. ఆ భూములపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోవటంతో నిరుద్యోగ సమస్య తీవ్రం అవుతుంది. వాణిజ్య సరళీకరణ విధానాలు, వ్యవసాయ, పారిశ్రామికోత్పత్తు దిగుమతులపై సుంకాలను తగ్గించటంతో దిగుమతులు పెరిగి, వాణిజ్యలోటు పెరుగుతున్నది. పోటీకి తట్టుకోలేక దేశీయ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయి. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన తర్వాత ఆహార


❝ ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాల కోసం ఉద్యోగులు, కార్మికులు జీవితాంతం కష్టించి కూడ బెట్టుకున్న పియఫ్ నిధులను ప్రభుత్వం షేర్ మార్కెట్‌కు మళ్ళిస్తు న్నది. స్వాతంత్ర్యానంతరం ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను దేశ విదేశీ పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. ❞



కాకినాడ జీఎంఆర్ సెజ్‌లో ఖాళీగా వున్న భూములు

పంటల నుండి వాణిజ్య పంటలకు మళ్ళటంతో ఆహారధాన్యాల తలసరి ఉత్పత్తి, లభ్యత తగ్గుతున్నది. పేటెంట్ చట్టాలను అమలు చేయాలని వత్తిడి చేయటం ద్వారా మందులు, ఇతర అత్యవసర సరుకుల ధరలు పెరుగుతున్నాయి. వివిధ రకాలైన ఆంక్షల ద్వారా సామ్రాజ్యవాదులు మన శాస్త్ర, సాంకేతికాభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్నారు. ద్రవ్య పెట్టుబడుల ప్రయోజనాల కోసం ఉద్యోగులు, కార్మికులు జీవితాంతం కష్టించి కూడబెట్టుకున్న పియఫ్ నిధులను ప్రభుత్వం షేర్ మార్కెట్‌కు మళ్ళిస్తున్నది. స్వాతంత్ర్యానంతరం ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ పరిశ్రమలను దేశ విదేశీ పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. వ్యవసాయోపకరణాల ధరలను పెంచటం, పంటలకు మద్దత్తు ధరలను పెంచకపోవటంతో రైతాంగం అప్పులపాలై భూములు కోల్పోతున్నారు. స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాల వలన రైతాంగం పండించిన పంటలకు తగిన ధరలు లభించటం లేదు. కౌలురైతులకు రుణాలివ్వకపోవటంతో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకొని వడ్డీలు చెల్లించలేక, వ్యవసాయం గిట్టుబాటుకాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

పై అంశాలను పరిశీలిస్తే వలస పాలనాకాలంలో బ్రిటన్ మనదేశంపై రుద్దిన విధానాలు దేశ ఆర్థికవ్యవస్థలో ఎటువంటి పరిణామాలకు కారణమయ్యాయో, అటువంటి పరిణామాలే నయా ఉదారవాద విధానాల వలన తిరిగి సంభవిస్తున్నాయి. ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని ఆక్రమించుకొని ప్రత్యక్ష పెత్తనం చేస్తూ దోపిడీ చేశారు. ఈనాడు సామ్రాజ్యవాదులు మనదేశ పాలకవర్గాలను భాగస్వాములుగా చేసుకొని తమ దోపిడీని కొనసాగిస్తున్నారు. ఈ దోపిడి కొనసాగినంత కాలం దేశం అభివృద్ధి చెందటం, పారిశ్రామికాభివృద్ధి జరగటం, నిరుద్యోగం తగ్గటం, వ్యవసాయాభివృద్ధి తదితరాలు కల్లలుగానే మిగిలిపోతాయి. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, వీటిని వెనక్కుకొట్టాలి. స్వతంత్ర ఆర్థికాభివృద్ధి కోసం పోరాడాలి. ఆ విధంగా మాత్రమే దేశం ఆర్థిక ప్రగతిని సాధించటం, కష్టజీవుల జీవితాల్లో అభివృద్ధి సాధ్యమౌతాయి. ❋



రచయిత ఆర్థిక విశ్లేషకులు

## విద్యుత్ బోర్డులను, వినియోగదారులను దివాళా తీయిస్తున్న

# విద్యుత్ సంస్కరణలు

**ప్రబీర్ పురకాయస్థ**

ఢిల్లీ వినియోగదారుల నుండి విద్యుత్ సరఫరా కంపెనీలు దాదాపు 8000 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక ఇచ్చిన కొద్ది రోజులకే అనిల్ అంబానికి చెందిన మూడు విద్యుత్ సరఫరా కంపెనీలకు లైసెన్సులు రద్దు చేస్తూ ఒరిస్సా విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాలు జారీచేసింది. ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులేవీ చేయకపోగా రెగ్యులేటరీ సంస్థ ఆదేశాలు కూడా ఉల్లంఘించినందున 2015 మార్చిలో ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో 2003లో అట్టహాసంగా ప్రారంభించిన విద్యుత్ సంస్కరణలు ఒక కొలిక్కి వచ్చాయి. విద్యుత్ పంపిణీకి సంబంధించిన రెండు రాష్ట్రాలు – ఢిల్లీ, ఒరిస్సాలో విఫలమయ్యాయి. ఈ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలు రద్దు చేసి, విద్యుత్ పంపిణీని ప్రభుత్వ రంగ సంస్థలకు అప్పగించటమే మిగిలి ఉన్న పని. ఒరిస్సా ప్రభుత్వం ఆ నిర్ణయం కూడా చేసింది.

**విద్యుత్ రంగ ప్రైవేటీకరణ :**

ప్రభుత్వ మౌలిక వసతుల రంగాన్ని ప్రైవేటీకరించాలన్న విస్తృత పథకంలో భాగంగా, 1990వ దశకంలో ప్రపంచ బ్యాంకు విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలంటూ సిఫార్సు చేస్తూ వచ్చింది. ఇంగ్లాండ్‌లో విద్యుత్, టెలికం, రైల్వే వంటి అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించటం ద్వారా, యావత్తు సంఘటిత కార్మిక రంగాన్ని నిర్మూలించిన మార్గరెట్ థాచర్ ధీరగాథల గురించి ప్రపంచబ్యాంకు పుంఖాను పుంఖాలుగా ప్రచారం చేసింది. ప్రపంచ బ్యాంకు చెప్పని విషయం ఒకటుంది. ప్రపంచంలో మార్గరెట్ థాచర్ ప్రారంభించిన విద్యుత్ సంస్కరణలే తొలిదఫా విద్యుత్ సంస్కరణలు కాదు. చిలీలో ప్రజాతంత్ర యుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కుట్రలతో కూలదోసి, ప్రజాప్రతిఘటనను రక్తపుటేరుల్లో ముంచిన నియంత పినోచెట్ మొదటిసారిగా విద్యుత్ రంగ సంస్కరణలు ప్రారంభించాడు.

విద్యుత్ రంగం కేవలం నిత్యావసర రంగమే కాదు. గుత్తాధిపత్యం కింద ఉన్న రంగం కూడా. గుత్తాధిపత్యం ఉన్న రంగాల్లో కంపెనీలు ధరల విషయంలో లోపాయికారీగా వ్యవహరించి, అడ్డగోలు లాభాలు సంపాదిస్తాయి. ఈవిధంగా వినియోగదారులను పీల్చి పిప్పి చేసి లాభాలు సంపాదించుకోవటానికి అవకాశం కల్పించేవిధంగా ప్రైవేటు రంగానికి గుత్తాధిపత్యం కట్టబెట్టడానికి ఎవ్వరూ ఒప్పుకోరు. ఈ పరిస్థితుల్లో ప్రజలను ఒప్పించటం ఎలా అన్నది ప్రపంచ బ్యాంకుకు, దాని తరఫున వకాల్తా పుచ్చుకున్న మేధావులకు పెద్ద సమస్యగా మారింది. లాభార్జన కోసం ప్రైవేటు కంపెనీలు వినియోగదారులను మోసం చేయవు అన్న నమ్మకం కల్పించటం వారి ప్రధాన కర్తవ్యంగా మారింది.

తమ నిర్ణయానికి ప్రభుత్వాల ఆమోదం పొందేందుకు గాను ప్రపంచ బ్యాంకు రెండంశాలను ముందుకు తెచ్చింది. అప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తి మొదలు పంపిణీ వరకు అన్ని పనులు ఒకే సంస్థ ఆధీనంలో జరిగేవి. ఈ పనులను ముక్కలు చేయటం, వేరు చేయటం సంస్కరణల్లో ఒక భాగం. మరోవైపున విద్యుత్ నియంత్రణ సంస్థల ద్వారా ప్రైవేటు కంపెనీలను నియంత్రించటం సాధ్యమన్న వాదనను ప్రపంచ బ్యాంకు ముందుకు తెచ్చింది.

ఈ విధంగా ప్రపంచ బ్యాంకు ముందుకు తెచ్చిన వాదనలు ప్రభుత్వాలకు శిరోధార్యాలయ్యాయి. ప్రభుత్వాలు కీలకమైన మౌలిక వసతుల రంగాలను సమర్థవంతంగా నిర్వహించలేవు అన్నది ప్రపంచ బ్యాంకు వాదనల సారాంశం. అందువల్లనే ఈ సేవల నిర్వహణలో ప్రైవేటు కంపెనీలను ఆహ్వానించటం, ఆ ప్రైవేటు కంపెనీలను నియంత్రించేందుకు నియంత్రణ సంస్థలను ఏర్పాటు చేస్తే మార్కెట్ దేవుళ్ళు వినియోగదారులు కోరుకున్న వరాలు ఇస్తాయని నమ్మింపజూశాయి. వాస్తవం ఏమిటో మనకు కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని ముక్కలు ముక్కలు చేసి, అస్మదీయులందరికీ అరటాకుల్లోపెట్టి మరీ బహుమతిగా ఇచ్చాయి.

1990 దశకంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు దేశంలో మొదటిసారిగా విద్యుత్‌రంగం ప్రైవేటీకరించబడింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్న పివి నరసింహారావు ప్రభుత్వ హయాంలో ఎన్నో తాయిలాలు ప్రకటించి, విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి ప్రైవేటు కంపెనీలను ఆహ్వానించారు. కారుచౌకగా బొగ్గు సరఫరా చేయటం మొదలు ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి

చేసిన విద్యుత్‌ను ఎక్కువ ఖరీదుకు కొనుగోలు చేయటం వరకు ఎన్నో వరాలు ఇందులో ఉన్నాయి. ఈ విధానాల ఘోరవైఫల్యానికి ఉదాహరణ ఎన్‌రాన్ కంపెనీ ధబోల్‌లో ప్రారంభించిన విద్యుత్‌ఉత్పత్తి కేంద్రం. ఎన్‌రాన్ కంపెనీతో కుదుర్చుకున్న విద్యుదుత్పత్తి ఒప్పందం కారణంగా కేవలం మహారాష్ట్ర విద్యుత్ బోర్డు ఒక్కటే కాదు. ఏకంగా మహారాష్ట్ర ప్రభుత్వమే దివాళా తీసింది. మహారాష్ట్ర ప్రభుత్వం అదృష్టం బాగుంది కాబట్టి అమెరికాలోనే ఎన్‌రాన్ కంపెనీ దివాళా తీసింది. వందలాది డబ్బా కంపెనీల ద్వారా వివాదాస్పద లావాదేవీలు నిర్వహించటం ద్వారా విద్యుత్ ధరలు పెంచుకుంటూ పోవటం ఎన్‌రాన్ వైఫల్యానికి కారణం.

**“ ఈ విధానాల ఘోరవైఫల్యానికి ఉదాహరణ ఎన్‌రాన్ కంపెనీ ధబోల్‌లో ప్రారంభించిన విద్యుత్‌ఉత్పత్తి కేంద్రం. ఎన్‌రాన్ కంపెనీతో కుదుర్చుకున్న విద్యుదుత్పత్తి ఒప్పందం కారణంగా కేవలం మహారాష్ట్ర విద్యుత్ బోర్డు ఒక్కటే కాదు. ఏకంగా మహారాష్ట్ర ప్రభుత్వమే దివాళా తీసింది. ”**



విశాఖపట్నం దగ్గరలోని ఎన్‌టిపిసి పవర్ ప్లాంట్

ఎన్‌రాన్ తరహాలో తెరమీదకు వచ్చిన తొలితరం ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులన్నీ దివాళా తీయటానికి ఎన్‌రాన్ నమూనాయే కారణం. అంతేకాదు. అమెరికాలో తొలిసారిగా విద్యుత్ వాణిజ్యానికి తెరతీసి కాలిఫోర్నియాను ప్రయోగశాలగా ఎంచుకోవటంతో ఎన్‌రాన్ పతనానంతరం కాలిఫోర్నియా పెద్దఎత్తు విద్యుత్ సంక్షోభాన్ని ఎదుర్కొన్నది.

మహారాష్ట్ర, కాలిఫోర్నియాల్లో ఎన్‌రాన్ ముందుకు తెచ్చిన జంట ప్రమాదాల నుండి మన ప్రభుత్వాలు ఏమీ నేర్చుకోలేదు. తొలినాళ్లలో ప్రపంచ బ్యాంకు బాకాలుగా మారిన మేధావులు, తర్వాత కాలంలో అటు నర్సింహారావు ప్రభుత్వంలోనూ ఇటు వాజ్‌పేయి ప్రభుత్వంలోనూ ప్రభుత్వ సలహాదారులుగా పదోన్నతులు పొందారు. అంతేకాదు. రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న విద్యుత్ బోర్డులను దుంపనాశనం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ విద్యుత్ బోర్డులు అసమర్థమైనవనీ, ఖజానాకు చిల్లులు పెడుతున్నాయన్న వాదనలతో ఈ విద్యుత్ బోర్డులను రద్దు చేసి, వాటి స్థానంలో కంపెనీలు ప్రారంభించబడ్డాయి. ఈ పని చేయటానికి ఏకంగా విద్యుత్ సంస్కరణల చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టం కింద రాష్ట్ర విద్యుత్ బోర్డులను విద్యుత్ ఉత్పిత్తి, సరఫరా, పంపిణీ కంపెనీలుగా ముక్కలు చేశారు. కాంగ్రెస్ సంపూర్ణ సహకారం అందించటంతో ఈ కర్తవ్య నిర్వహణలో బిజెపి పని తేలికైంది. 2003 విద్యుత్ చట్టాన్ని పార్లమెంట్‌లో కేవలం వామపక్షాలు మాత్రమే వ్యతిరేకించాయి.

1990 దశకంలో ప్రపంచ బ్యాంకు ప్రతిపాదించిన సంస్కరణల అమల్లో జాప్యం జరిగినందుకు గాను భారత విద్యుత్ రంగానికి అందాల్సిన ఆర్థిక సహాయాన్ని ప్రపంచబ్యాంకు. నిలిపివేసింది. మరోవైపున ప్రభుత్వాలు కూడా రాష్ట్ర విద్యుత్ బోర్డులు అసమర్థమైనవన్న వాదనను నిరూపించటం కోసం వాటికి నిధుల కేటాయింపును నిలిపి వేశాయి. దాంతో రాష్ట్రాల్లో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలు అధోముఖం పట్టాయి. అప్పటి వరకు ప్రతి పంచవర్ష ప్రణాళికా కాలంలో 40 శాతం వరకు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని జోడిస్తూ వచ్చిన ప్రభుత్వ సంస్థలు 8,9,10 పంచవర్ష ప్రణాళికల్లో ఈ లక్ష్యాన్ని 20 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వ నిధులు కోత పడటంతో ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు మార్కెట్ రుణాలపై ఆధారపడాల్సి వచ్చింది. దాంతో విద్యుత్ ఉత్పత్తి వ్యయంతో పాటు, రాష్ట్ర విద్యుత్ సంస్థల రుణభారం కూడా పెరిగిపోతూ వచ్చింది.

2003లో తెరమీదకు వచ్చిన విద్యుత్ చట్టం విద్యుత్ ఉత్పత్తి, రవాణా, పంపిణీల్లో ప్రైవేటు కంపెనీల ప్రవేశానికి రాచబాట వేసింది 2004 తర్వాత అధికారానికి వచ్చిన యుపిఎ ప్రభుత్వం కూడా పలురాయితీలు ఇచ్చింది. యుపిఎ1 ప్రభుత్వంలో బొగ్గుగనుల శాఖను కూడా అజమాయిషీ చేసిన మన్మోహన్‌సింగ్, ప్రభుత్వ బొగ్గు గనులను కారుచౌకగా ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టాడు. తర్వాతి కాలంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వెలుగులోకి తెచ్చిన విధంగా 2జి కుంభకోణంలో ప్రైవేటు కంపెనీలు ఏ విధంగా పరిమితమైన సహజవనరులను కారుచౌకగా స్వంతం చేసుకున్నాయో, బొగ్గు గనుల విషయంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు అదేవిధంగా వ్యవహరించాయి. బొగ్గగనుల తవ్వకానికి ఇచ్చిన అనుమతులను ప్రైవేటు కంపెనీలు అమ్ముకున్నాయి. లేదా బయటకు తీసిన బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించుకోవటానికి బదులుగా బహిరంగ మార్కెట్‌లో విక్రయించి లాభాలు దండుకున్నాయి.

ప్రైవేటు కంపెనీలకు చౌకగా అందుబాటులోకి వచ్చిన నిధులు

ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం కల్పించిన మరో సదవకాశం చౌకరుణాలు. అప్పటి ఆర్థిక మంత్రి పి. చిదంబరం పర్యవేక్షణలో ప్రాధాన్యతా రంగాలకు కేటాయించాల్సిన రుణాలను విద్యుత్ రంగంలో అడుగుపెట్టిన కంపెనీలకు ప్రభుత్వం మళ్లించింది. ఎన్‌రాన్ విషయంలో వెలుగు చూసిన విధంగా ప్రైవేటు కంపెనీల లావాదేవీలు మోసపూరితంగా ఉంటాయి. వివిధ ద్రవ్య సంస్థల నుండి రుణాలు సేకరించి ప్రైవేటు

**"ఈ విధంగా ప్రైవేటు పెట్టుబడుల రూపంలో నేడు మనకు కనిపిస్తుందంతా ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి పొందిన రుణాలను మోసపూరితంగా వినియోగించటం వల్ల వచ్చిందే తప్ప, ప్రైవేటు కంపెనీలు స్వంతంగా పెట్టిన పెట్టుబడులు కాదు. అందువల్లనే తమ కంపెనీలు నష్టాల పాలవుతున్నా ప్రైవేటు యాజమాన్యానికి పెద్దగా పట్టదు."**





ఆందోళన చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులు

కాంట్రాక్టర్లకు, లేదా కీలకమైన సప్లయర్లకు అవసరానికి మించి చెల్లింపులు చేస్తారు. అదనపు చెల్లింపులు దొడ్డిదారిన కంపెనీలో పెట్టుబడులుగా వెనక్కు తెచ్చుకుంటారు. అకౌంటింగ్ మాయాజాలాన్ని ఇందుకు బాగా ఉపయోగించుకుంటారు. ఈ విధంగా ప్రైవేటు పెట్టుబడుల రూపంలో నేడు మనకు కనిపిస్తుందంతా ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి పొందిన రుణాలను మోసపూరితంగా వినియోగించటం వల్ల వచ్చిందే తప్ప, ప్రైవేటు కంపెనీలు స్వంతంగా పెట్టిన పెట్టుబడులు కాదు. అందువల్లనే తమ కంపెనీలు నష్టాల పాలవుతున్నా ప్రైవేటు యాజమాన్యానికి పెద్దగా పట్టదు. ఈ కంపెనీలు సంక్షోభాల సుడిగుండంలో పడటానికి ముందే యాజమాన్యాలు తమ నిధులను జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చుకుని ఉంటాయి. ఈ కంపెనీలకు పెట్టుబడులుగా రుణాలు ఇచ్చిన ప్రభుత్వ రంగ బ్యాంకులే నష్టాలను భరించాలి.

ప్రస్తుతం ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు భారీగా రుణపడి ఉన్నాయి. 2012 అక్టోబరు 25న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక " క్రెడిట్ సూయిసీ నివేదిక ప్రకారం ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న 39 బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు 2,09,000 కోట్లు రూపాయల మేర బకాయి పడ్డాయి. ఈ బకాయిలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి." అన్న కథనాన్ని ప్రచురించింది. క్రెడిట్ సూయిసీ పరిభాషలో ప్రమాదకర స్థితిలో ఉన్నాయి అంటే తిరిగిరాని బకాయిల జాబితాలో చేరిపోయాయి అని అర్థం. 2015 నాటికి ఈ అంకెలు మరింతగా పెరిగివుంటాయి.

విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టి, దివాళా తీసిన కంపెనీలు ఏవి? ఈ మధ్య ప్రధానమంత్రితో విందు భోజనం ఆరగించి, భారతదేశాన్ని ప్రపంచ అగ్రరాజ్యంగా తయారు చేయటం ఎలా అని ఆలోచించిన, దేశంలో పేరుమోసిన కార్పొరేట్ కంపెనీల అధిపతులైన అంబానీలు, అదానీలు, టాటాలు, ఇంకా ఆ కోవకు చెందిన పెద్దమనుషుల కంపెనీలు. మన్మోహన్ హయాంలో బొగ్గు కుంభకోణంలో లాభాల మూటలు సంపాదించిన కంపెనీల అధిపతులే నేడు మోడీకి మద్దత్తుదారులుగా మారారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన కథనంలో " దివాళా అంచుకు చేరిన కంపెనీల్లో అదానీ ( 24,100 కోట్ల విలువైన నాలుగు ప్రాజెక్టులు) లాంకో (22,100 కోట్లు విలువైన ఐదు ప్రాజెక్టులు) అంబానీ రిలయన్స్ (32,600 కోట్ల విలువైన మూడు ప్రాజెక్టులు) టాటా పవర్ (14,400 కోట్లు విలువైన ఒక్క ప్రాజెక్టు) ఇండియా బుల్స్ ( 21,200 కోట్ల విలువైన నాలుగు ప్రాజెక్టులు)" ఉన్నాయని వెల్లడించింది. ఈ జాబితాకు సీసా స్టెరిలైట్, జిందాల్, జిఎంఆర్, హిందూజాల పేర్లు కూడా జోడించాలి. ఈ కంపెనీలన్నీ ఆ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వ బ్యాంకుల వద్ద వేల కోట్ల రూపాయలు అప్పులు తీసుకున్నాయి.


విద్యుత్ ఉత్పత్తిలో ప్రైవేటురంగాన్ని ఆహ్వానించటం కంటే పంపిణీ రంగాన్ని ప్రైవేటీకరించటం మరింత క్లిష్టమైన పని. విస్తృతమైన భూభాగంలో పంపిణీ చేయాలి. వినియోగదారులతో నిరంతర సంబంధం కలిగి ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సరఫరా చేయాలి. పంపిణీ రంగంలో ప్రయోగాత్మకంగా సంస్కరణలను చేపట్టడానికి ఒరిస్సా, ఢిల్లీ రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఎంచుకుంది. ఈ రెండు రాష్ట్రాల్లో వ్యవసాయ పంప్‌సెట్ కనెక్షన్లు నామమాత్రంగా ఉండటమే ఇందుకు కారణం. ఢిల్లీలో దాదాపు లేవనే చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా విషయంలో ఒరిస్సా బాగా వెనకబడింది.

1999 తుఫాను తర్వాత ఆ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ పునరుద్ధరించటానికి కాంట్రాక్టు పొందిన అమెరికా కంపెనీ ఎఇఎస్ తిరస్కరించటంతో ప్రైవేటు కంపెనీల బండారం బట్టబయలైంది. ఒరిస్సా విద్యుత్ బోర్డు నిర్వహించిన వేలంలో ఒక ప్రాంతానికి విద్యుత్ సరఫరా చేసే కాంట్రాక్టును ఆ కంపెనీ గెల్చుకుంది. మిగిలిన మూడు కాంట్రాక్టులు అనిల్ అంబానీకి చెందిన కంపెనీ గెల్చుకుంది. ఈ కంపెనీ వ్యవహార శైలితో విసిగి వేసారిన ఒరిస్సా ప్రభుత్వం చివరకు 2015లో ఆ కాంట్రాక్టులు రద్దు చేసింది. ప్రస్తుతానికి అనిల్ అంబానీ మొత్తంగా విద్యుత్ రంగం నుండి కాకపోయినా, పంపిణీ రంగం నుండి వైదొలగుతున్నాడన్న విషయం విదితమే.

ఈ పరిణామాలన్నీ ప్రైవేటీకరణ శకం ముగింపుకు వచ్చిందా అన్న ప్రశ్నను మనముందుకు తెస్తున్నాయి. కానీ మోడీ ప్రభుత్వం తన శైలిని కొనసాగిస్తే అటువంటి సందేహాలకు ఏ మాత్రం తావుండదు. మార్కెట్లో అమ్మకం-కొనుగోలు ( ఓపెన్ యాక్సెస్) విధానం ఒక్కటే మొత్తం విద్యుత్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించగలిగే మంత్రదండమని ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి సరికొత్త వాదన ముందుకు

(మిగతా 34వ పేజీలో)

# తీవ్రమౌతున్న ఆర్థిక అంతరాలు



కొండూరు వీరయ్య

అఖిల భారత వ్యవసాయ కార్మికసంఘం కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులు

భిన్న ధృవాల భారతం ఈ మధ్య కాలంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 1991లో నయా ఉదారవాద విధానాలు మొదలైన నాటి నుండీ ప్రజల మధ్య ఆర్థిక అంతరాలు పెరుగుతూ ఉన్న మాట నిజమే అయినా ఈ ఆర్థిక వ్యత్యాసాలు గత దశాబ్దకాలంలో మరింత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఈ దశాబ్దకాలమే భారత ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బంధనాల్లో మరింత బలంగా బిగించి ఉంచిన కాలంగా కూడా చెప్పుకోవచ్చు. అందువల్లనే అంతర్జాతీయంగా ద్రవ్య పెట్టుబడికి సంబంధించి ఎక్కడ ఏ ఉలికిపాటు తలెత్తినా దేశంలో పాలకుల దృష్టి స్టాక్‌మార్కెట్‌ను జోకొట్టడంలో నిమగ్నమవుతుంది. అందువల్లనే చైనా ప్రభుత్వం తన కరెన్సీ విలువ తగ్గించిందన్న వార్త వినగానే స్వయంగా ప్రధాని నేతృత్వంలో ఆర్థిక సలహాదారుల మండలి సమావేశమై పెట్టుబడిదారులందరికీ విశ్వాసం కలిగించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అదే కేంద్ర ప్రభుత్వం గత నెలలో విడుదలైన సామాజిక ఆర్థిక సర్వేలో 40 శాతం మందికి సెంటు భూమి లేదనీ, 75 శాతానికి పైగా దారిద్ర్య రేఖ మెట్లు ఎక్కే మేరకైనా దినసరి వేతనాలు పొందే స్థితిలో లేరని వెల్లడించినా స్పందించలేదు. ఒక వైపున దేశంలో ఆకలి కడుపులు పెరిగిపోతుంటే మరో వైపున శతకోటీశ్వరుల సంఖ్య మాత్రమే కాదు. వాళ్ల ఆదాయాలు కూడా పెరిగిపోతున్నాయి. ఒకటి రెండు అంకెలు ఇక్కడ ప్రస్తావించుకుందాము. ప్రపంచ సంపద డాటా బుక్ ప్రకారం భారతదేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న ఒక్క శాతం జనాభా ఆదాయాలు 2013లో 34 శాతంగా ఉంటే 2014లో 49 శాతానికి పెరిగాయి. ఈ కాలంలోనే అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం జనాభా చేతుల్లో 2013లో 66 శాతం సంపద పోగుపడితే, 2014లో వారి చేతుల్లో ఉన్న సంపద 74 శాతానికి పెరిగింది. అంటే మిగిలిన 90 శాతం జనాభా చేతుల్లో కేవలం 26 శాతం సంపద మాత్రమే మిగిలింది. ఇవన్నీ వామపక్ష మేధావులు వెల్లడించిన లెక్కలు కావు. ప్రపంచీకరణ మత్తులో జోగుతున్న పాలకులకు గురుకుల పాఠశాలగా చెప్పుకోదగ్గ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వెల్లడించిన వివరాలు.

మరో అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ఆక్స్‌ఫాం నిర్వహించిన అధ్యయనం ప్రకారం 2013లో సవంత్సరానికి వంద కోట్లకు మించి ఆదాయాలు సంపాదించే వారు భారతదేశంలో 1,53,000 మంది ఉన్నారు. 2014 నాటికి ఈ సంఖ్య నిస్సందేహంగా పెరిగిందని ఆ సంస్థ నిర్ధారించింది. జాతీయ ఆర్థిక వ్యవస్థ 7–8 శాతం చొప్పున అభివృద్ధి అయితే సంపన్నుల ఆదాయాలు మాత్రం 20 శాతం చొప్పున పెరిగాయి. మరో వైపున ప్రపంచ ఆహార సంస్థ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 160 కోట్ల మంది కటిక దరిద్రులు ఉంటే వారిలో 44 కోట్ల మంది భారతదేశంలోనే ఉన్నారు. అంటే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పేదల్లో నాలుగో వంతుకుపైగా భారతదేశంలోనే ఉన్నారు. ప్రపంచంలో సంపన్నుల గురించి వివరాలు సేకరించే ఫోర్బ్స్ అనే మరో సంస్థ అంచనా ప్రకారం ప్రపంచంలోని శతకోటీశ్వరుల ఆదాయాల మీద కేవలం 1.5 శాతం పన్ను విధిస్తే 75 బిలియన్ డాలర్లు వసూలు అవుతాయి. దీంతో ప్రపంచంలోని నిరక్షరాస్యులందరినీ మూడేళ్లల్లో అక్షరాస్యులుగా మార్చేయవచ్చు. చిన్న చిన్న వ్యాధులతో ఆసుపత్రికి చేరేలోపు ప్రాణాలు కోల్పోతున్న ప్రపంచ పేదలందరికీ రెండేళ్లల్లో శాశ్వత వైద్య ఆరోగ్య సేవలు అందించవచ్చు. అంతేకాదు. ఈ మొత్తంతో ఏటా 25 కోట్ల కుటుంబాలను దారిద్ర్యపు సంకెళ్ల నుండి విముక్తులను చేయవచ్చు. ఈ స్థాయిలో ఆర్థిక అసమానతలు వికటాట్టహాసం చేయటానికి మూల కారణం జాతీయ ఆర్థిక వ్యవస్థలపై ద్రవ్య పెట్టుబడి పట్టు బిగించటమే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రపంచీకరణలో ప్రభుత్వాల కంటే మార్కెట్లదే పెత్తనం. శ్రమశక్తిపై పెట్టుబడిది పెత్తనం. మానవ సామర్థ్యంపై సాంకేతిక పరిజ్ఞానానిది పెత్తనం. వ్యవసాయాన్ని ప్రత్యేక వాణిజ్య మండళ్లు మింగేస్తున్నాయి. వస్తూత్పత్తి రంగం కంటే గాలివాటు పెట్టుబడి లావాదేవీలకే ఆర్థిక వ్యవస్థలో గిరాకీ ఉంది. సాధారణ కార్మికుల శ్రమను మండుటెండల్లో దోచుకుంటుంటే సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే వారిని ఎసి ఫ్యాక్టరీలలో దోచుకుంటున్నారు. ఉత్పత్తి అయిన సంపదలో కార్మికుల వాటా 1993లో 36.5 శాతం ఉంటే 2012 నాటికి 21.8 శాతానికి పడిపోయిందని ఆసియా అభివృద్ధి బ్యాంకు నివేదిక వెల్లడించింది.

ఒక్కో దేశంలో ప్రపంచీకరణ విధానాలు ఆర్థిక వ్యత్యాసాలు పెంచేందుకు ఒక్కో పద్ధతిని అనుసరిస్తాయి. ఆయా దేశాల్లో ఉన్న రాజకీయ ఆర్థిక వ్యవస్థ అవసరాలకు అనుగుణంగా సంపద సంపన్నుల జేబుల్లో కుక్కేందుకు మార్గాలు

> **"ఈ కాలంలోనే దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య పెరుగుదలలో ప్రపంచంలోనే నాల్గో స్థానం ఆక్రమించింది. కానీ సంపన్నులకు మాత్రం మొత్తం బడ్జెట్‌లో సంవత్సరానికి ఐదుశాతానికి తగ్గకుండా పన్ను రాయితీలు ముట్టాయి. ఈ వాస్తవాలను పక్కన పెట్టి ప్రభుత్వం పేదలకు ఇచ్చే సబ్సిడీ వల్లనే ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతోంది, ఆ సబ్సిడీలు రద్దు చేయాలి అన్న వాదన ప్రచారం చేస్తోంది."**

తయారవుతాయి. భారతదేశంలో కూడా పాలక వర్గాలు తనవైన ఇటువంటి మార్గాలను కనిపెట్టాయి. పన్ను రాయితీలు ( రెవిన్యూ ఫోర్‌గాన్) అన్నది అటువంటి చట్టబద్ధమైన బహిరంగ దోపిడీ మార్గాల్లో ముఖ్యమైనది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు ఈ బహిరంగ దోపిడీ మార్గానికి మధ్య ఉన్న సంబంధాన్ని పరిశీలించే ముందు దేశంలో ధనికులు, పేదల మధ్య ఉన్న అంతరాల తీవ్రతను పరిశీలిద్దాం.

దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయిన 1991 నాటికి అంతర్జాతీయ శతకోటీశ్వరుల కోవకు చెంది వారు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారి ఉమ్మడి ఆస్తి 320 కోట్ల డాలర్లు. అంటే నాటి రూపాయి విలువతో పోల్చి చూసినపుడు వాళ్ల ఆస్తుల విలువ 6284.8 కోట్లు. రెండు దశాబ్దాల ఆర్థిక సంస్కరణల తర్వాత ఇటువంటి శతకోటీశ్వరుల సంఖ్య 46 కి పెరిగింది. ఈ 46 మంది ఉమ్మడి ఆస్తులు 176 బిలియన్ డాలర్లు. 17600 కోట్ల డాలర్లు. నేటి రూపాయి విలువలో చూస్తే 11, 44,000 కోట్ల రూపాయలు. 2014 నాటికి వీరి సంఖ్య 100కి పెరిగింది. వీళ్ల ఆస్తులు 34,600 కోట్ల డాలర్లు. రూపాయి విలువలో 22,49,000 కోట్ల రూపాయలు.

తాజాగా విడుదలైన సామాజిక ఆర్థిక సర్వే పాక్షికంగానే వాస్తవాలు సేకరించినా సంస్కరణల క్రమంలో దేశ ఆర్థిక ప్రగతి, ప్రజల తలసరి ఆదాయాలు ఇతోధికంగా పెరిగిపోయాయన్న వాదనలు మాత్రం తప్పుడు వాదనలు అని నిరూపించింది. ఈ సర్వే వెల్లడించిన కొన్ని ప్రాధమిక వివరాలు పెరుగుతున్న ఆర్థిక అంతరాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఈ సర్వే ప్రకారం నెలకు రు.5000 కూడా సంపాదించలేని కుటుంబాలు దేశంలో 74 శాతం ఉన్నాయి. తలసరి ఆదాయం వృద్ధి రేటు 2013-14లో 25.75 శాతం ఉండగా 2014-15 సంవత్సరానికి 21 శాతానికి పడిపోయింది.

పాలకవర్గాలకు 2007లో పెట్టుబడిదారీ వ్యవస్థలో మొదలైన సంక్షోభం అవకాశాలు కల్పించింది. పెట్టుబడిదారీ వర్గపు ధనదాహం నుండి పుట్టుకొచ్చిన పథకం పన్ను రాయితీలు. ప్రజల సొమ్మును నేరుగా పెట్టుబడిదారుల జేబుల్లో కుక్కే పథకం ఇది. జాతీయ సంపదను దోపిడీదారుల పాలుచేసే ఇటువంటి పథకాల అమలును మరింత వేగవంతం చేయటానికి మద్దతు ఇచ్చే పార్టీలను అధికారానికి తెచ్చుకోవటం పాలక వర్గాలకు వెన్నతో పెట్టిన విద్య. ప్రభుత్వాలు గత ఎనిమిదేళ్ల నుండీ పాలకవర్గాలకు పన్ను రాయితీల రూపంలో లక్షల కోట్ల రూపాయలు కట్టబెట్టాయి. ఒకవైపున ఆర్థిక సంక్షోభం నుండి దేశం బయట పడిందని పాలకవర్గాలు చెపుతున్నాయి. మరోవైపు అదే సంక్షోభాన్ని సాకుగా చూపిస్తూ ఏటా లక్షల కోట్ల రూపాయలు దేశవిదేశాలలోని కొద్దిమంది పెట్టుబడిదారులకు పన్ను రాయితీలుగా ఇస్తున్నారు.

ప్రపంచ ఆర్థిక సంక్షోభం మొదలైన 2007-2008 సంవత్సరం మొదలు 2014-15 సంవత్సరం వరకు ప్రభుత్వం భారతదేశపు కంపెనీలకు రు. 39,47,731 కోట్ల రూపాయల పన్ను రాయితీలు ఇచ్చింది. ఈ కాలంలో 100 మంది శతకోటీశ్వరుల సంపద 22 లక్షల కోట్ల మేర పెరిగాయి. ఈ ఎనిమిదేళ్ల కాలంలో 110 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనాలు కల్పించేందుకు వేర్వేరు సబ్సిడీల రూపంలో పెట్టిన ఖర్చు కేవలం 14,43,943 కోట్లు మాత్రమే. కేవలం మూడు నాలుగు లక్షల కంపెనీలకు ఇచ్చిన పన్ను రాయితీలతో పోల్చుకున్నపుడు ప్రభుత్వం 110 కోట్లకుపైగా ఉన్న జనాభా ప్రయోజనాల నిమిత్తం సగం కూడా ఖర్చు పెట్టలేదు. ఈ విధంగా మొత్తం సంపదను పెట్టుబడిదారులకు కట్టబెట్టటం ద్వారా ప్రభుత్వాలు దేశంలో ప్రమాదకరమైన స్థాయికి ఆర్థిక అంతరాలను తీసుకెళ్తున్నాయి. ఏటా కంపెనీలకు దోచిపెడుతున్న పన్ను రాయితీలు బడ్జెట్‌లో 5.5 శాతంగా ఉండగా, పేదలకు ఇచ్చే సబ్సిడీలు మాత్రం 1.6 శాతానికి మించటం లేదు. ఈ విషయాలు ప్రజల దృష్టికి, ప్రత్యేకించి ప్రపంచీకరణకు బలమైన మద్దతుదారులుగా ఉన్న మధ్యతరగతి దృష్టికి రాకుండా గుత్తాధిపత్యం కలిగిన ప్రసార మాధ్యమాలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. అందువల్ల ఈ తలసరి లెక్కల మతలబు కూడా పరిశీలిద్దాం. ప్రభుత్వం సమర్పించిన నివేదికల ఆధారంగానే దేశంలో పేదలు 40,38,05,000 మంది ఉన్నారు. ఇది స్వయంగా ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుల మండలి అధ్యక్షులు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నరు రంగరాజన్ నివేదికలో ఇచ్చిన అంచనా. సామాజిక ఆర్థిక సర్వే వెల్లడించిన వివరాలతో పోల్చినపుడు రంగరాజన్ కమిటీ నివేదిక దేశంలోని పేదల్లో సగం మందిని మాత్రమే లెక్కించిందని చెప్పకతప్పదు. అయినప్పటికీ ఉదారవాద మేధావులకు సమాధానం చెప్పటానికి రంగరాజన్ అంచనానే ప్రమాణంగా తీసుకుని పరిశీలిద్దాం.

2007-08 సంవత్సరంలో 4,10,451 కంపెనీలకు రు. 2,85,052 కోట్ల పన్ను రాయితీలు ఇచ్చింది. అంటే ఒక్కో కంపెనీకి 69,44,800 రూపాయల చొప్పున రాయితీలు ఇచ్చింది. అదే సంవత్సరంలో 40 కోట్ల మంది పేదలకు రు.66, 638 కోట్ల రూపాయల సబ్సిడీలు ఇచ్చింది. అంటే తలసరి ఒక్కో పేదవానికి రు. 1650.27 రూపాయల చొప్పున రాయితీ ఇచ్చింది. 2014-15 సంవత్సరానికి ఈ వ్యత్యాసం మరింత పెరిగింది. పేదలకు తలసరి రు.6225.78 చొప్పున సబ్సిడీలు అందితే కంపెనీలకు మాత్రం రు. 1,04,33,800 చొప్పున రాయితీలు ఇచ్చింది. ఈ కాలంలోనే దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య పెరుగుదలలో ప్రపంచంలోనే నాల్గో స్థానం ఆక్రమించింది. కానీ సంపన్నులకు మాత్రం మొత్తం బడ్జెట్‌లో సంవత్సరానికి ఐదుశాతానికి తగ్గకుండా పన్ను రాయితీలు ముట్టాయి. ఈ వాస్తవాలను పక్కన పెట్టి ప్రభుత్వం పేదలకు ఇచ్చే సబ్సిడీ వల్లనే ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతోంది, ఆ సబ్సిడీలు రద్దు చేయాలి అన్న వాదన ప్రచారం చేస్తోంది. ఈ వాదనే ప్రజామోదం పొందటం అంటే పేదలకు ఇస్తున్న సబ్సిడీలు కూడా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయటం తప్ప మరోటి కాదు. ఈ మాత్రం నిధులు కూడా పేదలకు చేరటాన్ని

నయా ఉదారవాదం సహించలేకపోతోంది. అందుకే సబ్సిడీలపై విష ప్రచారం మొదలు పెట్టింది. బిజెపి మతోన్మాదంలో మాత్రమే ఛాందసవాదాన్ని పాటించటం లేదు. ఆర్థిక సంస్కరణల విషయంలో సైతం అంతకు మించిన ఛాందసవాదాన్ని అనుసరిస్తోంది. అందుకే అధికారానికి వచ్చిన ఒక్క సంవత్సరంలోనే పేదలకు సంబంధించిన వివిధ శాఖలకు 1.75 లక్షల కోట్ల మేర కోత పెట్టి, ఆ మొత్తాన్ని ధనికులకు, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టింది.

ఈ విశ్లేషణ పరిశీలించినపుడు ఒక విషయం స్పష్టం అవుతుంది. ఈ దశాబ్దకాలంలో దేశంలో పడగలెత్తిన శతకోటీశ్వరులు స్వతహాగా కష్టించి సంపాదించో, లేక తాము చేసే వ్యాపారాల్లో లెక్క లేనంత లాభాలు వచ్చో కోటీశ్వరుల సోపానంలో కొత్త ఎత్తులకు ఎదగలేదు. కేవలం ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలను అనరించే క్రమంలో లెక్కలేనన్ని ఆర్థిక రాయితీలు ఇచ్చినందువల్లనే ఆయా రాయితీలు పొందిన కంపెనీల యజమానులు శత కోటీశ్వరులు అయ్యారు. ఈ కాలంలో పారిశ్రామికోత్పత్తి పెరుగుదల రేటు క్షీణించటం కూడా ఈ విషయాన్ని మరో కోణంలో రుజువు చేస్తుంది. వందకోట్లకుపైగా ఉన్న జనాభా నిత్యావసరాలు పెరుగుతున్నా వాటిని తీర్చుకునే ఆర్థిక సామర్థ్యం కుంచించుకుపోవటంతో పారిశ్రామికోత్పత్తులన్నీ గోదాముల్లో మూలుగుతున్నాయి. పారిశ్రామికోత్పత్తులే కాదు. ఆకలి తీర్చుకునేందుకు అవసరమైన ఆహార ధాన్యాలు కూడా కొనుగోలు చేయలేని స్థితికి పేదలు చేరుకుంటున్నారు. అందుకే ఒకవైపున ప్రపంచంలోని ఆకలిగొన్న పేదలు భారతదేశంలోనే యాభై శాతానికి పైగా ఉంటే మరోవైపున భారత ఆహార సంస్థ గోదాముల్లో మాత్రం లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఎలుకలకు విందు భోజనంగా మారుతున్నాయి. 19వ శతాబ్దంలో పెట్టుబడిదారీ వ్యవస్థ విష ప్రభావాన్ని అర్థమయ్యేలా చెప్పటానికి మార్క్స్ ఒకవైపు గుట్టలు పడ్డ బొగ్గు, మరో వైపు ఆ బొగ్గు కొనుక్కొని చలి నుండి తమను తాము కాపాడుకోలేక చలికి వణికిపోతున్న శ్రామిక కుటుంబం గురించి చెప్పిన ఉదాహరణ 21వ శతాబ్దం నాటి ప్రపంచీకరణ, ద్రవ్య పెట్టుబడి కర్కశత్వాన్ని రుజువు చేయటానికి కూడా ఉపయోగపడుతుంది.

> ❝ ఒకవైపున ప్రపంచంలోని ఆకలిగొన్న పేదలు భారతదేశంలోనే యాభై శాతానికి పైగా ఉంటే మరోవైపున భారత ఆహార సంస్థ గోదాముల్లో మాత్రం లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఎలుకలకు విందు భోజనంగా మారుతున్నాయి. ❞



నయా ఉదారవాద శత కోటీశ్వరులు ముఖేష్ అంబాని, గౌతం ఆదాని

ఉత్పత్తి, అమ్మకాలతో నిమిత్తం లేకుండా తమ లాభాలు, సంపద పోగుపడే ప్రక్రియను యాథాతథంగా కొనసాగించాలని కోరుకునే పాలక వర్గాలకు తమ అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వాలు గద్దెమీద కూచోవటానికి మించిన సానుకూల వాతావరణం ఏమీ ఉండదు. అందుకే అటువంటి ప్రభుత్వాలను గద్దె నెక్కించటానికి అవసరమైతే ప్రజలపై భావోద్వేగ యుద్ధం ప్రారంభించటానికి, లేదా ఆఫ్రికా తరహాలో రక్తపాతం సృష్టించటానికి కూడా ద్రవ్య పెట్టుబడి నీడన వనువుతున్న పాలకవర్గాలు వెనకాడవు. 2014 పార్లమెంట్ ఎన్నికల ముందు జరిగిన బిజెపి ప్రచార యుద్ధం ఈ కోవలోకే వస్తోంది. తాను కూలీ నంబర్ ఒన్ అని చెప్పుకున్న నరేంద్రమోడి ద్రవ్య పెట్టుబడికి ఊడిగం చేసే కూలి నంబర్ ఒన్ అని నిరూపించటానికి పెద్దగా సమయం పట్టలేదు. అందుకే రాజ్యాంగం ఆర్థిక వ్యత్యాసాలు నియంత్రించేందుకు ప్రభుత్వం క్రియాశీలక పాత్ర పోషించాలని ఆదేశించినప్పటికీ ఆ ఆదేశాలను పక్కన పెట్టి ఈ ఆర్థిక అంతరాలను మరింత పెంచి పోషించే విధానాలకు, చర్యలకే ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయి. గత ఆరున్నర దశాబ్దాల అనుభవంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాల తీవ్రతను గాఢతను నియంత్రించటంలో సామాజిక సంక్షేమ పథకాలు కీలక పాత్ర పోషించాయన్న వాస్తవం రుజువు అయ్యింది. అందుకే స్వాతంత్ర్యానంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో సామాజిక రంగం విశేషంగా విస్తరించింది. కానీ సంస్కరణలు ప్రారంభం అయ్యాక ఈ సామాజిక రంగం విస్తరణకు బ్రేకులు పడ్డాయి. 2004-09 మధ్య కాలంలో వామపక్షాల ఒత్తిళ్ల మేరకు ఉపాధి హామీ చట్టం, ఆహారభద్రత చట్టం, అటవీహక్కుల పరిరక్షణ చట్టం వంటి చట్టాలు వచ్చాయి. కానీ 2009 తర్వాత వామపక్షాల పార్లమెంటరీ ప్రాబల్యం క్షీణించటంతో ఆయా చట్టాల అమలులో ఉదారవాదపు మార్గదర్శకత్వంలో ప్రభుత్వాలు

(మిగతా 33వ పేజీలో)

# ఉగ్రవాదానికి మతంతో సంబంధం లేదు

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : కా॥ బి.వి. రాఘవులు గారికి నమస్కరించి వ్రాయునది. మార్క్సిస్టులో వస్తున్న ప్రశ్నలు మీ జవాబులు చదువుచున్నాను. పాఠకులకు సైద్ధాంతిక రాజకీయ విజ్ఞానాన్ని అందిస్తున్నందుకు ధన్యవాదాలు. నేటి కేంద్ర ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్. ఎజెండాను అమలు చేస్తున్నది. హేతువాద లౌకిక మేధావులు డా॥ నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, హంపి మాజీ ఉపకులపతి కల్బుర్గిని హిందూ మతతత్వ శక్తులు హత్య చేశాయి. మరి కొంతమందిని చంపుతామని బెదిరిస్తున్నారు. మన రాష్ట్రంలో కంచె ఐలయ్య, బాబు గోగినేని పేర్లు ఫేస్‌బుక్‌లో పెట్టారని తెలిసింది. రామాయణం, మహాభారతం, భగవద్గీతలను పాఠ్యాంశాలలో చేర్చడానికి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ప్రణాళిక రూపొందిస్తున్నది. దీనిపై మీ అభిప్రాయం వివరిస్తూ వీటిని ఏ విధంగా ఎదుర్కోగలమో తెలియజేయవలసిందిగా కోరుచున్నాను?**

**– తుంపాల శ్రీరామమూర్తి**, విశాఖపట్నం

బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన దగ్గరి నుండి ఒక ప్రణాళిక ప్రకారం మతోన్మాదాన్ని, అశాస్త్రీయ భావాలను, సామాజిక అసమానతలను పెంచేందుకు కృషి చేస్తున్నది. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఒక పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నది. ఆందోళనలను రెచ్చగొడుతున్నది. ఆర్ఎస్ఎస్ ముఖ్య ప్రతినిధులు చేస్తున్న ప్రకటనలు, గుజరాత్‌లో పటేళ్ళ ఉద్యమ నాయకులు ఇస్తున్న నినాదాలు దీన్ని స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు ప్రజలను మభ్యపెట్టేందుకు ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రకటనలతో తమకు ఏ సంబంధం లేదని బిజెపి ప్రభుత్వాగ్రనేతలు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. వీరు రెండు రకాలుగా మాట్లాడడం కూడా పథకంలో భాగమేనని ఎవరికైనా అర్థమవుతుంది. మతోన్మాదానికి కంటకప్రాయంగా ఉన్న అభ్యుదయవాదులను, హేతువాదులను తుదముట్టించే పనికూడా హిందూత్వ శక్తులు ఈ కాలంలో ఆరంభించారు. ఇందులో భాగంగానే నరేంద్రధబోల్కర్, గోవిందపన్సారే, కల్‌బుర్గిల హత్యలు. ఉగ్రవాదానికి ఒక మతం అంటూ ఏమీలేదు. ఛాందసత్వం ముదిరితే ఏ మతం పేరుతోనైనా ఉగ్రవాదం పుట్టవచ్చునేది ఈ హత్యలు రుజువు చేస్తున్నాయి. హిందూమతం పేరుతో ఉన్న ఛాందసవాదులు ఈ హత్యలకు పాల్పడ్డారని విచారణ చేస్తున్న పోలీసు అధికారులు వెల్లడించడం దీన్ని స్పష్టం చేస్తున్నది.

బిజెపి ప్రభుత్వం, మంత్రులు అశాస్త్రీయ భావాలను, మూఢనమ్మకాలను పెద్ద ఎత్తున వ్యాపింపజేస్తున్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి యోగాతో అధిక పంటలు సాధించాలని రైతులకు హితబోధ చేయడం దీనికి ఉదాహరణ.

మతవైషమ్యాలు కూడా ఒక పథకం ప్రకారం రెచ్చగొట్టడం వేగం పుంజుకున్నది. తాజాగా దాద్రాలో పశుమాంసం ఇంట్లో పెట్టుకున్నారనే నెపంతో మైనారిటీ మతస్థులైన తండ్రీ–కొడుకులపై మతోన్మాద మూక దాడి చేసి హత్య చేయడం పరిస్థితి ఎంత తీవ్రస్థాయికి చేరిందో వెల్లడిస్తున్నది. మతోన్మాద శక్తులు, బిజెపి ప్రభుత్వ ప్రతినిధులు నిరంతరం మతం పేరుతో రెచ్చగొట్టిన పర్యావసానమే ఇది.

విద్యా వ్యవస్థను కూడా మతోన్మాద ప్రచార సాధనంగా మార్చడానికి తీవ్రమైన ప్రయత్నం జరుగుతున్నది. పరిశోధనా సంస్థలన్నింటినీ ఛాందసవాదులతో ప్రభుత్వం నింపింది. సాంస్కృతిక రంగ సంస్థలన్నింటికీ సనాతన వాదులను అధిపతులుగా చేస్తున్నది. పాఠ్యాంశాలను కాషాయీకరణ చేస్తున్నది. రామాయణం, మహాభారతం, భగవద్గీతలను ఇంకా ఇతర ఏ మత గ్రంథాలనైనా చారిత్రిక తులనాత్మక పరిశీలన కోసం పాఠ్యాంశాల్లో చేర్చడానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. కానీ వాటిల్లో చెప్పిన విషయాలు రుజువులకు నిలబడకపోయినప్పటికీ సత్యాలుగా అనుల్లంఘనీయమైన శాశ్వతమైన సత్యాలుగా నూరిపోయడానికి బిజెపి ప్రభుత్వం పాఠ్యాంశాల్లో చేరుస్తున్నది. ఇది దేశ భవిష్యత్‌కు, శాస్త్రీయాభివృద్ధికి విఘాతం కలిగిస్తుంది.

బిజెపి అధికారానికి వచ్చిన తర్వాత పెరుగుతున్న ఈ ఫాసిస్టు పోకడలను అడ్డుకోకపోతే దేశానికి చాలా నష్టం జరుగుతుంది. అందుకే మార్క్సిస్టు పార్టీ మతోన్మాదులను ఎదుర్కొనే అభ్యుదయ, లౌకిక శక్తులను ఒక విశాల వేదిక ఆధ్వర్యంలో సమీకరించడానికై నిర్ణయించింది. అందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వామపక్షాలే కాకుండా, అన్ని పార్టీల్లోను, రాజకీయ పార్టీల బయట కూడా మతోన్మాదాన్ని వ్యతిరేకించేవారు, లౌకికవాదాన్ని రక్షించుకోవాలనుకునేవారు ఎంతో మంది ఉన్నారు. ఎన్నో సంస్థలు ఉన్నాయి. వాటన్నింటినీ దేశ స్థాయి నుండి, క్షేత్రస్థాయి వరకు ఐక్య ప్రతిఘటన కోసం సమీకరించాల్సి ఉంది. అందుకు జరుగుతున్న ప్రయత్నాలకు అందరం అండగా నిలవాలి.

**ప్రశ్న : కొంతమంది ధనవంతులు గ్రామాలను దత్తతకి తీసుకొంటున్నారు. వారు తాము ఎంచుకొని, దత్తత తీసుకొని, ఆ గ్రామాలను అభివృద్ధి చేస్తామంటున్నారు. క్రికెట్ ధనవంతుడు సచిన్ టెండూల్కర్ నెల్లూరుజిల్లాలో ఓ గ్రామం, సినిమా నటనా ధనవంతులు మహేష్‌బాబు రెండు గ్రామాలు, శృతిహాసన్ ఒక గ్రామం, ప్రకాష్‌రాజ్ ఒక గ్రామం, మంచు విష్ణు పది గ్రామాలను దత్తత తీసుకొన్నారు. పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటాగారు 264 గ్రామాలను దత్తత తీసుకొన్నారు.**

**ఈ భారతదేశ ధనవంతులకు రెండు తెలుగు రాష్ట్రాలలోని గ్రామాలను ప్రభుత్వాలు దత్తతకు ఇవ్వడంలో ఆంతర్యం, వ్యక్తుల ఆధీనంలోకి గ్రామాలను జారవిడవడంగా నాకు కనిపిస్తున్నది. ఇప్పుడున్న ప్రజలతో ఎన్నుకోబడిన పంచాయతీ పరిపాలనను బలహీనపరచటం, ప్రపంచీకరణ విధానానికి అనుకూలంగా ప్రభుత్వాలు పోతున్నట్లుగా నాకు అనిపిస్తున్నది. ఈ నా సందేహాలను నివృత్తి చేయమని కోరుతున్నాను**

**– ఇలిపిళ్ళ సూర్యనారాయణ**, విజయవాడ-9

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితి, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాలకు నూతన రాష్ట్రాలను శరవేగంగా అభివృద్ధి దశలో ముందుకు తీసుకుపోతున్నామన్న భ్రమలను ప్రజల్లో కల్పించాల్సిన అగత్యం ఏర్పడింది. ప్రత్యేకరాష్ట్రం ఏర్పడితే బంగారు తెలంగాణాను నిర్మించి చూపిస్తామని టిఆర్ఎస్ చెప్పిన మాటలను ప్రజలు నమ్మాలన్నా, కొత్త

ఆంధ్రప్రదేశ్‌ను ఇబ్బందుల నుండి గట్టెక్కించి అగ్రగామి రాష్ట్రంగా చేయగల సత్తా తనకే ఉందని చెప్పుకున్న చంద్రబాబు మాటలను ప్రజలు నిజమనుకోవాలన్నా, ఇద్దరు నాయకులకు కొన్ని ఎత్తులు వేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఇద్దరు ముఖ్యమంత్రులు, వారి వారసులు ప్రపంచదేశాలు చుట్టివచ్చారు. చైనా, జపాన్, సింగపూర్, అమెరికా వంటి దేశాలను తిరిగివచ్చి విదేశీ గుత్త సంస్థలు, ప్రవాస రాష్ట్రీయులు మందలు మందలుగా పెట్టుబడి సంచులు తీసుకుని వచ్చి పడబోతున్నారని ప్రచారం చేసుకున్నారు. ప్రజల్లో కొంత మందిలోనైనా ఈ ప్రచారం ద్వారా ఆశలు కలిగించగల్గారు. దేశవారి పెట్టుబడిదారులను కూడా రాష్ట్రాలకు ఆహ్వానించి విందు భోజనాలు నిర్వహించి, రాష్ట్ర అభివృద్ధికి సహాయపడాలని ఇద్దరు నాయకులు అభ్యర్థనలు కురిపిస్తున్నారు. సమావేశాల ఫోటోలను మీడియాలో ప్రముఖంగా వచ్చేట్లు చూసుకుంటున్నారు. వచ్చినవారు కూడా పెట్టుబడులు పెడతామని, అభివృద్ధికి సహాయపడతామని ఉదారంగా చెబుతూనే ఉన్నారు. అనేక మంది ప్రముఖులు గ్రామాలను దత్తత తీసుకుంటామని ప్రకటించడం ఇందులో భాగమే. దీనిలో అత్యధిక భాగం ప్రచార స్టంటే. సామాజిక బాధ్యత పేరుతో ప్రతి కార్పొరేట్ సంస్థ కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు ఖర్చుపెట్టాలన్న నిబంధన చట్టపరంగానే ఉన్నది. దానిలో భాగంగానే కార్పొరేట్ సంస్థలు తమ ప్రచారానికి పనికివచ్చేట్లుగా కొన్ని కార్యక్రమాలను చేయడం, చేసినదానికన్నా ఎక్కువ ప్రచారం చేసుకోవడం అలవాటైంది. అలాగే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించినప్పుడు వారికి పన్నులు మినహాయింపు కూడా ఉంటుంది. లాభాలు తగ్గకుండానే ప్రచారానికి ప్రచారం, పేరుకుపేరు అన్నీ పోగుచేసుకోవచ్చు. గ్రామాల దత్తత కార్యక్రమం కూడా ఇటువంటిదే.

గ్రామాలను దత్తత తీసుకున్న పెద్దలు – టెండూల్కర్, శృతిహాసన్, మహేష్‌బాబు, ప్రకాష్‌రాజ్, టాటా కావచ్చు. బిల్‌గేట్స్ కావచ్చు– నిజాయితీగా దత్తత తీసుకున్న గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారనుకున్నా వారి కార్యకలాపాలు ప్రజల బ్రతుకుల్లో మౌలికమైన మార్పులేమీ తీసుకురావు. గుళ్లు, గోపురాలు కట్టించవచ్చు, కొంతైనా సామాజిక స్పృహ ఉంటే బడుల్లో సౌకర్యాలు, రోడ్లు ఇటువంటి వాటికి కొంత సహాయపడవచ్చు. కానీ గ్రామ జీవనంలో ప్రధానంగా అభివృద్ధికి ఆటంకంగా ఉన్న సమస్యలను – నిరుద్యోగాన్ని గాని, గృహ, భూ వసతి లేకపోవడం గాని, అంటరానితనం, కుల వివక్షకు గాని, నిరక్షరాస్యతను గాని, పోషకాహారలేమీని గాని, రైతుల అప్పుల సమస్యలను గాని – పరిష్కరించడం ఈ దత్తత తీసుకున్నవారి అజెండాలో ఉండదు. అందు వలనే ప్రచారం కోసం చేసినా, నిజాయితీగా చేసినా గ్రామ దత్తత కార్యక్రమాలు పెద్ద మార్పుకు దారి తీయవు. ఎక్కడైనా, ఎవరైనా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసారనుకున్నా అది షోకేస్‌గానే మిగులుతుంది. ప్రభుత్వమే గ్రామాల అభివృద్ధికి పూనుకున్నప్పుడే, మౌలిక సమస్యలు పరిష్కరించినప్పుడే గ్రామాలకు పునర్జీవనం వస్తుంది తప్ప దత్తత వలన కాదు.

సరళీకరణ విధానాలను అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటు గ్రామీణాభివృద్ధికి, ఇటు సంక్షేమ పథకాలకు కేటాయిస్తున్న నిధులను తీవ్రంగా కోత పెడుతున్నాయి. క్రమేణా సంక్షేమం నుండి తప్పుకుంటున్నాయి. ప్రభుత్వరంగం (విద్య, వైద్యం, పరిశ్రమలు) బలహీనపడడంతో రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్లు కూడా నిరుపయోగమవుతున్నాయి. ఈ పరిణామాలు ప్రజల్లో తీవ్రంగా అసంతృప్తిని పెంచుతున్నాయి. ఈ అసంతృప్తిని బలహీనపర్చేందుకు, దారిమళ్ళించేందుకు కార్పొరేట్ శక్తులు, గొప్ప వ్యక్తులు నిర్వహిస్తున్న దత్తత కార్యక్రమం ద్వారా భ్రమలు సృష్టిస్తున్నారు. గొప్పవాళ్లు వచ్చి ఏదో ఒకరోజు మా గ్రామాన్ని కూడా దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తారని ఎదురుచూసే మనస్థత్వాన్ని ప్రజల్లో పెంచుతున్నారు. తద్వారా కార్పొరేట్ సంస్థలు ప్రజల శ్రమను పీల్చుకుతింటున్న దోపిడీదార్లన్న వాస్తవాన్ని ప్రజలు విస్మరించేట్లు చేస్తున్నారు. అయితే ఈ భ్రమలు ఎక్కువ కాలం ఉండవు. తమ సమస్యలు ఇటువంటి చౌకబారు ఎత్తుగడలు పరిష్కారం చేయవని ప్రజలు త్వరలోనే గమనిస్తారు. అప్పుడు నిజమైన పరిష్కారాల కోసం తమ సంఘటిత శక్తిమీద ఆధారపడి కృషి చేయడానికి ముందుకువస్తారు. అటువంటి చైతన్యాన్ని కల్పించడానికి వామపక్ష, ప్రజాతంత్ర్య శక్తులు ఓపిగ్గా కృషి చేయాల్సి ఉంది. ❉

# తీవ్రమౌతున్న ఆర్థిక అంతరాలు

(31వ పేజీ తరువాయి)

పక్షపాతంతో వ్యవహరిస్తూ ఉన్నాయి. అందువల్లనే సామాజిక బాధ్యతలు నెరవేర్చిన మొదటి నాలుగున్నర దశాబ్దాల్లో ఆర్థిక అసమానతలను కొంతమేరకు అదుపు చేయగలిగిన ప్రభుత్వం, ఆర్థిక సంస్కరణలు ప్రారంభించాక ఈ లక్ష్యం నుండి వైదొలగింది. దాంతో అనివార్యంగా ఆర్థిక అసమానతలు పేట్రేగిపోతున్నాయి. ఈ విషయాన్ని అసంఘటితరంగ కార్మికుల స్థితిగతులు అధ్యయనం చేసిన అభిజిత్ సేన్ గుప్త కమిటీ నివేదిక మొదలు నిన్న మొన్న విడుదలైన సామాజిక ఆర్థిక సర్వే వరకు పలు ప్రభుత్వ నివేదికలే ధృవీకరించాయి.

ప్రపంచ వ్యాప్తంగా సామాజిక రంగాలపై పెట్టే వ్యయం ప్రపంచ స్థూల ఉత్పత్తిలో 8.8 శాతం ఉంటే భారతదేశంలో మాత్రం అది కేవలం 5.2 శాతానికి పరిమితం అయ్యింది. ఇందులో 3.5 శాతం రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో జరిగే వ్యయమే. కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగే సామాజిక సంక్షేమ వ్యయం కేవలం 1.7 శాతం మాత్రమే. 12వ ప్రణాళిక ఈ వ్యయాన్ని కనీసం 4.3 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టింది. ప్రణాళిక సంఘం స్థానంలో తెరమీదకు వచ్చిన నీతి అయోగ్ దీనికి భిన్నంగా మొత్తం సామాజిక వ్యయాన్ని నియంత్రించటానికి ఏకంగా ఒక ఉపసంఘాన్నే నియమించింది. ఈ పరిస్థితుల్లో సామాజిక సంక్షేమాన్ని కాపాడుకోవటం కోసం, ప్రత్యేకించి గ్రామీణ పేదలకు ఉన్న సామాజిక సంక్షేమ వ్యవస్థలను కాపాడి కొనసాగించుకునేందుకు జరిగే పోరాటం నేటి పరిస్థితుల్లో పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటమే అవుతుంది. ఆర్థిక అంతరాల పట్ల ఆందోళన వ్యక్తం చేసే ప్రతి ఒక్కరూ ఈ సామాజిక భద్రతను పటిష్టం చేసేందుకు ముందుకొచ్చే డిమాండ్లను బలపర్చాలి. ఆ డిమాండ్లు ముందుకు తెచ్చే వర్గాలు, శక్తులు, సంఘాలకు సంఘీభావంగా నిలవాలి. ఈ నినాదం ప్రాతిపదికనే గ్రామీణ పేదలను, గ్రామీణేతర పేదలను ఐక్యం చేసే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలి. సెప్టెంబరు 2 శ్రామిక వర్గపు సమ్మె, సెప్టెంబరు 1 రైతాంగం, వ్యవసాయ కార్మికుల కోర్కెల సాధన దినంగా పాటించి, కార్మిక, కర్షక వర్గాలు ఐక్యంగా సరళీకరణ విధానాలను ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఈ ఐక్యతను మరింతగా బలోపేతం చేసి, పోరాటాలను ముందుకు తీసుకుపోవాలి. ❉

# వర్ణ వ్యవస్థ

(22వ పేజీ తరువాయి)

బ్రాహ్మణీయ సంస్కృతి ఈ గడ్డపై నుండి అదృశ్యమయ్యేదాకా ఈ జాతికి విముక్తి లేదు. ఏ యుగంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా అశాస్త్రీయ సాంప్రదా యాలకు, శాస్త్రీయ విప్లవ భావాలకు ఘర్షణ తప్పదు. ఈ ఘర్షణ లోంచే నూతన విలువలు ఆవిర్భవించగలవు. ఇంటిలోని దుమ్ముదుల పనిదే బొద్దింకలు సాలెగూళ్ళు పోవు. ఈ దేశ ప్రగతికి అడ్డుగోడగా నిలిచిన ఈ వర్ణవ్యవస్థపై పోరాడకుండా అభ్యుదయాన్ని సాధించలేము. ఈ ప్రయత్నాన్ని ప్రాచీనకాలంలో చార్వాకులు, కొంత మేరకు జైనులు, బౌద్ధులు చేశారు. మధ్యయుగాల్లో వేమన ఆధునిక యుగంలో అంబేద్కర్, పూలే, రాజా రామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, గురజాడ, కందుకూరి తదితరులు కొనసాగించారు. నేడు సామాజికశక్తులు, దళిత సంఘాలు కొంత కృషి చేస్తున్నాయి. కమ్యూనిస్టులు వర్గ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ సమసమాజం కోసం కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో నూతన సంస్కృతికి బీజాలు పడుతున్నాయి. ఈ వర్ణవ్యవస్థ దౌష్ట్యానికి బలైన శూద్రులు, పంచములు నేటికీ అణగారిపోయి, సమస్యలతో పోరాడుతున్నారు. ఈ దళితవర్గాల హక్కులకోసం ఒకవైపు కులవ్యవస్థ వ్యతిరేక పోరాటాలు, మరోవైపు దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా వర్గపోరాటాలు జరుగుతున్నాయి. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు వారి జనసంఖ్యకు అనుగుణంగా బడ్జెట్లో వాటా వంటి అంశాలపై పోరాటాలు సాగుతున్నాయి. ఈ పోరాటాలకు ప్రతి అభ్యుదయవాదీ మద్దతివ్వాలి. ఈ పోరాటక్రమంలో కుల సమస్యపై మరింత అవగాహన కోసం చిత్తజల్లు వరహాలరావు (సివి)గారి రచన 'వర్ణవ్యవస్థ' ఉపయోగపడగలదు. ❈

---

# విద్యుత్ సంస్కరణలు

(28వ పేజీ తరువాయి)

తెస్తున్నారు. మార్కెట్లో అమ్మకం-కొనుగోలు అంటే ఏ ప్రాంతంలో నివశించే విద్యుత్ వినియోగదారుడైనా ఏ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సరఫరా కంపెనీ నుండి అయినా సేవలు పొందటానికి అవకాశం కల్పించే వెసులుబాటు అన్నమాట. అసలు ఈ బహిరంగ అమ్మకం-కొనుగోలు అన్న విధానమే పెద్ద మిథ్య. విద్యుత్ భౌతికశాస్త్ర సూత్రాలు పాటిస్తుంది. మార్కెట్ సూత్రాలు కాదు. టాటా కంపెనీ నుండి మీ ఇంటిదాకా విద్యుత్ సరఫరా చేయటానికి ఫ్లిఫ్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ కంపెనీలు లేవు. ఈ పద్ధతిలో ఖరీదైన కొత్త మీటర్లు వినియోగదారుల ఇళ్ల గోడలకు వేళ్లాడతాయి. ఈ మీటర్లు మొత్తం వినియోగదారుడు కొన్న విద్యుత్ ఎన్ని యూనిట్లు, వాడిన యూనిట్లు ఎన్ని అని లెక్కలు కడతాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని పర్యవేక్షించటానికి పెద్దఎత్తున గణాంక నిపుణుల యంత్రాంగం పని చేస్తుంది. ఈ యంత్రాంగం ఏ వినియోగదారుడి ఇంటికి ఏ కంపెనీ నుండి ఎన్ని యూనిట్ల కరెంటు వాడుకున్నారు. ఏ వినియోగదారుడు ఏ కంపెనీకి ఎంత బిల్లు చెల్లించాలి అన్నది నిర్ధారిస్తుంది. అదేవిధంగా విద్యుత్ సరఫరా కంపెనీలు ఏ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ నుండి ఏ మోతాదులో విద్యుత్ సమీకరించాయో కూడా లెక్క గడుతుంది. ఈ విధంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి వినియోగదారుల ఇళ్లకు చేరే వరకు అన్ని దశల్లోనూ లెక్కవేస్తారు. స్థూలంగా చూసినపుడు నేరుగా విద్యుత్ కంపెనీ నుండి సరఫరా అయ్యేటపుడు వచ్చే బిల్లు కంటే ఈ విధంగా సరఫరా చేయటం వల్ల ఆయా నిర్వహణ ఖర్చు అంతా కలిసి బిల్లు తడిసి మోపెడవుతుంది.

ఈరకమైన మార్కెట్లో అమ్మకం- కొనుగోలు విధానం ఎక్కడైనా పనిచేసిందా? కొన్ని దేశాలు ఈ ప్రయోగం చేశాయి. భారీ మొత్తంలో తక్కువ ధరకు కొని విద్యుత్ వినియోగించే వారి విషయంలో మాత్రమే ఈ పథకాలు ఉపయోగపడతాయి. పంపిణీ అయ్యే విద్యుత్ మోతాదులో మార్పు లేకుండా భారీ మోతాదులో వినియోగించేవారికే ప్రయోజనం కలిగినపుడు నష్టపోయేది ఎవరు? చిన్న చిన్న వినియోగదారులే అనటంలో సందేహం లేదు. సాధారణ వినియోగదారుల ఇళ్లు చీకట్లో ముంచేసి మొత్తం విద్యుత్‌ను నామమాత్రపు ధరలకు భారీ వినియోగదారులకు, పారిశ్రామిక వినియోగదారులకు సరఫరా చేయటం అంటే పేదల కడుపుకొట్టి పెట్టుబడికి ప్రయోజనం కల్పించే పద్ధతుల్లో ఇది కూడా ఒక పద్ధతిగా మారనుంది.

2002లో యూనిట్ విద్యుత్ ధర 1.37 రూపాయల నుండి 2013 నాటికి 5.87 రూపాయలకు పెరగటం కాకతాళీయం కాదు. చౌకగా కావల్సినంత విద్యుత్ సరఫరా చేస్తామన్న వాగ్దానంతో ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు ప్రారంభించాయి. ఈ వాగ్దానం నెరవేర్చటానికి బదులుగా పేదలను నిరుపేదలుగా మార్చాయి. పెట్టుబడికి లాభాలు పోగేశాయి. బ్యాంకులను ఇరకాటంలోకి నెట్టాయి. ఇన్ని అనుభవాల తర్వాత మార్కెట్లో అమ్మకం- కొనుగోలు వంటి పిచ్చి ప్రయోగాలు వదిలిపెట్టి విద్యుత్ రంగాన్ని తిరిగి పట్టాల మీదకి తెచ్చేందుకు కృషి చేయాలి. ప్రస్తుతం విద్యుత్ రంగానికి కావల్సింది అర్థవంతమైన పరిష్కారాలు. అర్థం లేని నినాదాలు కాదు. ❈

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**ప్రొఫెసర్ కల్బుర్గి** (2వ పేజీ తరువాయి)

రచించబడిన కాలం నాటి కన్నడ సాహిత్యంపై ఆయన పరిశోధన చేసారు. క్రీ.శ 850లో విరచితమైన ఈ రచన కన్నడ సాహిత్యంలోని కవిత్వం, వ్యాకరణం తదితరాలను విశ్లేషించిన ప్రాచీన రచనలో ఒకటి.

కన్నడ సాహిత్య చరిత్ర అనేక శాఖల్లో ఆయన కృషి కొనసాగింది. ఆయన కన్నడ సాహిత్య ప్రపంచంలో అపార ప్రభావాన్ని చూపిన రచనలను చేసిన బహుముఖ పరిశోధకుడిగా ఆయన తన్నుతాను మల్చుకొన్నారు. కర్నాటక చరిత్ర, దాని సంస్కృతి, జానపద వాంగ్మయం పై గట్టి పట్టున్న వారిలో ఆయన ముందు వరుసలో నిలుస్తారు. కన్నడ చరిత్రపై ఆయనకున్న గాఢాభినివేశం కారణంగా ఆయన ప్రాచీన శాసనాల అధ్యయనంలో నిపుణిడిగానూ, కన్నడ భాషపై ఆధిపత్యం సాధించిన పండితుడిగానూ ప్రసిద్ధిగాంచారు.

పలు సంవత్సరాలుగా కల్బుర్గి, మతోన్మాద భావజాలంతో ఉండే వివిధ వ్యక్తులు, సంస్థలకు ఏ మాత్రం రుచించని వ్యాఖ్యలు చేసారు. బసవ అనుచరులైన లింగాయుతులు, హిందూ మతానికి భిన్నమైన వారని ఆయన గాఢంగా విశ్వసించారు. హిందూ మతంతో సంబంధాల కారణంగా లింగాయతులు వారి ప్రత్యేక అస్థిత్వాన్ని కోల్పోయారని ఆయన భావించారు.

కర్నాటకలో మొట్టమొదటి మతం లింగాయత ధర్మమే తప్ప హిందూ మతం కాదని ఆయన అన్నారు. ఈ లింగాయత ధర్మానికి మతపరమైన తాత్విక వివరణ వచనాలలో దొరుకుతుంది. కర్నాటక ఈ వారసత్వ సంపదను మరచిపోయింది. దానికి మారుగా హిందూ మతానికి చెందిన చిహ్నాలను స్వీకరించడం ద్వారా సాధికారత కోసం వెంపర్లాడుతోంది.

పూజారితోగాని, దేవాలయాల సందర్శనతో గాని నిమిత్తం లేకుండా, ప్రతి మనిషి నేరుగా దేవుడితో వ్యక్తిగత బాంధవ్యాన్ని నెలుకొల్పుకోగల కుల రహిత సమాజాన్ని ప్రబోధించిన బసవడి భావాలకు పూర్తిగా వ్యతిరేకమైన లింగాయతుల 'బ్రాహ్మలు', లేదా పూజారి వర్గమైన జంగమలను ఆయన విమర్శించారు. లింగాయతుల ఆచారాలలోని విగ్రహపూజతో సహా అనేక క్రతువులను ఆయన త్రోసిపుచ్చారు.

ఒక బహిరంగ వేదికలో ఆయన తనకు వచనాల సాహిత్యం ఆరాధ్యమైన మత గ్రంథమని పేర్కొంటూ భగవద్గీతను తన మత గ్రంథంగా గుర్తించడానికి తిరస్కరించారు. 2015 ఏప్రిల్ నెలలో కర్నాటకలో కులాన్ని పరిగణనలోకి తీసుకుంటూ సాగిన సామాజిక, విద్యారంగ సర్వే సమయంలో కల్బుర్గి లింగాయతులను ఒక ప్రత్యేక మతంగా గుర్తించాలని డిమాండును లేవనెత్తారు.

కల్బుర్గి నాస్తికుడు కాదని గుర్తుంచుకోవాలి. తాను బసవ అనయాయినని ఆయన చెప్పుకున్నారు. అయితే ఆయన రెండు విషయాలపై పట్టుదలతో ఉన్నారు. 'లింగాయత సంప్రదాయం హిందూమతానికి భిన్నమైనదని,' 'లింగాయతుల సంప్రదాయంలో ప్రవేశించిన క్రతువులన్ని మూఢాచారాలే తప్ప ఆ మతంలో భాగం కాదు' అని ఆయన చెప్పేవారు. నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారేల వలే ఆయనను హేతువాది అని అనిలేం. కాని ధైర్య సాహసాలతో కూడిన ఆయన పద్ధతులు ఆ ఇద్దరు మహారాష్ట్ర హేతువాదుల పద్ధతులతో పోలి ఉంటాయి. కల్బుర్గిని ఒక సంస్కర్తగా పేర్కొనడం సమంజసంగా ఉంటుంది.


గత కొన్ని సంవత్సరాలుగా ఆయన హిందుత్వ గ్రూపులపై కూడా విమర్శలు గుప్పించారు. 2014లో ఒక సెమినార్‌లో విగ్రహారాధనను గేలి చేస్తూ యు.ఆర్. అనంత మూర్తి చేసిన వ్యాఖ్యలకు ఆయన సమర్ధన బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. ప్రతిపాదిత కర్ణాటక మూఢాచారాల నిరోధక బిల్లుపై సెమినార్ నిర్వహించిన భూపతి, కల్బుర్గి వ్యాఖ్యపై మీడియా పెద్ద సంచలనాన్ని సృష్టించిందని అన్నారు. ఆ రోజున ఆయన అనేక ప్రయోజనకరమైన ఇతర వ్యాఖ్యలు కూడా చేశారు. అయితే మీడియా ఈ ఒక్క వ్యాఖ్యనే లంకించుకుంటుందని ఆయన తెలిపారు. తోడ్కుర్ ఇలా అన్నారు. ఆ మరుచటి రోజు కన్నడ దిన పత్రికలో పతాక శీర్షికను చూసి మాస్టారు నాతో ఇలా అన్నారు 'ఈ విలేకరి నా జీవిత కాలాన్ని ఒక పదేళ్లు తగ్గించివేశాడు'. తన వ్యాఖ్యలు కొందరికి కంటగింపుగా ఉన్నాయని ఆయనకి తెలుసు. అయితే స్వభావరీత్యానే ఆయన ముక్కుసూటిగా మాట్లాడతారు. తన వ్యాఖ్యల్లో కొంచెం వాడిని తగ్గించుకోమని మేము చెబితే ఆయన నాతో ఇలా అన్నారు. 'మత మౌఢ్యవాదులకు నేనెందుకు భయపడాలి. వారు మహాత్మా గాంధీ, బసవ వంటివారినే వదిలిపెట్టనప్పుడు, ఆ మహానుభావుల ముందు నేనెంత వాడిని' అని అన్నారు. భారతీయ జనతాపార్టీ గత రెండు దశాబ్దాల కాలంలో లింగాయతులలో ప్రధాన రాజకీయ పార్టీగా ఎదిగిన వైనంపై కర్నాటకలోని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించేది లేదన్నారు. లింగాయతులు కర్ణాటకలోని అతి పెద్ద సామాజిక విభాగంగా, ఉత్తర కర్ణాటక అంతా విస్తరించి ఉన్నారు. అందుచేత లింగాయతులలో సంస్కరణల కోసం కల్బుర్గి యొక్క తీవ్ర అభినివేశం హిందుత్వ శక్తులకు కంటగింపుగా మారింది. ఉదాహరణకు లింగాయతులు గణేశ్ చతుర్థి ఉత్సవాన్ని నిర్వహించుకోవడానికి వ్యతిరేకంగా కల్బుర్గి చేసిన వ్యాఖ్యలు హిందుత్వ మితవాద శక్తులకు మింగుడు పడలేదు. హిందుత్వ బృందాల మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా కల్బుర్గి బహిరంగ వేదికలపై నుంచి తరుచుగా మాట్లాడేవాడు.

హత్యకి గురయ్యే సమయానికి కల్బుర్గి 16, 17 శతాబ్దాలలో ఉత్తర కర్ణాటకలో పాలించిన అదిల్‌షాహి వంశకాలంలో రచనా శైలిపై ఒక పరిశోధన చేస్తున్నారు. పర్షియా, అరబ్బు, ఉర్దూ భాషాలోని రచనలను కన్నడంలోకి తర్జుమా చేయాలని ఆయన భావించారు. రాష్ట్ర చరిత్రను వివరించే క్రమంలో కర్ణాటకలోని చరిత్రకారులు, కర్ణాటక యొక్క మధ్య యుగాల చరిత్రను పూర్తిగా విస్మరించి, తద్వారా ముస్లిం పాలకులు పట్ల ఘోర అపచారం చేశారని ఆయన అభిప్రాయం. కన్నడ పరిశోధనకు అపారమైన సమాచార భాండాన్ని అందించే ఆ ప్రాజెక్టు గురించి ఆయన ఎంతో ఉత్సాహపడ్డారు. 'ఈ రచనలు ప్రచురితమైన వెంటనే మనం కర్ణాటక చరిత్రను తిరగరాయాల్సి ఉంటుంది' అని ఆయన అన్నారు.

కల్బుర్గి హంతకులను పట్టుకోవడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా విషయంగా తీసుకోవాలి. అలాచేయడం ద్వారా రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో తాను అప్రమతంగా ఉన్నాననే సందేశాన్ని అందివ్వగలదు. దభోల్కర్ హత్య, 2013లో మహారాష్ట్ర ప్రభుత్వం మూఢ నమ్మకాలను, అనాచారాలను, చేతబడిని నిరోధించేదుకు బిల్లును ఒక ఆర్డినెన్స్ రూపంలో రావడానికి దారితీసింది. కర్నాటకలో ప్రతిపాదిత మూఢాచార వ్యతిరేక బిల్లుకు కల్బుర్గి ఒక గట్టి మద్దతు దారుడు కనుక కర్నాటక ప్రభుత్వం కూడా ఆయన స్మృతిని గౌరవిస్తూ అటువంటి బిల్లును తక్షణమే ఒక ఆర్డినెన్స్ రూపంలో తేవాలి. అలాగే పౌర సమాజంలో ఉన్న శాంతి హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకునేవారు, ప్రజాస్వామ్య మనుగడ కోసం పోరాటం చేసేవారు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా నిలబడే వారు, హేతువాదులు, కులశక్తుల మీద పోరాటం చేసేవారు, సంస్కరణవాదులు, సంఘసంస్కర్తలు, పురోగమివాదులు, ప్రగతిశీల నాయకులు తదితరులందరూ ఇటువంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా గళం విప్పాలి. ప్రభుత్వాల్ని ప్రశ్నించాలి. భావి భారత పౌరులను ఈ కుంపట్లోకి పోకకుండా కాపాడాలి. అలాగే కల్బుర్గి చేసిన కృషిని మరింత లోతుగా, మరింత పట్టుదలతో, సాహసంతో ముందుకు తీసుకెళ్ళేందుకు కర్తవ్యాఖులవ్వాలి. అప్పుడే ఆయనకు నిజమైన నివాళి. (ఫ్రంట్‌లైన్ సౌజన్యంతో)

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-10-2015 Postal Regd. No L1/SD/407/13-15

# పెట్టుబడిదారుల కపటత్వం



**జం**తువులతో వ్యవహరించాల్సి వచ్చినపుడు పెట్టుబడిదారులు చాలా సున్నితంగా, దేవదూతలలాగా వ్యవహరిస్తున్నట్లు నటిస్తారు. కార్మికులకన్నా జంతువులకు దగ్గరి బంధువుల వలె తమకుతాము భావించుకుంటారు. కపటత్వాన్ని ప్రదర్శించటంలో అధికారిక దేశమైన ఇంగ్లాండ్‌లో ఎక్కడబడితే అక్కడ కుక్కలను, పిల్లులను, పిచ్చుకలను కాపాడటానికి, పెంచటానికి సొసైటీలుంటాయి. పలుకుబడి కలిగిన కొంతమంది ఈ సొసైటీలకు అధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఉంటూ, జంతువుల కోసం కేటాయించిన ధనాన్ని తమకు ఇష్టమొచ్చిన విధంగా, వృధాగా ఖర్చు పెడుతుంటారు. జంతు ప్రేమికులుగా చెప్పుకోవటానికి కావలసిన అన్ని అర్హతలు తమకున్నాయని తమకుతాముగా వారు భావించుకొంటుంటారు.

జంతువులపై పరిశోధనలు చేయటం సహించలేని కొందరు వాటిపై పరిశోధనలను నిషేధిస్తూ పార్లమెంటులో చట్టం చేయించారు. పెట్టుబడిదారులు ప్రముఖులతో ఏ విధంగా వ్యవహరిస్తారనేదానికి ఇదొక ఉదాహరణ. పరిశోధనాశాలలో కూడా శాస్త్రవేత్తలు పోలీసుల పర్యవేక్షణలో పనిచేయాల్సిన పరిస్థితిని కల్పించారు. పరిశోధకులకు ఆటంకం కలిగించిన సమాజం ధనికులకు సంతోషం కలిగించే పనుల్లో– పావురాళ్ళను ఎగురవేసి తుపాకితో కాల్చిచంపటం– మాత్రం వాళ్ళు జోక్యం చేసుకోలేదు. జంతువులను పెంచటాన్ని, వాటిని ఇబ్బందులకు గురిచేయటానికి అంగీకరించని వాళ్ళుకూడా పావురాలను తుపాకితో కాల్చిచంపటానికి ఏ మాత్రం అభ్యంతరం చెప్పరు. అలా పావురాలను కాల్చిచంపేవారిలో కొందరు సమాజంలో బాగా పలుకుబడి కలిగినవారుగా ఉండటమే అందుకు కారణం.

జాన్‌సిమ్మన్స్ ఇంగ్లీష్ ఫ్యాక్టరీల పర్యవేక్షక అధికారి. పెట్టుబడిదారులు వారి శ్రమ ఫలితాన్ని కాజేయటానికి పిల్లలను, మహిళలను, కార్మికులను పెట్టే చిత్రహింసలను కళ్ళారా చూశాడు. తాను చూసిన రెండు విధాలైన హింసను గురించి ఆయన కాంగ్రెస్‌లో చెప్పాడు. ఒకరకం హింస జంతువులపై ప్రయోగించేది. రెండవరకం, 1848–49, 1853–54 సంవత్సరాలలో కలరా వ్యాపించినపుడు ఒక పేరుగాంచిన వాణిజ్యసంస్థ లండన్‌లోని దక్షిణ జిల్లాలలోని 5,00,000 మంది ప్రజలకు కలుషిత నీటిని సరఫరా చేసింది. ఈ సమయంలోనే టిబి ఉన్న ఆవుపాలు తాగితే టిబి వస్తుందో, రాదో తెలుసుకోవటానికి ఆవుపాలను ప్రజలకు సరఫరా చేశారు. జంతువులపై పరిశోధనలు చేసేవారు వారి పరిశోధనల కోసం కొన్ని ఎలుకలను, కుక్కలను చంపారు. జబ్బునపడ్డ ఆవుల పాలు అమ్మినవారు వేలాదిమంది మృతికి కారణమయ్యారు. రెండు సంవత్సరాల క్రితం బియ్యం పిండితో పౌడర్ తయారు చేసి అమ్మే వ్యాపారి కింగ్ పౌడర్‌లో మట్టి, విషపూరితమైన రసాయనాలను కలిపి అమ్మాడు. సున్నితమైన చర్మం ఉన్న బాలలు విషప్రభావంతో మరణించారు. వైద్య పరీక్షలు కూడా విషప్రభావంతోనే బాలలు మరణించారని రుజువు చేశాయి. కింగ్‌ను కోర్టు ముందుకు తీసుకొచ్చారు. జ్యూరీలోని 12 మంది కింగ్‌ను విడిచిపెట్టాలని చెప్పారు. అంతకు కొన్ని వారాలు ముందు యూరప్, అమెరికాల్లో పేరుగాంచిన ఇంగ్లీష్ శాస్త్రవేత్త ఫెర్రర్ పోలీసుల నుండి అనుమతి తీసుకోవటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడు. ఆయనకు జరిమానా విధించారు.

పెట్టుబడిదారుల కపటత్వం ఎక్కడికి దారితీస్తుందనేదానికి ఇవి కొన్ని ఉదాహరణలు. పౌడర్‌లో విషం కలిపి బాలల మరణానికి కారకుడైన కింగ్‌ను విడుదల చేశారు. ఏమాత్రం లాభాపేక్షలేకుండాతన పరిశోధనలను శాస్త్రీయంగా నిరూపించుకోవటానికి కోతులపై పరిశోధనలు చేస్తున్న ఫెర్రర్‌కు జరిమానా విధించారు.

**(పాల్ లాఫార్గ్ రాసిన "పెట్టుబడిదారుల కపటత్వం" వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.5. Published on October 1, 2015